




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ట్రంప్ వాణిజ్య యుద్ధం : నేటి సామ్రాజ్యవాదం

జాతీయ యవనికపై మరోసారి తెలంగాణ

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 154 | ఆదివారం | 04-05-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# పాకిస్థాన్ నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం

- తక్షణం అమలులోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- జాతీయ భద్రత, ప్రభుత్వ విధానానికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- నిలిచిపోనున్న ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు
- పాకిస్థాన్ నౌకలపైనా నిషేధం
- తపాల సేవలూ రద్దు




**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ నుండి భారతదేశంలోకి వచ్చే అన్ని దిగుమతులపై తక్షణ నిషేధాన్ని భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వువల్ల పాకిస్థాన్ నుండి వచ్చే అన్ని దిగుమతులు తక్షణ ప్రాతిపదికపై నిలిచిపోతాయి. జాతీయ భద్రత, ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం నాడు ఉత్తర్వులో స్పష్టం చేసింది. 2019లో పాకిస్థాన్ నుండి దిగుమతయ్యే వస్తువులపై 200 శాతం మేరకు సుంకాలు అమలు చేసినప్పటికీ పుల్వామాలా జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడి తర్వాత ప్రత్యక్ష దిగుమతులను నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం పాకిస్థాన్ సరుకులను మరో దేశం ద్వారా భారత్‌లోకి ప్రవేశించకూడా ఇప్పుడు తక్షణం రానివ్వకుండా ఉత్తర్వు జారీ చేశారు. 2024 –25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జనవరి నెలలమధ్య భారత్ నుండి పాకిస్థాన్‌కు 447.65 మిలియన్ డాలర్లు ఎగుమతులు జరిగాయి. కానీ దిగుమతులు మాత్రం చాలా తక్కువగా 0.42 మిలియన్ డాలర్ల మేరకే జరిగాయి. అంజీర, తులసి, దవళము వంటి హెర్బల్ ఉత్పత్తులను వరుసగా 78,000 డాలర్లు, 18,856 డాలర్లు మేరకు దిగుమతి చేసుకున్నాం, హిమాలయ పింక్ సాల్ట్ కూడా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2.88 మిలియన్ డాలర్ల మేరకు ఉత్పత్తి చేసుకున్నాం. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ ఒక విదేశబు వాణిజ్య విధానం కింద ప్రత్యక్ష, పరోక్ష వాణిజ్య ఉత్పత్తుల రవాణా పాకిస్థాన్ నుండి జరగడానికి వీల్లేదని తాజా ఉత్తర్వు సారాంశం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) మే రెండో నాడు ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీంట్లో ఎలాంటి మినహాయింపులైనా అవసరం అయితే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాల్సిందేనని ఉత్తర్వు పేర్కొంది. పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత పరిణామాల్లో భాగంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ద్వారా పాకిస్థాన్ నుండి ఏ ఇతర వాణిజ్య మార్గాల నుండైనా వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు యుద్ధ ప్రాతిపదికపై నిలిచిపోతాయి. పహల్గామ్‌లో దాడి తర్వాత భారత ప్రభుత్వం అనేక వరుస తరువాయి 2లో

ఉగ్రవాదులను అణచివేసేందుకు

## అంగోలాకు 200 బి.డాలర్లు సాయం

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులను అణచివేసేందుకు ఆంగోలా దేశానికి భారతదేశం ఆర్థిక సహాయం ప్రకటించింది. దక్షిణాఫ్రికాలో పశ్చిమ మధ్య తీరప్రాంత దేశం ఆంగోలా సాయుధ బలగాలకు 200 బిలియన్ డాలర్లు రక్షణ పరపతి సహాయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారంనాడు ప్రకటించారు.ఉగ్రవాదులకు వ్యతిరేకంగా కృతనిశ్చయంతో నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల వెనుక సూత్రధారులను వదిలిపెట్టకూడదని ఆయన కోరారు. భారత్‌లో పర్యటించిన ఆంగోలా దేశాధ్యక్షుడు జకావో మాన్యువల్ గోన్కాల్వ్స్ లారెన్కోతో మోదీ విస్తారంగా సంభాషణలు చేశారు. ఆ తర్వాత మోదీ పైవిధంగా వ్యాఖ్యానించారు.రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకోవడం, ప్రభుత్వ మౌలిక సదుపాయాలలో డిజిటల్ సేవలను ప్రవేశపెట్టే విషయంపై కూడా నాయకులు దృష్టి సారించారు. ప్రధానమంత్రి మోదీ మీడియాకు తరువాయి 2లో

రంగనాయకసాగర్‌లో

## నీటమునిగి ఇద్దరు మృతి

మరో ఇద్దరిని కాపాడిన స్థానికులు



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం చంద్లాపూర్ గ్రామ పరిధిలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద శనివారం విషాదం చోటుచేసుకుంది. దంచికొడుతున్న ఎండలకు సేద తీరేందుకు వచ్చిన వారిలో నలుగురు రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో నీట మునిగి నలుగురు గల్లంతుయ్యారు. వారిలో ఇద్దరిని స్థానికులు కాపాడగా,ఇద్దరు చనిపోయారు. చనిపోయిన బాలుడు,బాలికల తరువాయి 2లో



## ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురు మృతి, మరో 70కిపైగా మందికి భక్తులకు గాయాలు

05



నాలుగు రోజులు

## తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో అకాల వానలు
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఈ వేసవికాలంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. పగటిపూట వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే వర్షాలతో చల్లటి వాతావరణం ఉపశమనాన్ని కలిగిస్తోంది. పగటిపూట ఎండలు దచ్చికొడుతుండగా సాయంత్రం తరువాయి 2లో



## కులగణనకు వ్యతిరేకం కాదు

- 5న అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ ప్రారంభం
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కులగణన చేయని తెలంగాణ ఎలా రోల్ మోడల్ అవుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణనకు తాము వ్యతిరేకం కదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసిందని ఆరోపించారు. అది కూడా తూతూమంత్రంగా ముగించిందని విమర్శించారు. మత ప్రతిపాదికన ముస్లింలను బిసిల్లో చేర్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో మొదటి సారి కుల గణన జరుగుతోందని, ఆది మోదీ గొప్పతనమన్నారు. కులగణన అంటే రాజ్యాంగం ప్రకారం, చట్టప్రకారం చేయాలన్నారు. భారత ప్రభుత్వం కులగణన చట్టం ఆధారంగా జనాభా లెక్కలతో పాటు పక్కాగా దేశంలో కులగణనను చేపట్టనుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రతి ఒక్క వ్యక్తి దగ్గరికి, ప్రతి ఇంటికి వెళ్లి పారదర్శకంగా జనాభా లెక్కలతో తరువాయి 2లో

## ఆస్ట్రేలియా ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఘన విజయం

- రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకున్న ఆంథోనీ ఆల్బెనీస్
- 21 ఏళ్లలో వరుసగా ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడం ఇదే ప్రథమం
- 70 సీట్లలో సెంట్రల్ లెఫ్ట్ లేబర్ పార్టీ విజయం
- ప్రతిపక్ష జాతీయ కూటమి 24 సీట్లలో గెలుపు



**సిడ్నీ :** ఆస్ట్రేలియా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధానమంత్రి, సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీ నాయకుడు ఆంథోనీ ఆల్బెనీస్ రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. మరో మూడేళ్ళపాటు ఆయన అధికారంలో ఉంటారు. గడచిన 21 సంవత్సరాలలో ఇలా వరుసగా ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడం ఇదే ప్రథమం. సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీ 70 సీట్లు గెలుచుకోగా, ప్రతిపక్ష జాతీయ కూటమి 24 సీట్లు మాత్రమే గెలుచుకుంది. దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో మొత్తం 150 స్థానాలు ఉన్నాయి. ఇతర చిన్నపార్టీలు, ఇండిపెండ ఎంట్లు కలిసి మరో 13 స్థానాలు గెలుచుకునే అవకాశాలున్నాయి. తాను తన అధికార బృందం ఆదివారం నుండి తిరిగి ప్రభుత్వ విధులు చేపడతామని విజేత ఆల్బెనీస్ తక్షణ ప్రకటన చేశారు. సరికొత్త కృతనిశ్చయం, సరికొత్త విశ్వాసం, సరికొత్త ఆశలతో తమన పనివిధానాన్ని పునః ప్రారంభిస్తామన్నారు. ఆస్ట్రేలియా తరువాయి 2లో

## ఫ్యూచర్ సిటీలో 'ఇ-సిటీ'



- 2500 మంది యువతకు ఉపాధి
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 'ఎలెక్ట్రానిక్ సిటీ(ఇ–సిటీ)ని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో సయుక్తంగా రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల సంస్థలు సిరా నెట్ వర్క్స్(తైవాన్), ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్(తెలంగాణ) ప్రతినిధులతో ఆయన శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలెక్ట్రానిక్ పరిశ్రమల తరువాయి 2లో

## 70.13 లక్షల మెట్రిక్ టన్నులు

యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం

- ఇప్పటి వరకు దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు సేకరణ పూర్తి
- కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 8,329 సెంటర్ల ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్



వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సైతం రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తికావడంతో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిన ప్రభుత్వం గడిచిన 45 రోజుల్లో దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి 8,329 సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం కోతలు పూర్తిగా ఊపు అందుకోవడంతో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. అన్ని కొనుగోలు సెంటర్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాల కల్పించడంతో పాటు అకాల వర్షాలతో ధాన్యం అరబోసుకునేందుకు అన్ని ఏర్పాట్లను చేయడంతో పాటు తడిసిపోకుండా ఉండేందుకు తార్పర్లను అందుబాటులో ఉంచారు. మార్చి 15 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభం అయినప్పటికీ సన్న బియ్యం ఇప్పుడిప్పుడే కొనుగోలు సెంటర్లకు పూర్తి స్థాయిలో తరలి వస్తుండడంతో అధికారులు ఏర్పాట్లును మరింత ముమ్మరం చేశారు. అదేవిధంగా అకాల వర్షాలతో కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోకుండా కేంద్రాల వారికి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. దీంతో వర్షాలు వచ్చే సూచనలు అందిన వెంటనే రైతులు తమ ధాన్యం తడిసిపోకుండా రక్షణ చర్యలు తరువాయి 12లో



మే డే సందర్భంగా శ్రీలంకలో అధికార జనతా విముక్తి పెరమున(జెవిపి) ఆధ్వర్యంలో రాజధాని కొలొంబోలో గురువారం జరిగిన భారీ బహిరంగసభకు సిపిఐ తరుపున జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపి బినొయ్ విశ్వం హాజరై ప్రసంగించారు. సాగరతీరంలో అశేషజనవాహిని ఉద్దేశించి శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే చేసిన ప్రసంగానికి భారీ స్పందన లభించింది. అంతకుముందు శ్రీలంక అధ్యక్షుడి అనురకుమారతో బినొయ్ విశ్వం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.



# ప్రపంచం
WORLD NEWS


## భారత్‌తో రక్షణ ఒప్పందాన్ని పార్లమెంట్ ముందుంచుతాం : దిస్సనాయకే

**కొలంబో :** భారత్–శ్రీలంక మధ్య జరిగిన రక్షణ ఒప్పందాన్ని పార్లమెంట్ ముందుంచుతామని ఆ దేశ ప్రధానమంత్రి అనుర కుమార దిస్సనాయకే ప్రకటించారు. ఏప్రిల్ 4, 5 తేదీలలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీలంకలో పర్యటించినప్పుడు ఆ దేశంతో రహస్య సైనిక ఒప్పందం చేసుకున్నారంటూ శ్రీలంక ప్రతిపక్షాలు ప్రధానమంత్రిపై విరుచుకుపడ్డాయి. దీంతో ప్రధానమంత్రి దిస్సనాయకే శనివారంనాడు పైవిధంగా వివరణ ఇచ్చారు. ఎన్‌పిపి ప్రభుత్వం నరేంద్రమోదీతో రహస్య సైనిక ఒప్పందం చేసుకుందని ప్రతిపక్షాలు విమర్శించడంతో ఆ ఎంఒయును పార్లమెంటు ముందుంచుతామని దిస్సనాయకే ప్రకటించారు. ''వారు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు, ఊహాగానాలు చేస్తున్నారు, నిజాలు వారికి తెలియదు, రెండు దేశాలమధ్య అధికారికంగా ఒప్పందాలు జరిగాయి, అవి బాహాటంగానే ఉన్నాయి, మనదేశ భద్రతకు భరోసా కల్పించేందుకే ఈ ఒప్పందాన్ని భారత్‌తో చేసుకున్నాం, ఇది ఒప్పందంలో స్పష్టంగా ఉంది'' అని దిస్సనాయకే శుక్రవారంనాడు ప్రభుత్వటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

## ట్రంప్ 2026 బడ్జెట్‌లో చదువుసహా జనానికి కోత – రక్షణవ్యయం మోత

**వాషింగ్టన్ :** కొత్త సంవత్సరంలో ట్రంప్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 163 బిలియన్ డాలర్లు మేరకు జనం ఖర్చుల్లో కోత పెట్టారు. రక్షణ వ్యయాన్ని అతిభారీగా పెంచారు. చదువు ఖర్చుల్లో భారీగా కోత పెట్టారు. అమెరికా ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఫెడరల్ గవర్నమెంట్ ప్లాన్‌ను 15.3 శాతం మేరకు తగ్గించారు. విద్యార్థులకు పార్ట్‌టైమ్ జాబ్ వర్క్ స్టడీ కింద గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన 1.2 బిలియన్ డాలర్లు నుండి 980 డాలర్లు కోత పెట్టారు. జాతీయ రక్షణకు 892.6 బిలియన్ డాలర్లను ప్రతిపాదించారు. పేద దేశాలకు సహాయం చేయడానికి వీలుగా వలర్డ్‌బ్యాంక్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌కు మూడు సంవత్సరాలపాటు 3.2 బిలియన్ డాలర్లు కేటాయించారు. సిఐఎ, ఇతర గూఢచారి సంస్థ నిర్వహణ ఖర్చుల్లో కోత విధించారు.

రక్షణశాఖకు గతంకంటే 133.3 బిలియన్ డాలర్లు కేటాయింపులు పెంచారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీకి 42.3 బిలియన్ డాలర్లు అంటే 65 శాతం మేరకు ప్రోత్సాహం ఇచ్చారు. రక్షణ



వ్యయానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. హౌసింగ్ ఖర్చుల్లో, మెడికల్ రీసెర్చ్ ఖర్చులను కూడా తగ్గించేశారు. రక్షణ వ్యయానికి, ఈ సరిహద్దు భద్రతకే ఆయన అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. హోమ్‌లాండ్ సెక్యూరిటీ ఖర్చులను 65 శాతం మేరకు భారీగా పెంచారు. అక్రమ వలస ప్రజలు దేశంలోకి రాకుండా, వారు దేశంలో నేరాలు చేయకుండా ఉండాలనేదే తన ప్రధాన ఉద్దేశమని ట్రంప్ చెబుతున్నారు. సరిహద్దులు దాటి అక్రమంగా వచ్చేవారంతా క్రిమినల్ గ్యాంగులుగా తయారై దేశాన్ని నేరమయం చేస్తున్నారని, డ్రగ్స్ వ్యాపార గ్యాంగులను సృష్టిస్తున్నారని ట్రంప్ మొదటి నుండి వాదిస్తున్నారు. మెడికేర్, సోషల్ సెక్యూరిటీ, ఇంటర్నల్ పేమెంట్స్, వడ్డీ చెల్లింపులు వంటివాటికి కేటాయంపులను 2017 నాటి స్థాయికి గణనీయంగా కోత విధించారని వైట్‌హౌస్ అఫీషియల్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ అధికారి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ట్రంప్ బడ్జెట్ విధానాలను కాంగ్రెస్‌లో డెమోక్రటిక్ పార్టీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌కు రెండు బిలియన్ డాలర్లు, హెల్త్, డిజీస్ కంట్రోల్ ప్రివెన్షన్ నేషనల్ ఇనిస్టిట్యూట్‌కు 40 శాతం మేరకు కోత పెట్టడాన్ని డెమోక్రాట్లు వ్యతిరేకించారు. చంద్రుడిపై పరిశోధనలు చేసేందుకు నాసాకు ప్రతిపాదించిన మొత్తం నుండి ఆరు బిలియన్ డాలర్లు కోత విధించి అంగారకుడిపై పరిశోధనలకు కేటాయింపులు పెంచారు. ఈ విషయంలో స్పేస్ ఎక్స్ అధిపతి ఎలాన్‌మస్క్ ప్రభావం చాలావరకూ ట్రంప్ మీద ఉంది. విదేశీ సహాయాన్ని 49 బిలియన్ డాలర్లు తగ్గించారు. ఇంటీరియర్ డిపార్‌టెమెంట్‌కు 30.5 ల్యాండ్ మేనేజ్‌మెంట్ బ్యూరోకు 198 మిలియన్ డాలర్లు కోత విధించారు.

## పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ఎగతాళి చేసిన ట్రంప్!

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగడాలు మితిమీరుతున్నాయా? ఆయన పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ఎగతాళి చేశారా? అని ప్రశ్నించినప్పుడు ఔననే సమాధానం వస్తోంది. పోప్ దుస్తుల్లో ఉన్న ట్రంప్ తన అవతారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కొంతమంది ఆయన పోప్ అవతారాన్ని చూసి నవ్వుకుంటుండగా మరికొంతమంది మాత్రం చాలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణాన్ని ట్రంప్ ఎగతాళి చేస్తున్నారని మండిపడుతున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ట్రంప్ చిత్రాన్ని జనరేట్ చేశారు. ఏప్రిల్ 21వ తేదీన పోప్ ఫ్రాన్సిస్ తన 88వ ఏట మరణించారు. ట్రంప్ సహా అనేకమంది ప్రపంచ



నాయకులు ఆయన అంత్యక్రియలకు హాజరై నివాళులు అర్పించారు.

## సింగపూర్ పార్లమెంటుకు పోలింగ్

**సింగపూర్ :** సింగపూర్ 14వ పార్లమెంటుకు శనివారంనాడు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 3.70 మిలియన్లమంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. పార్లమెంటులో మొత్తం 97 స్థానాలు ఉండగా, 92 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రజల జీవన వ్యయాల పెరుగుదల, ఇళ్ల మస్య, జిఎస్‌టి వసూళ్ళు వంటి ప్రధానాంశాలకు పరిష్కారాలు చూపించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన 1,240 పోలింగ్ కేంద్రాలలో రాత్రి ఎనిమిది గంటలవరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. 34,000 మంది సిబ్బంది ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు.

## దక్షిణకొరియా అధికారపార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కిమ్ మూన్ సూ



**సియోల్ :** దక్షిణకొరియా అధికార పీపుల్స్ పవర్ పార్టీ తరపున ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థిగా కిమ్ మూన్ సూ ఎన్నికయ్యారు. ఆయన ప్రభుత్వంలో నిన్నమొన్నటి దాకా కార్మికశాఖ మంత్రిగా, ఎప్లాయ్‌మెంట్‌శాఖ మంత్రిగా పనిచేశారు. జూన్ 3వ తేదీన దక్షిణ కొరియాలో ఎన్నికలు జరుగుతాయి. కన్జర్వేటివ్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి జరిగిన రేసులో కిమ్ మూన్ సూ పోటీకి అర్హుడిగా ఎంపికయ్యారు. తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ సూ కూడా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతో ఉత్సాహం చూపించారు. కానీ ఆయనకు ఆ అర్హత లభించలేదు. 75 ఏళ్ళ వయసుగల కిమ్ మూన్ సూ పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు నిర్వహించారు. ఇతర ప్రజాస్వామ్యశక్తులతో అనుసంధానమై వారిని కలుపుకుని ముందుకు వెళ్ళగల సామరథ్యం కిమల మూన్‌కు ఉందని పార్టీ ఉన్నతస్థాయా వర్గాలు భావించాయి. పార్టీలో అంతర్గతంగా జరిగిన ఓటింగ్‌లో కిమ్ మూన్‌కు 56.5 శాతం ఓట్లు రావడంతో అధ్యక్ష అభ్యర్థిగా ఆయన అర్హత సంపాదించారు. అధ్యక్షుడు యూన్ సుఖ్ యోల్‌ను పార్లమెంటు అభిశంసన తీర్మానం ద్వారా పదవీచ్యుతుణ్ణి చేయడానికి కార్మిక మంత్రి, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి కిమ్ మూన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన అంతపెద్ద తప్పేమీ చేయలేదని సమర్థించారు. కానీ చివరకు యోల్ కోర్టు కేసును ఎదుర్కోవలసి వచ్చింది.

## డిజిటల్ సవాళ్ళ మధ్య 'వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే'

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా శనివారం (మే 3వ తేదీ) వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే పాటిస్తున్నారు. విధినిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన జర్నలిస్టులకు ఈ సందర్భంగా పలుచోట్ల పాత్రికేయ సంఘాలు నివాళులు అర్పించాయి. సమకాలీన ప్రపంచంలో వాస్తవాన్వేషణ చేసే జర్నలిస్టులపై దాడులు, హింసాకాండ, వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయి. స్వేచ్ఛ, సమానత్వాన్ని కోరిన జర్నలిస్టులు జైళ్ళపాలవుతున్నారు. ఇజ్రాయెల్, ఉక్రేన్‌లలో జరుగుతున్న యుద్ధాలలో కూడా డజన్ల సంఖ్యలో జర్నలిస్టులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది జర్నలిస్టులు తప్పుడు కేసులు ఎదుర్కొంటూ కటకటాల్లో వేధింపులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలో అనేక దేశాలలో మితవాద ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులకు సవాళ్ళు అనుహ్యంగా పెరిగాయి. 1991 యునెస్కో జనరల్ కాన్ఫ




రెన్స్ 26వ సెషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా 1993లో ఐక్యరాజ్యసమితి ఏటా మే 3వ తేదీని ''వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే''ను ప్రకటించింది. ఆఫ్రికన్ న్యూస్ పేపర్స్ జర్నలిస్టులు యునెస్కో 1991 సదస్సులో ప్రెస్ ఫ్రీడమ్ సూత్రాలను సమర్పించడంతో వాటిని యునెస్కో జనరల్ అసెంబ్లీకి రిఫర్ చేసింది. ఈ ఏడాది ఇజ్రాయెల్ దాడుల్లో అనేకమంది జర్నలిస్టులు విధి నిర్వహణలో మరణించారు. ఆరుగురుపైగా అల్‌జజీరా జర్నలిస్టులు ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరణించారు. బంగ్లాదేశ్ పత్రికల నివేదిక ప్రకారం 266 మంది జర్నలిస్టులు ఆ దేశంలో అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక ప్రభుత్వానికి ఇటీవల ఒక కమిటీ ఇచ్చిన తన నివేదికలో జర్నలిస్టుల జీవితాలు మెరుగుపడటానికి వీలుగా అనేక సిఫార్సులు చేసింది. గత ఏడాది జులై, ఆగస్టు నెలల్లో బంగ్లాదేశ్‌లో జరిగిన విద్యార్థుల ఉద్యమాల సందర్భంగా అనేక మంది జర్నలిస్టులను క్రిమినల్స్‌గా చిత్రీకరించారు. 266 మంది కేసులు ఎదుర్కొంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, ఇతర సాంకేతిక మార్గాలద్వారా సమాచారం ప్రజల్లోకి శరవేగంగా వ్యాప్తించెందుతూ ఉండటంతో తప్పుడు వార్తలు, తప్పుడు కథనాలు, వందతుల వ్యాప్తివల్ల కూడా సాంఘిక కల్లోలం చెలరేగుతూ ఉండటం ప్రభుత్వాలను కలవరపరుస్తున్నాయి. తప్పుడు సమాచార వ్యాప్తి నుండి ప్రెస్ ఫ్రీడమ్‌ను రక్షించుకోవాల్సిన అవసరంపై ఇప్పుడు అందరూ దృష్టి కేంద్రీకరించారు.

## అమ్మ డయానాలా.. నేనూ చనిపోతానేమో?

### బ్రిటన్ రాజకుటుంబంలో విభేదాలు బట్టబయలు

**లండన్ :** బ్రిటన్ రాజకుటుంబంలో విభేదాలు బట్టబయలయ్యాయి. రాజు ఛార్లెస్ రెండో కుమారుడు హ్యారీ ఇంటి నుండి వేరుపడి విడిగా జీవించడం ప్రారంభించిన తర్వాత ఆయనకు భద్రతను తగ్గించారు. ఈ విషయంలో ఆయన కోర్టుకు వెళ్ళారు. కానీ కోర్టు కేసులో ఓడిపోయారు. దీంతో హ్యారీలో తీవ్ర మనోవేదన ప్రారంభమైంది. ఆయన డిప్రెషన్‌కు గురయ్యారు. తన తల్లి డయానా కారు ప్రమాదంలో మరణించినవిధంగానే తాను, తన భార్య మేఘన, పిల్లలు ప్రిన్స్ ఆర్చీ, ప్రిన్సెస్ లిలీబెట్ కూడా మరణించే పరిస్థితి వస్తుందన్నారు. కొంతమంది ఇదే కోరుకుంటున్నారన్నారు. తన తండ్రి చార్లెస్ తనతో సరిగ్గా మాట్లాడటంలేదని, చావులు, పెళ్ళిళ్ళకు తప్ప ఇంకెప్పుడూ తన కుటుంబంతో కలవడానికి, వెళ్ళి ఆనందంగా గడపడానికి తనకు అవకాశం లేకపోయిందని ఆయన అన్నారు. హ్యారిస్–మేఘనల వివాహం రాజకుటుంబానికి మొదటి నుండీ ఇష్టం లేదు. కానీ రాజకుటుంబాన్ని ఎదిరించి హ్యారిస్ వారికి ఇష్టంలేకపోయినాగానీ మేఘనను వివాహం చేసుకుని



విడిగా బ్రతుకుతున్నారు. తన సొంత సోదరుడితో కూడా తొలుత ఆయన ఘర్షణలుపడ్డారు. హ్యారిస్‌కు తల్లి డయానా అంటే ఎనలేని ప్రేమ. తన తల్లి డయానా 1997లో పారిస్‌లో తెల్లవారుజామున తన ప్రియుడితో కలిసి మెర్సిడెజ్ బెంజ్ కారులో వెళుతుండగా జర్నలిస్టులు వెంటపడ్డారు. వారిని తప్పించుకోవడానికి వారి కారు మహావేగంగా వెళ్ళి సొరంగంలో ఢీకుని ప్రమాదానికి గురైవారు మరణించారు. చరిత్ర పునరావృతం కావాలనితాను కోరుకోవడంలేదని, కానీ కొంతమందిమాత్రం కోరుకుటున్నారని ఆయన నిరాశానిస్పృహలకు గురయ్యారు.

## అంగోలాకు 200 బి.డాలర్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రకటన విడుదల చేస్తూ, రెండు దేశాలమధ్యా సంబంధాలకు ఇదొక కొత్త మార్గదర్శకంగా నిలుస్తుందని, దాంతోపాటే భారత్–ఆఫ్రికా దేశాల మధ్య భాగస్వామ్యం మరింత పటిష్టవంతం అవుతుందని పేర్కొన్నారు. ''భారతదేశం 200 మిలియన్ డాలర్లు రక్షణ పరపతిని ఆంగోళా రక్షణ దళాల ఆధునీకరణకు అందజేస్తున్నాం, అదేవిధంగా అంగోళా రక్షణ వ్యవస్థలకు మరమ్మతులు, ఆధునీకరణ, ఇతర రక్షణ సేవల సరఫరాలు చేస్తాం, ప్రజాజీవనంలో భారతదేశ డిజిటల్ మౌలిక సేవలను విస్తరిస్తాం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో కూడా వారి సామర్థ్యాలను వినియోగించుకుంటాం, రెండు దేశాల సంబంధాలను తదుపరి మరింతగా పటిష్టవంతం చేసుకుంటాం, ఎరువులు, కీలక ఖనిజవనరులు, వజ్రాలను సానపట్టడం వంటి అనేక విభాగాలలో రెండు దేశాల సంబంధాలు విస్తరిస్తాయి'' అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు రెండు దేశాలు నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తాయన్నారు. ఆంగోలాకు భారత్ మద్దతుగా ఉంటుందన్నారు. అంగోలా, భారత్ రెండు గ్లోబల్ సౌత్‌లో కీలకస్థంభాలుగా ఉన్నాయని, భాగస్వాములుగా రెండు దేశాలు ముందుకు పయనిస్తాయన్నారు. నాలుగు రోజులు భారతదేశ పర్యటన నిమిత్తం లారెన్కో గురువారంనాడు ఢిల్లీకి వచ్చారు. ఆదివారంనాటితో ఆయన పర్యటన పూర్తి అవుతుంది.

## వ్యతిరేకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

పాటు కులగణన చేయనుందన్నారు.

**భూ సేకరణకు అడ్డుపడుతున్నారు..**

అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను ఈనెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇంటి స్థలం సేకరించిన తర్వాత ఒక రాజకీయ పార్టీ అడ్డుపడే ప్రయత్నం చేసిందన్నారు. కొంత మంది ఫ్లై ఓవర్‌ను ఆపే పని చేశారని, ఇంకా 6 చోట్ల భూ సేకరణ పూర్తి కాలేదన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, జిహెచ్ఎంసికి లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలోనే అంబర్‌పేట్ ఫ్లై ఓవర్కు శంకుస్థాపన జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 90 శాతం జిల్లాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రోడ్ల నిర్మాణం లేకుండా ఏ దేశమైనా అభివృద్ధి సాధించడం సాధ్యపడదన్నారు. పక్కా రోడ్లతో ఇంధన వినియోగ వ్యయం తగ్గుతుందని, ప్రమాదాలు తగ్గుతాయని, రవాణా వేగవంతమవుతుందని, గమ్యస్థానానికి తక్కువ సమయంలో చేరుకోవచ్చు అన్నారు. 2014లో తెలంగాణలో 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు అవి సుమారు 5200 కిలోమీటర్లకు పెరిగాయని, గత పదేళ్లలో రూ.1,25,485 కోట్లు జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు.

## నీటమునిగి ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

మృతదేహాలను గజ ఈతగాళ్ల సహాయంతో వెలికితీశారు. వరంగల్ జిల్లా ఖాజీపేటకు చెందిన ఎజాజ్‌అలీ,యాకుబ్‌బాబాలు తమ కుటుంబ సభ్యులు 13మందితో కలిసి ఇన్నోవా వాహనాలలో హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యలో రంగనాయకసాగర్ చూసేందుకు వచ్చారు. వీరిలో ఒక బాలిక సహా నలుగురు పిల్లలు ఈత కోసం నీటిలోకి దిగారు. వీరిలో ఈత కొట్టేందుకు దిగిన బాలిక గల్లంతయ్యింది. దీంతో బాలికను కాపాడే ప్రయత్నంలో మిగతా ముగ్గురు గల్లంతయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి నలుగురిలో ఇద్దరిని కాపాడారు. మెహరాజ్(13), అర్బాజ్(15)లు మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చిన్నకోడూర్ పోలీసులు,జిల్లా ఫైర్ అధికారి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట ఎసిపి మధు మృతదేహాలను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## లేబర్‌పార్టీ ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ విశ్లేషకుడు ఆంటోనీ గ్రీన్ అంచనా ప్రకారం, సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీకి 76 స్థానాలు, జాతీయ కూటమికి 36 స్థానాలు, స్వతంత్రులు, ఇతర పార్టీలకు 13 సీట్లు వస్తాయని అంచనావేశారు. ప్రతిపక్ష జాతీయ కూటమి ట్రంప్‌ను అనుకరించిందని, ఈ కూటమి అధికారంలోకి వస్తే పొదుపు చర్యల పేరిత ప్రజలను ఇబ్బందులు పెడుతుందని, ప్రభుత్వ సేవల్లో కోతలు విధించి సమస్యలు సృష్టిస్తుందని సెంటర్ లెఫ్ట్ లేబర్ పార్టీ భారీ ఎత్తున చేసిన ప్రచారం ఫలించింది. ప్రతిపక్ష నాయకుడు పీటర్ డట్టెన్ సారథ్యానగల ఉదారవాద జాతీయ కూటమిని ప్రజలు తిరస్కరించారు. పైగా ప్రతిపక్షనేత డట్టెన్ కాన్‌బెర్రా శివారుప్రాంతంలోని తన సొంత నియోజకవర్గం డిక్సన్‌లో ఓటమి చెందారు.

2007 నుడి ఇప్పటివరకూ ఏనాడూ ఇలా జరగలేదు. లోకల్ నెట్‌వర్క్ ఈ విషయం వెల్లడించింది. ఐతే ఆస్ట్రేలియా ఎన్నికల సంఘం ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించడానికి కొంత సమయం పడుతుంది. పీటర్ డట్టెన్ ఎన్నికల్లో తన ఓటమిని అంగీకరించారు. మేం సరిగ్గా ఎన్నికల ప్రచారం చేయలేకపోయామని ఆయన అంగీకరించారు. ప్రధానమంత్రి చారిత్రక విజయం సాధించారనీ, ఈ రాత్రే ఆయనను కలిసి అభినందనలు తెలియజేస్తాననీ డట్టెన్ చెప్పారు. ఆర్థిక సంక్షోభం, జీవన వ్యయాల పెరుగుదల,హెల్త్‌కేర్,అమెరికా సుంకాలు వంటి ప్రజా సమస్యలమధ్య ఆస్ట్రేలియాలో శనివారంనాడు పార్లమెంటు ఎన్నికలకు పోలింగ్ జరిగింది. సెంటర్ లెఫ్ట్–లేబర్‌పార్టీలు రెండూ అధికారంకోసం ప్రధానంగా పోటీపడ్డాయి. ట్రంప్ విజయం ఆస్ట్రేలియాకు తీరని నష్టం కలిగిస్తుందని గతనెలలో సిడ్నీ మోర్నింగ్ హెరాల్డ్ వార్తాపత్రిక నివేదికలో 60 శాతం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయం ఎన్నికలపై గణనీయంగా పనిచేసింది. అది ఆల్బెనీస్ మళ్ళీ విజయం సాధించడానికి ఉపయోగపడింది. దేశంలో మొత్తం కోటీ 80 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. శనివారం పోలింగ్ జరిగిన తర్వాత సాయంత్రానికి ఫలితాలు వెలువడ్డాయి. సెంటర్ లెఫ్ట్ పార్టీ రాబోయే మూడు సంవత్సరాలు మళ్ళీ పరిపాలన సాగించడానికి వ్విళ్ళూరుతూ రెండోసారికూడా బరలోకి దిగింది. ప్రస్తుత ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బెనీస్, ప్రతిపక్ష నాయకుడు పీటర్ డట్టెన్ మధ్య హోరాహోరీ ఎన్నికల పోరాటం జరిగింది. ఆంథోనీ ఆల్బెనీస్ లేబర్‌పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. ఎంతో పాపులారిటీ ఉన్న నాయకుడుగా అధికారంలోకి వచ్చిన ఆల్బెనీస్ ఇటీవలికాలంలో మత సమస్యలు, దేశీయ వ్యవహార సమస్యలు, ముస్లిం వ్యతిరేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

కాగా లిబరల్ నేషనల్ కూటమికి నాయకత్వం వహిస్తున్న బలమైన కన్జర్వేటివ్ నాయకుడు డట్టెన్‌కు గతంలో రక్షణ, హోం వంటి మంత్రిత్వశాఖలు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ సామాజికాంశాలలో ఆయన వివాదాస్పదుడు. ఇక వామపక్ష భావజాలంగల గ్రీన్స్ పార్టీ దేశంలో తృతీయ ప్రత్యామ్నాయంగా ఉంది. ఒకవేళ దేశంలో ఏపార్టీకి మెజారిటీ రాకుండా హంగ్ పార్లమెంటు ఏర్పడితే ప్రభుత్వ ఏర్పాటుకు తీవ్ర జాప్యం జరుగుతుంది. 2010లో ఇదేవిధంగా హంగ్ పార్లమెంటు ఏర్పడినప్పుడు సంప్రదింపులు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి 17 రోజులుపైగా సమయం పట్టింది.

## కుల సర్వేను తప్పుపట్టడమంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమే

### బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కుల సర్వేను తప్పుపట్టడం పట్ల తెలంగాణ బిసి కమిషన్ తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. సెన్సెస్ జరపటం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందనే విషయం నిస్సందేహం అయినా తెలంగాణలో జరిగిన కుల సర్వే, కులగణనను ఏమాత్రం తీసిపోకుండా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని, రాష్ట్ర ప్రజలల్లో ఏ కులానికి చెందినవారు, ఎంత సంఖ్యలో ఉన్నారో వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ పరిస్థితులను సమగ్రంగా ఇంటింటికి వెళ్ళి విచారించడం జరిగిందని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణలో సర్వేను అభాసుపాలు చేసే ప్రయత్నంకన్నా, కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులకు చట్టబద్ధత కలిగించే విధంగా ప్రయత్నిస్తే తెలంగాణ ప్రజలు హర్షిస్తారని అన్నారు. సర్వే జరిగిన 2 దశలలో 1,12,36,849 కుటుంబాలను (97.10శాతం) కవర్ చేయడం జరిగిందన్నారు. ఇంత పకడ్బందీగా 94,261 ఎన్యూమరేషన్ల బ్లాక్‌లను ఏర్పాటు చేసి, 1,03,889 ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి, సమాచారాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇంత పకడ్బందీగా చేసిన సర్వేను తప్పుల తడకగా పేర్కొనడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా అసెంబ్లీలో దీనిపై పూర్తిస్థాయిలో చర్చ జరిగి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2 బిల్లులను కూడా ఆమోదించడం జరిగిందన్నారు.

## దిగుమతులపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంది. సింధుజలాల ఒప్పందం రద్దు, భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులను తక్షణం పంపేయడం, పాకిస్థాన్ దౌత్యవేత్తల సంఖ్యను కుదించడం, సరుకుల దిగుమతులు నిలిపివేయడం, సరిహద్దులు మూసివేయడం వంటి చర్యలు తీసుకుంది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ కూడా భారత దౌత్యవేత్తలను బహిష్కరించింది. పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న భారతీయులను తక్షణం వెనక్కు పంపింది. సరిహద్దును మూసివేసింది. భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని పాకిస్థాన్ రద్దుచేసుకుంది.

**పాకిస్థాన్ నౌకలపై నిషేధం : తపాల సేవల రద్దు**

పాకిస్థాన్ నుండి వచ్చే అన్ని తపాల సేవలను భారతదేశం శనివారంనాడు రద్దుచేసింది. అదేవిధంగా పాకిస్థాన్ నౌకలకు భారతదేశ ఓడరేవులలో ప్రవేశాన్ని రద్దుచేసింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ప్రభుత్వం ఈ తాజా నిర్ణయం తీసుకుంది. రెండు దేశాలమధ్య పది రోజుల తర్వాత కూడా క్రమంగా ఉద్రిక్తతలు పెరుగుతూ ఉండటం, సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలు కొనసాగించడంతో ప్రభుత్వం కొత్త చర్యలకు పాల్పడింది. అదేవిధంగా పాకిస్థాన్ ఓడరేవులకు కూడా భారత నౌకలను వెళ్ళకుండా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే పాకిస్థాన్ భారత విమానాలను ఆ దేశ గగనతలం నుండి వెళ్ళకుండా నిషేధించింది. భారత్ కూడా ఆదేవిధమైన చర్యలు తీసుకుంది. అన్ని రకాల మెయిల్స్, పార్శిల్స్ పాకిస్థాన్ నుండి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. సెక్షన్ 411 మర్చంట్ షిప్పింగ్ చట్టం కింద భారత ఓడరేవులలోకి పాకిస్థాన్ నౌకలకు ప్రవేశాన్ని నిషేధించింది. పాకిస్థాన్ జెండా తగిలించుకున్న ఏ నౌకా కూడా భారత్ ఓడరేవుల్లోకి ప్రవేశిచడానికి వీలులేదు.. భారత జెండా ఉన్న నౌకలు పాకిస్థాన్ రేవులకు వెళ్ళకూడదు. భారతదేశ రక్షణ చర్యల్లో భాగంగా ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయి. ఈనెల 22వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ త్రివిధ దళాలతో ఉన్నతస్థాయా సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. త్రివిధ దళాలకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చారు. ఎప్పుడు ఎక్కడ, ఎలా, ఏ సమయంలో పాకిస్థాన్‌పై దాడి చేయాలనే విషయంపై త్రివిధ దళాలే తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రధానమంత్రి వారికి స్వేచ్ఛ ఇచ్చారు. ఐతే అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ సహా అనేక దేశాలు భారత్–పాకిస్థాన్‌లు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశాయి. ఐతే ఈ ఉగ్రవాద దాడికి వెనక సూత్రధారులను వదిలిపెట్టేదిలేదని భారతదేశం ప్రతిజ్ఞ చేసింది.

## 'ఇ సిటీ'

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. ఈ తరహా పరిశ్రమలు ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుమారు 10 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్ , మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమావేశంలో టిజిఐసిసి సిఇఒ మధుసూదన్, టి ఫైబర్ ఎండి వేణుప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డౌగియాస్, ఎల్ సిజిసి రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ పాల్గొన్నారు.

**త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ**

రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడమీలు నెలకొల్పుతామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువత శిక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని ఆయన కోరారు. శనివారం నాడు మినిష్టర్స్ క్వార్టర్స్‌లో తనను కలిసిన తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కోఆర్డినేటర్ వెంకట రమణారెడ్డిలను ఆయన అభినందించారు. వారికి నియామక పత్రాలు అందజేసారు. బ్యాడ్మింటన్ క్రీడ మరింత విస్తరించేందుకు పాటుపడాలని తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అయిన శ్రీధర్ బాబు వారికి దిశానిర్దేశం చేసారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ ప్రతినిధి యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

## మోస్తరు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. దీంతో రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొని ఉంది. రాబోయే రెండురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయన్నారు. రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించారు. మంచిర్యాల, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పారు. ఈనెల 5న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు కరుస్తాయని, పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఎస్ రామకృష్ణారావుకు సిపిఐ నాయకుల అభినందనలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన రామకృష్ణారావుకు సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## దేవాదుల ప్రాజెక్టును అన్ని దశల్లో పూర్తి చేస్తాం



సాగునీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

దేవాదుల పంపుహౌజ్ స్టేషన్‌ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : దేవాదుల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంపు హౌజ్ స్టేషన్‌ను రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుండి నేరుగా దేవన్నపేటలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద మంత్రులు దిగగా ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు పుష్పగుచ్చాలను అందజేశారు. దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ చేరుకున్న మంత్రు లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి టన్నెల్ ను పరిశీలించారు. అనంతరం దేవాదుల పంపు హౌజ్ పనుల పురోగతి, ఇతర అంశాలపై సాగునీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అన్ని దశలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే దేవాదుల పంప్ హౌస్ ను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి సాగునీరు, ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదుల మూడు పైపు లైన్ల పంపులను ఆన్ చేసి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాదుల పంప్ హౌస్ నుండి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న దేవాదుల పైపులను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటిపారుదల శాఖ ఈఎన్సి అనిల్ కుమార్, సీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు లక్షల మందితో తుది జాబితా

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇందిరమ్మ ఇంటి కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మందితో తుది జాబితాను రూపొందించబోతున్నామని, విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా, అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. భారతదేశంలో పేదలకు ఇంత పెద్ద ఎత్తున రూ.5 లక్షలతో సంవత్సరానికి నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్‌లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ఆరు రోజుల పాటు శిక్షణ పొందారు. న్యాక్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిక్షణ పూర్తి చేసుకున్న ఇంజనీర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీ, నిబద్ధతతో పని చేసి, పేదవాడి చిరకాల కోరిక నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపుల్లో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఉండేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం చెల్లింపుల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినప్పటికీ మెరిట్ పద్ధతిలోనే ఎంపిక చేసినట్టు వివరించారు. ఈ ఏడాది రూ 22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించ బోతున్నామని, ఇందుకు సంబంధించి మరికొద్దిరోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని, ఇప్పటికే పైలట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు.

దేశంలో ఏరాష్ట్రంలో కూడా ఏ సంక్షేమ పథకం కింద ఒక్క లబ్ధిదారునికి రూ 5 లక్షలు ఇస్తున్న పథకం లేదన్నారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ప్రభుత్వం రూ.5 లక్షలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్ధిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందని తెలిపారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇండ్లను నిర్మించేందుకు అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. యువ ఇంజనీర్లు ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండడం సంతోషమన్నారు.

**పదోన్నతులు పొందిన 21 మందికి సర్టిఫికెట్లు**

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ 2లో పని చేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్ 1లో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న 11 మందికి, గ్రేడ్2గా పదోన్నతులు కల్పించారు. వీరికి పదోన్నతి పొందినట్టు మంత్రి పొంగులేటి సర్టిఫికెట్లను అందజేశారు.

## ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణ కోసం యువత పోరాడాలి



ఎఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి /హైదరాబాద్: మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య రక్షణ, కోసం లౌకికవాదం రక్షణ కోసం యువత పోరాడాలని ఏఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. వరంగల్‌లోని శివనగర్ లోని తమ్మెర భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి యువజన సమాఖ్య ఏర్పడి యువకుల హక్కుల కోసం ప్రతి సమస్యను పరిష్కరించడంలో ముందుందన్నారు. ఓటు హక్కు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకులకు కల్పించాలని, ఎన్నో పోరాటాలు చేసి ఓటు హక్కును సాధించిన ఘనత ఏఐవైఎఫ్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, హసీనా, విజయ్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

**యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు విఫలం : ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర**

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యువత పోరాడాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద ఎఐవైఎఫ్ పతాకాన్ని ధర్మేంద్ర ఎగురవేశారు. అనంతరం తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందామని





ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్ తీర్చిదిద్దడంలో యువతదే ప్రధాన పాత్ర అని, అలాంటి యువతకు విద్య, వైద్య, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివకుమార్, ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, సభ్యులు కళ్యాణ్, భరత్, సిపిఐ నాయకులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిర్భయ నాయకుడు అతుల్‌కుమార్

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



న్యూఢిల్లీ : సిపిఐ జాతీయ నాయకుడు కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ ఒక అద్భుతమైన వక్త, నిర్భయ నాయకుడు, భారతదేశ రైతుల పక్షాన పోరాడే యోధుడు అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా శ్లాఘించారు. అతుల్‌కుమార్ అంజాన్ మరణించి శనివారం ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనను స్మరిస్తూ డి.రాజా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'కామ్రేడ్ అతుల్ కుమార్ అంజాన్ లేకుండా అప్పుడే ఒక సంవత్సరం గడిచిపోయింది. ఆయన ఒక అద్భుతమైన వక్త, నిర్భయ నాయకుడు, భారతదేశ రైతుల పక్షాన పోరాడే యోధుడు. ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడిగా, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శిగా ఆయన ప్రయాణం అనేక సవాళ్లు, విజయాలతో కూడుకున్నవి'' అని రాజా అన్నారు. ''స్వామినాథన్ కమిషన్‌లో ఆయన ఒక్కరే రైతు ప్రతినిధి, అక్కడ ఆయన గొంతు చరిత్రను మలచింది. ఆయన అవిశ్రాంతంగా చేసిన వాదనల ఫలితంగానే నేడు రైతుల డిమాండ్లలో ముఖ్యమైన అంశమైన సి2+50% కనీస మద్దతు ధర సూత్రం వచ్చింది. ఆయన స్థిరమైన నిబద్ధతను, ఆయన శక్తివంతమైన మాటలను, న్యాయం, సమానత్వం పట్ల ఆయనకు ఉన్న తిరుగులేని విశ్వాసాన్ని మేము గుర్తు చేసుకుంటున్నాము. రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడం, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీని సాధించటం కామ్రేడ్ అతుల్ అంజన్‌కు మనం ఇచ్చే గొప్ప నివాళి అవుతుంద'ని పేర్కొన్నారు.

## విదేశీ పోలీసుల మాదిరిగా.. మిత్రులుగా భావించే స్థాయిలో పని చేయాలి

డిజిపి డాక్టర్ జితేందర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికాతో పాటు మరి కొన్ని దేశాల్లోని ప్రజలు పోలీసులను మిత్రులుగా భావిస్తారని ఆ స్థాయిలో ప్రజలకు న్యాయం చేసి వారి అభిమానం పొందాలని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ ఎస్‌హెచ్ఒలకు సూచించారు. డిజిపి కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి వచ్చిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఒ)లతో డిజిపి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్లకు ప్రజలు వచ్చినప్పుడు వారికి న్యాయం జరిగేలా చూడాలని తద్వారా వారికి మిత్రులుగా మారాలని సూచించారు. అమెరికాతో పాటు ఇతర కొన్ని దేశాల్లోని ప్రజలు పోలీసులను మిత్రులుగా పరిగణిస్తారన్నారు. అమెరికాలో ఉన్న తన స్నేహితుడు ఒకరు తనతో ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు ఆయన పిల్లలను నియంత్రిస్తూ తాను ఇండియాలో ఉన్న పోలీస్ అంకుల్‌తో మాట్లాడుతున్నానని భయపెట్టే ప్రయత్నం చేశాడు అన్నారు. కానీ అమెరికాలో పెరుగుతున్న ఆయన పిల్ల వాడు పోలీస్ అంటే తన మిత్రుడు అని తనకు భయమేమీ లేదని అనడంతో అక్కడ పరిస్థితి ఆసక్తి కలిగించిందన్నారు. అమెరికాలోని ప్రజలు పోలీసులను మిత్రులుగా భావిస్తారని తెలిసిందన్నారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులు మంచి పేరు తెచ్చుకోవడంతోపాటు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అది సర్వీస్‌లో ఎప్పటికీ గుర్తుంటుందని అభిప్రాయపడ్డారు. ఏదో కారణంతో, పోలీస్ అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తే చెడ్డ పేరు కూడా వస్తుందని, తమకు న్యాయం చేయలేదని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్ పోటీలకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ తమ ప్రాంతాలలో పకడ్బందీగా ఏర్పా ట్లు చేయాలని ఆదేశించారు. సాధించింది కొంత మాత్రమేనని కృషి చేయాల్సింది ఎంతో ఉందని గుర్తుపెట్టుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ర్యాంకులో కింది స్థాయికి పడిపోతామని వివరించారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ.... ప్రస్తుతం రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీల కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రధానమని అన్నారు. కొన్ని మహిళా సంస్థలు ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నాయని వాటిని గమనించి కంటెస్టెంట్లకు భద్రత కల్పించాలని సూచించారు. అదేవిధంగా, మరొక మాసంలో వ్యవసాయ పనులు ప్రారంభం కానుండడంతో నకిలీ విత్తనాలు, పురుగు మందులు పుట్టుకొస్తాయని అప్రమత్తతతో ఉండాలన్నారు. శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యలో సంస్కరణలు అనివార్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సమాజంలో మారుతున్న పరిస్థితులకనుగుణంగా నాణ్యమైన విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాల విద్యలో పలు సంస్కరణలు అనివార్యమని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ అన్నారు. 'పాఠశాల విద్యలో 'నమోదు, నాణ్యత, నవ్యత' పేరుతో ఎస్‌టియు టిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి ఉపాధ్యాయుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 'సంస్కరణలు, ప్రతిపాదనల సంపుటి'ని ఎస్‌టియు ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావుకు శనివారం అందజేసింది. ఈ కార్యక్రమంలో పర్వత రెడ్డి సదానందం గౌడ్‌తో పాటు ప్రతినిధులు ఎల్.ఎం ప్రసాద్, దాసరి శ్రీధర్, పోల్‌రెడ్డి, ఇష్తేకారుద్దీన్, రామ సుబ్బారావు, సాబేర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా సిఎస్‌గా బాధ్యతలను చేపట్టిన రామకృష్ణరావుకు వారు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సబ్జెక్టు నిపుణులు, మండల, జిల్లా, రాష్ట్ర ప్రధాన బాధ్యులతో పలుసార్లు వర్క్‌షాప్‌లు నిర్వహించి ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్టును దృష్టిలో పెట్టుకొని, వాటిలో సాధ్యాసాధ్యాలను లోతుగా చర్చించి, ఈ ప్రతిపాదనలను రూపొందించినట్లు వారు తెలిపారు. ప్రీ ప్రైమరీ, ఉన్నత విద్య వరకు మెరుగైన సౌకర్యాల కల్పన వంటి మెజారిటీ అంశాల్లో సంఘం పక్షాన ఏకీభవిస్తున్నామని, సబ్జెక్టుల వారీగా సిలబస్, పరీక్షలు, ఎన్‌రోల్‌మెంట్, రవాణా సౌకర్యం, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలు, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు, పరిష్కార మార్గాలను లోతుగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించామని వారు సిఎస్‌కు వివరించారు. తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియ మరింత బలోపేతానికి తమ నివేదికలోని అంశాలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు.

## తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపాలి




ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపాలి, బేషరతు చర్చలు ప్రారంభించాలని డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. వరంగల్ శివనగర్, తమ్మెర భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ నక్సలిజాన్ని అంతం చేస్తానన్న కేంద్ర ప్రభుత్వం, పేదరికాన్ని ఎందుకు అంతం చేయలేకపోతుందని, మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరిపి, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2025లో ఇప్పటివరకు మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీలు కలిపి సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోయారని, దేశ చట్టాలు, సాయుధ ఘర్షణలకు సంబంధించిన నియమాలను పక్కన పెట్టి, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మావోయిస్టులను భౌతికంగా నిర్మూలించేందుకు సాయుధ బలగాలను వినియోగిస్తోంది. కర్రెగుట్ట కొండలను పారా మిలిటరీ బలగాలతో చుట్టివేయటం, ఆదివాసీల హక్కులను పూర్తిగా పట్టించుకోకపోవటం అభీష్టకరమైంది కాదన్నారు. సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తమ శాంతియుత చర్చల సన్నద్ధతను ఇప్పటికే ప్రకటించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇకపోతే, మావోయిస్టులు ఒక పక్షంగా కాల్పుల విరమణ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంఘీ ఎలేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రవి పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన సుద్దాల అశోక్ తేజ



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ సినీ గేయ రచయిత, కవి, ప్రజా గాయకులు సుద్దాల అశోక్ తేజ శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను అభినందించారు. అనంతరం సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి అశోక్ తేజను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



ప్రజాపక్షం అసిస్టెంట్ ఎడిటర్ బిటగుంట లక్ష్మి నారాయణ కుమారుడు శ్రీహరి విశ్వమిత్ర – ఐశ్వర్య గౌరి వివాహ మహోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగిన సందర్భంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, జిఎం (యాడ్స్) వి.మదన్ తదితరులు


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చందానగర్ సర్కిల్-21, ఎస్‌ఎల్‌పి జోన్.

NIT No.03/EE/GHMC/DIV-21/2025-26 టెండర్ నోటీసు ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేది: 02.05.2025

(03) పనుల కొరకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెం. 03/EE/GHMC/DIV-21/2025-26 (ఐటం నెం. 01 నుండి 03 వరకు), తేది: 02.05.2025 ప్రకారం టెండర్లను పిలవడమైనది. **అంచనా విలువ:** రూ.63.80లక్షలు, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల విక్రయం 03.05.2025న మ.12.00గం.ల నుండి అందుబాటులో ఉండును. **బిడ్ల దాఖలకు ఆఖరి తేది:** 06.05.2025న మ.12.00గం.ల వరకు. బిడ్ల విక్రయం దాఖలు సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్‌ఎల్‌పి జోన్ : జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1284-PP/CL/ADVT/1/2025-26, Date: 03-05-2025

**బహిరంగ కలప వేలం ప్రకటన**

Rc No:1252/2019/S3, తేది: 01.05.2025

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈక్రింద తెలుపబడిన అటవి జాతుల కలపను ఈ క్రింద తెలుపబడిన తేదిలలో బహిరంగ వేలం నిర్వహించబడును. తేది:12.05.2025, 22.05.2025, 31.05.2025, ఉదయం గం.10:00 లకు ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt.Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహిచబడును.

ఈ క్రింది తెలుపబడిన రకముల కలప:
1)యెగిస, 2) నల్లమద్ది, 3) బండారు, 4) బట్టగనం, 5) జిట్రేగి, 6) టేకు, 7) నారేప.

పూర్తివివరములకు అటవి క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నంబర్: 9177720923) నందు సంప్రదించగలరు.
**నోట్:-** ఒక వేల సమయం సరిపోకపోతే మరుసటి రోజుకూడా సేల్స్ నిర్వహించబడును.

సం/- (ఎస్. రమేష్), డివిజనల్ అటవి శాఖ అధికారి వన్యప్రాణి విభాగం ఏటూరునాగారం. జిల్లా ములుగు.

DIPR R.O. No. : 1275-PP/CL/ADVT/1/2025-26, Date: 03-05-2025

# నవ్వండి – నవ్వించండి

ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా

ప్రపంచ నవ్వుల దినోత్సవం ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా నవ్వు యోగ ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవం మొదలు పెట్టారు. వ్యక్తులు తమను తాము మార్చుకోవడానికి ప్రపంచాన్ని శాంతియుతంగా సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు మాత్రమే!

మానవుడు ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగిన అర్థమయ్యే భాష నవ్వు మాత్రమే. నవ్వుకు ప్రాంతం, మతం, కులం అనే భేదభావం లేదు. ప్రతి ఒక్కరు భాషతో సంబంధం లేకుండా చిరునవ్వుతో ప్రపంచాన్ని పలకరించే అందమైన ఆయుధం ఒక నవ్వు మాత్రమే. మనుషులు వేర్వేరు భాషలు, ప్రాంతాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ నచ్చే, సార్వత్రిక భాష నవ్వు మాత్ర మే! ఇది నేర్చుకునే అవసరం లేని భాష. శత్రువునైన ఆకట్టుకునేది ఒక చిరునవ్వు మాత్రమే.



చిరునవ్వు ముఖంమీద పరుచుకోవడం ఒక క్షణమే అయినా దానికి జీవితాన్ని మార్చగల శక్తి ఉంది. ఈ సృష్టిలో ఉచితంగా లభించేది నవ్వు మాత్రమే.. వదనాలకు నవ్వును మించిన ఆభరణం లేనే లేదు. ప్రతి మనిషి తనలో సహజంగా ఉండే నవ్వును ఉపయోగించడం మరిచిపోతున్నాడు. ఉరుకుల పరుగుల జీవితాల్లో నుంచి చిరునవ్వు అనేది అడ్రస్ లేకుండా పోతున్నది.

ఒకప్పుడు కుటుంబ సభ్యులు అంతా ఒక్కచోట చేరినా, నలుగురు స్నేహితులు కలిసినా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకునేవారు. నేటికాలంలో ఎవరి ఫోన్‌లలో వారే బిజీ లేదా ఇంట్లో అయితే టీవీల్లో బిజీ. గతంలో నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద, పాన్ షాప్‌ల వద్ద, టీ షాపుల వద్ద చేరి ముచ్చట్లు పెడుతూ నవ్వుకునేవారు. యువత అయితే క్రికెట్ కబుర్లు , సినిమా కబుర్లు కొరత లేకుండా మాట్లాడుకుంటూ నవ్వుతూ వుండేవారు. కానీ నేడు ఏ ప్రదేశంలో చూసిన కబుర్లు మానేసి సెల్ ఫోన్ లకు కళ్ళు అప్పగిస్తున్నారు.



రోజులో కొన్నిసార్లు ఒక్కసారి కూడా నవ్వని సందర్భాలు ఉంటున్నాయి. గతంలో రోజుకు కనీసం తక్కువలో తక్కువగా ఇరవై నిమిషాలకు పైగా నవ్వేవారట. ఇప్పుడు కనీసం రెండు నిమిషాలు కూడా నవ్వడం గగనమైపోతున్నది. నవ్వు అనునది చాలా చిన్నదే అయినా పరిచయస్తుల్ని కానీ, ప్రతిరోజు చూసే వాళ్ళను కానీ చూడగానే మనం చిరునవ్వులను చిందించే వాళ్ళం. ప్రస్తుత యాంత్రిక జీవనంలో పరిచయస్తులు కనబడినా చూసీచూడనట్టు వెళ్ళిపోతున్నం.

పైసా ఖర్చు పెట్టకుండా నవ్వుతో ఎన్నో లాభాలను పొందవచ్చు. 'నవ్వు ఆకర్షణీయమైనదో, ఆనందకరమైనదో మాత్రమే కాదు ఆరోగ్యప్రదమైనది'' అని అంటున్నారు శాస్త్రజ్ఞులు. చిరునవ్వులు చిందించే వారిలో బిపి వచ్చే అవకాశాలు తక్కువ. నవ్వు శరీరంలో ఆక్సిజన్ శాతం పెంచుతుంది. నవ్వు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. గుండెజబ్బుల నివారణలో కూడా నవ్వు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. నవ్వుతూ ఉండే వారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. నవ్వు ఒత్తిడిని తగ్గిస్తుం ది. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు అసలు వయసు కన్నా తక్కువ వయసు కలవారుగా కనిపిస్తారు. నవ్వు కండరాలను రిలాక్స్ చేసి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. నవ్వు శరీరానికి మనసుకు మంచి వ్యాయామం లాంటిది. ముఖంలో చిరునవ్వుతో ఉండే ఉద్యోగుల వల్ల ఇరవై శాతానికి పైగా ఉత్పాదకత పెరుగుతుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. మార్కెటింగ్ లాంటి విభాగాల్లో సిబ్బంది చిరునవ్వుతో అమ్మకాలు చేస్తే ఏకంగా నలభై శాతానికి పైగా అమ్మకాలు పెరుగుతాయని నిపుణులు తెలుపుతున్నారు. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు పనులన్నీ సకాలంలో సమర్థవంతంగా చేయగలుగుతారు.

కుటుంబ సభ్యులతో, సమాజంలోని తోటి మనుషులతో నవ్వుతూ మాట్లాడే వారి శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ప్రకృతి చికిత్స నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి మనిషి తనలో సహజంగా ఉండే నవ్వును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి. అందంగా అలంకరించుకొనే వారికన్నా ఏ అలంకరణ లేకపోయినా చిరునవ్వులు చిందించే వారే ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటారని, వారిని చాలామంది ఇష్టపడతారని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

నవ్వు అనునది మన ముఖంలో కనిపించే తొలిభావం. పుట్టిన పసికందులో కూడా మనం నవ్వును చూస్తాం. పసిపిల్లలు ప్రతిదానికి కిలకిలా నవ్వుతారు. పిల్లలు రోజుకు కనీసం వంద సార్లు నవ్వుతారు. నవ్వు అనేది నేడు బాల్యానికి పరిమితం అవుతున్నది. పెరిగినకొద్దీ నవ్వు దూరమైపోతున్నది. అలాంటి నవ్వును దూరం చేసుకోవద్దు. నవ్వే వారు నవ్విం చే వారు ఇద్దరు లాభం పొందేది ఒక నవ్వు లో మాత్రమే. నవ్వుకు జీవితాలను మార్చే శక్తి ఉంది. అంతటి శక్తివంతమైన నవ్వుకు దూరం కాకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. నవ్వించే వారితో రోజుల్లో కాసేపైన గడిపితే ఆ రోజంతా ఆనందంగా గడిచి పోతుందనుటలో ఎలాంటి అతియోశక్తి లేదు. ఆనందంగా ఉండే సమయంలో చక్కటి నిర్ణయాలు తీసుకునే శక్తి ఉంటుంది కాబట్టి రోజులో కొద్ది సమయమైనా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపితే ఆ ఇంట్లో ఆనందకరమైన వాతావరణం ఏర్పడి చక్కటి కుటుంబ అనుబంధాలు బలపడతాయి. అనుబంధాలను పెంచే నవ్వును దూరం చేసుకోకుండా రోజులో కొద్దిసేపుఅయినా మనసారా 'నవ్వండి నవ్వించండి'.



పుల్లూరు వేణుగోపాల్
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు
9701047002

# కులగణన దుమారం

ప్రజాపక్షం
04-05-2025, ఆదివారం

భారతీయ సమాజంలో అత్యధిక మెజారిటీగా ఉన్న షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలతో పాటు అత్యంత వెనుకబడిన తరగతులకు సామాజిక న్యాయం చేకూర్చేందుకు వారి గణాంకాలు అవసరమన్న భావనను వ్యతిరేకిస్తూ వచ్చిన భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకోసమే కావచ్చు – జనాభా లెక్కలతోపాటు కులగణన చేబట్టాలని నిర్ణయించటాన్ని యావత్ రాజకీయ పార్టీలు, ప్రగతిశీల సముదాయాలు స్వాగతించాయి. ఎవరు ఒద్దన్నా, ఎవరికి ఇష్టమున్నా లేకున్నా దీన్ని సాధించిన ఖ్యాతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి దక్కుతుంది. కులగణనను శాస్త్రీయం గా నిర్వహించి, తొలి చర్యగా వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల రాజకీయ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టంచేసి కేంద్రప్రభుత్వ ఆమోదానికి పంపిన తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి నాయకత్వం నిస్సందేహంగా కులగణన విషయంలో దేశానికి రోల్ మోడల్. దీన్నే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఉద్ఘాటించింది. జాతీయ కులగణనకు దాన్ని నమూనాగా తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అదే సమయంలో కులగణనకు కాలావధిని నిర్ణయించాలని డిమాండ్ చేసింది. ఎందుకంటే 2021లో కోవిడ్ మహమ్మారివల్ల వాయిదాపడిన చట్టబద్ధ దశవర్ష జనాభా లెక్కల సేకరణను ఎప్పుడు చేబడతారో ఇప్పటికి స్పష్టత లేదు. దాంతోపాటు చేబట్టే కులగణన – దాని విశ్లేషణ, రాష్ట్రాలవారీ వర్గీకరణ పూర్తి చేయటానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో సెన్సెస్ నిపుణులు కూడా చెప్పలేరు. అందువల్ల కులగణన నిర్ణయాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకుంటూ ఏళ్లాపూళ్లా గడిపితే ప్రజలు కీలెరిగి వాతపెడతారని గ్రహించాలి. ఈ పర్యాయం జనగణన సమాచారమంతా డిజిటల్‌గా సేకరిస్తారని, రెండు మాసాల్లోనే పూర్తవుతుందని కొన్ని గాలివార్తలు వినిపించటం మినహా అధికారికంగా స్పష్టత ఇచ్చినవారు లేరు. ఈసారి జనగణనతో అనేకం ముడిపడి ఉన్నాయి. జనగణన సేకరణ – జనాభా పొందికల్లో సంభవించిన మార్పుల నేపథ్యంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. దీనిపై ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరాలు చెబుతున్నాయి. డీలిమిటేషన్‌పై పార్లమెంటు విధించిన నిషేధం 2026లో తొలగిపోతుంది. ఈ జనాభా లెక్కల తదుపరి మహిళా రిజర్వేషన్ చట్టం అమలులోకి రావాలి. ఇదంతా పూర్తికావటానికి బహుశా వచ్చే సార్వత్రిక ఎన్నికల పుణ్యకాలం గడిచిపోయినా ఆశ్చర్యం లేదు.

ఇక కులగణన అనే వర్తమానంలోకి వద్దాం. బ్రిటిష్‌రాజ్యం నిర్వహించిన కులగణన(1931) కులవ్యవస్థను పటిష్టీకరించేదిగా ఉన్నదన్న అభిప్రాయంతో స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సహా రాజకీయ మేధావులు దాన్ని విమర్శించారు. అంతేగాక 1901 లెక్కల్లో 1646 కులాలు నమోదుకాగా, 1931కి అవి 4147కు పెరిగాయి. మన జాతీయోద్యమ నాయకుల ఒత్తిడితో 1941 జనాభా లెక్కల్లో బ్రిటీష్ ప్రభుత్వం కులగణనను మినహాయించింది. 1951 సెన్సెస్‌లో నెహ్రూ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి జనాభా లెక్కలను మాత్రమే అనుమతించింది. 1961 నాటికి ఒబిసిలు కోరితే వారి జనాభా లెక్కలు తీసేందుకు అనుమతించింది. అదొక జాతీయ సర్వే తప్ప చట్టబద్ధ కులగణన కాదు. 1990లో మండల్ కమిషన్ సిఫారసుల అమలుతో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్‌లు వచ్చాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్ని ఆ నివేదిక ప్రభావితం చేసింది. కుల జనగణన డిమాండ్‌ను, కేంద్రం ముందుకు రానందున బిహార్‌లో మహాగట్బంధన్ (నితీశ్) ప్రభుత్వం, కర్నాటక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణన నిర్వహించటాన్ని మండల్ కమిషన్ నివేదికకు కొనసాగింపుగానే చూడాలి. ఆ నివేదికలోని రిజర్వేషన్‌ల ను అమలు జరుపుతున్నారుగాని, సామాజిక న్యాయంకోసం ఉద్దేశించిన అనేకానేక చర్యల చిట్టా విప్పలేదు.

కేంద్రప్రభుత్వ తాజా నిర్ణయం తర్వాత దాని ఖ్యాతిని దక్కించుకునే విషయమై ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్ మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. స్వాతంత్ర్యం అనంతరం అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో కులవ్యవస్థను పటిష్టం చేసే కులగణనను జనగణనలో చేర్చలేదు. అప్పటి నుంచి అది కొనసాగుతోంది. ఆనాటి నిర్ణయాల్లో, అంతకుముందు జాతీయోద్యమంలో ఏ పాత్ర లేని జనసంఘ్ వారసురాలైన బిజెపి నేటి హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ గతంలో కులగణనను వ్యతిరేకించిందన్నారు. మొన్నటిదాకా తామెందుకు వ్యతిరేకించారో మాత్రం చెప్పలేదు. తెలంగాణ కులగణనలో ముస్లిం బిసిలను చేర్చినందున దాన్ని వ్యతిరేకిస్తున్నామని, ముస్లిం కేటగిరీని తొలగిస్తే చట్టానికి కేంద్రం ఆమోదం తెస్తామని ఇంతకుముందు అడ్డగోలు వాదన చేశారు బిజెపి తెలంగాణ కేంద్రమంత్రులు. ఇప్పుడేమో కులగణనను ఆమోదించాక, తెలంగాణ రోల్ మోడల్ అనే కాంగ్రెస్ క్లెయింలు కర్ణకఠోరంగా ఉన్నందున కావచ్చు – అది జనగణన కాదు, సర్వే, తప్పుల తడక అని ఆరోపిస్తున్నాడు కేంద్ర మంత్రి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ గణనలో ముస్లిం పేదలను కూడా చేర్చుతారని వార్తలొస్తున్నాయి. అదే నిజమైతే వీళ్లెలా మింగుతారో, అప్పుడేమి తర్కవాదన చేస్తారో ఆసక్తిదాయకం.

కులగణనను సాధించుకున్నది భారత ప్రజలు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మాడు పగిలింది కాబట్టి భవిష్యత్‌కోసం సానుకూల చర్యగా ఈ నిర్ణయం చేశారని చెప్పవచ్చు. అయితే ఎవరు కోరినా, ఒత్తిడి తెచ్చినా ఈ మంచి ప్రయత్నాన్ని అందరూ స్వాగతించాలి. అయితే ఈ సువిశాల దేశంలో కులాలు, వాటి స్థితిగతులు అన్ని రాష్ట్రాల్లో ఏకరీతిన లేవు. రాష్ట్రం రాష్ట్రానికీ కులాల్లో మార్పు ఉంది. కులవ్యవస్థ హిందువుల్లోనే కాదు ఇతర మత గ్రూపుల్లో కూడా ఉంది. ఎందుకంటే హిందువులు ఏ మతంలోకి మారినా వారి వెంట తమ కులాలను తీసుకెళ్లారు. అందువల్లనే దళితులు, ఆదివాసీలు, ఒబిసిలు తమ మతంతో నిమిత్తం లేకుండా రిజర్వేషన్‌లు కోరుతున్నారు. క్రైస్తవుల్లో 300 రికార్డు అయిన కులాలు, ముస్లింల్లో 500 కులాలు ఉన్నాయి. అందువల్ల మతాలకు అతీతంగా, రాజకీయ జోక్యం లేకుండా పేదలందరికీ న్యాయం జరిగేలా ఈ కులగణన ప్రక్రియను చాకచక్యంగా నెరవేర్చాలి.

# ట్రంప్ వాణిజ్య యుద్ధం : నేటి సామ్రాజ్యవాదం



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

వ్లాదిమిర్ ఇల్యీచ్ లెనిన్ 1917 అక్టోబర్ విప్లవానికి అద్భుతమైన వ్యూహకర్తనే కాకుండా, 20వ శతాబ్దపు అత్యుత్తమ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తలలో ఒకరు. ఆయన దోహదాలు విప్లవాత్మక ఆలోచన ఆయుధాలను శక్తిమంతం చేయటంతో పాటు, వాటి పదును పెంచడంలో గణనీయమైన పాత్ర వహించాయి. పెట్టుబడిదారీ విధానంపై విమర్శకు మార్క్స్, ఏంగెల్స్ పునాది వేయగా, గుత్తాధిపత్యం, ద్రవ్యపెట్టుబడి శకంగా పెట్టుబడిదారీ విధానం రూపాంతరాలు చెందడాన్ని లెనిన్ ఆకళింపు చేసుకున్నారు. ఆయన 'సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ' (1916) అనే ప్రభావశీల రచన చేశారు. భూస్వామ్య విధానంతో పోల్చినప్పుడు పెట్టుబడిదారీ విధానం ఏ విధంగా తన అభ్యుదయ స్వభావాన్ని కోల్పోయి, అనివార్యంగా సామ్రాజ్యవాదంగా రూపాంతరం చెందిందీ, ద్రవ్య పెట్టుబడి ప్రపంచ ఆధిపత్యం, మార్కెట్‌ల కోసం పోటీ, పెట్టుబడి ఎగుమతి, హింసాత్మక విభజన, ప్రపంచ పునర్విభజనగా ఏ విధంగా మార్పులకు లోనవుతుందనే విషయాలపై లెనిన్ అందులో లోతైన, భౌతిక విశ్లేషణ అందించారు. ''సామ్రాజ్యవాదమనేది పెట్టుబడిదారీ విధానంలో గుత్తాధిపత్యం, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం స్థిరంగా అభివృద్ధి చెందే దశ; అందులో పెట్టుబడి ఎగుమతికి స్పష్టమైన ప్రాధాన్యత దక్కుతుంది'' అని ఆయన విడమరిచి చెబుతూ, 21వ శతాబ్దపు ఉధృత వాణిజ్య యుద్ధాలు సహా ఆధునిక అంతర్–సామ్రాజ్యవాద సంఘర్షణలను అర్థం చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం సామ్రాజ్యవాద తర్కం ఎంత మొరటుగా, దురహంకార పద్ధతిలో పనిచేస్తుందో ఒక ఉదాహరణ. 'మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ (అమెరికాను తిరిగి గొప్పగా మార్చుదాం)' అనే పేరుతో ట్రంప్ ఆచరిస్తున్న దుందుడుకు జాతీయవాద ఆర్థిక విధానాలు పెట్టుబడిదారీ విధానం నుండి తెగతెంపులకుగాక దాన్ని మరింత ఉధృతం చేయటాన్ని ప్రతిబింబిస్తున్నది. ఆయన ప్రయోగిస్తున్న సుంకాలు, బెదిరింపులు, ఏకపక్ష ఆర్థిక నిర్బంధాలు, ఆయన చెబుతున్నట్లుగా అమెరికా శ్రామికులను రక్షించేవి కావు. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా పెట్టుబడి, కార్పొరేట్ గుత్తాధిపత్యాలను క్షీణత నుంచి పరిరక్షించేవి. జనరంజక వాక్పటిమ ముసుగులో తీసుకుంటున్న ఈ చర్యలు అంతర్జాతీయ పోటీలో కోల్పోతున్న సర్వాధికారాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు యత్నిస్తున్న పాలక వర్గ ప్రయోజనాల కోసం తీసుకొంటున్నవే.

ట్రంప్ ఆరంభించిన సుంకాల యుద్ధం, దాని ఆర్థిక అసంబద్ధతలోనే కాకుండా, ప్రత్యేకించి దాని దుస్సాహసం, మిలిటరీ స్వభావం రీత్యా ప్రమాదకరమైనది. ట్రంప్, ఇతరులు ఆరంభించిన వాణిజ్య యుద్ధం ఆర్థిక వ్యవస్థల పాలిట విపత్తుగా మారి, కరెన్సీ యుద్ధం ఫలితంగా 2008లో తలెత్తిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం కంటే భారీ పరిమాణంలో ఉండబోతుంది. బహిరంగంగా బహుళపక్ష ఒప్పందాల తిరస్కరణ, ఆంక్షల బెదిరింపులు, డాలర్ ఆయుధీకరణకు, భౌగోళిక రాజకీయ బెదిరింపులకు వాణిజ్య విధానం పరికరంగా మారింది. లెనిన్ అభివర్ణించినట్లుగా ''యుద్ధాలు, విప్లవాల శకం'' పరిస్థితులకు ప్రపంచాన్ని ట్రంప్ వేగంగా నెట్టి వేస్తున్నాడు. అంతర్జాతీయ సంబంధాల విషయంలో సైనికీకరణ, జాత్యాహంకారం, దురహంకార పూరిత పద్ధతులతో కూడిన ట్రంప్ విధానాలు సామ్రాజ్యవాద విశేషాధికారాన్ని పెత్తందారితనంతో పట్టుకువేలాడేందుకు నిస్పృహతో చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తున్నాయి.

అంతకుమించి, ట్రంప్ ఆర్థిక జాతీయవాదం విదేశీయుల పట్ల తీవ్ర విముఖత, జాత్యాహంకారంతో కూడుకున్నది. పన్ను విరామాలు, నియంత్రణల తొలగింపుల ద్వారా పెట్టుబడికి అదుపాజ్ఞలు లేని చలనాన్ని కల్పిస్తూ, ప్రజా సంచారాన్ని – ముఖ్యంగా కార్మికు లు, వలసదారులను హింసాయుతంగా అడ్డుకుంటున్నారు. వలసల నిషేధ ం, సరిహద్దుల్లో గోడలు, నిర్బంధ శిబిరాలు, జాత్యాహంకార నిఘా అమలుతో అమెరికన్‌ల ఉద్యోగాలను రక్షిస్తున్నామనే పేరుతో సమర్థించుకుంటున్నారు. కార్పొరేషన్‌లలో ఔట్ సోర్సింగ్ ఉపాధి, యూనియన్‌లను విస్మరించడం వంటి చర్యల మధ్యే ఇది కొనసాగుతుంది. సామ్రాజ్యవాదం నిజ స్వరూపంలో పెట్టుబడి స్వేచ్ఛా చలనం, బలవంతంగా కార్మిక గమనాన్ని నిరోధించటం అనే వైరుధ్యాల మధ్య దోపిడికి వీలుగా ఇష్టానుసారం కార్మికుల కుదింపును అనుమతిస్తూ, కార్మికవర్గ విభజనకు తీవ్ర జాతీయవాదం అనే విషాన్ని ప్రయోగిస్తున్నారు.

ఇవి విధానాలు దారితప్పడం కాదని, క్షీణిస్తున్న ప్రపంచ వ్యవస్థకు వ్యక్తీకరణ అని అర్థం చేసుకునేందుకు లెనిన్ విశ్లేషణ మనకు ఉపయోగపడుతుంది. గుత్త పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాలకు ఆ వ్యవస్థ పరిధిలో పరిష్కారాలు లభించవు. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచబ్యాంకు వంటి బ్రెట్టన్‌ఉడ్స్ సంస్థలు ఏర్పడినప్పటి నుంచి, అవి బలవంతంగా ఒత్తిడి చేయడం ద్వారా ప్రత్యేకించి దక్షిణ ప్రపంచ దేశాలు సంపద కేంద్రీకరణ విధానాలను అనుసరించేలా చేస్తున్నాయి. అగ్రదేశాల మధ్య అనారోగ్య పోటీ అనివార్యంగా ఘర్షణలకు దారితీస్తుంది. సామ్రాజ్యవాద దేశాల కార్మిక వర్గం, అణిచివేతకు గురవుతున్న దేశాల కార్మిక వర్గానికి వ్యతిరేకంగా మారుతుంది. సంపద పేరుతో దోపిడీకి పాల్పడుతున్నట్లుగానే శాంతి పేరుతో యుద్ధానికి సన్నద్ధం చేస్తారు. లెనిన్ రాసినట్లుగా ''పెట్టుబడిదారీ విధానం ఎంత అభివృద్ధి చెందితే, కార్మికవర్గం అంతే బలంగా ఐక్య సామ్రాజ్యవాద బూర్జువాజీ కాడిని కింద పడేస్తుంది.''

అలాంటప్పుడు ఎలా ముందడుగు పడాలి? ఇలాంటి విధ్వంసకర, జాత్యాహంకార, సైనిక విధానాల సంకెళ్ళ నుండి మనం ఎలా తప్పించుకోవాలి? దీనికి జవాబు మార్క్సిజం– లెనినిజంలోనే ఉంది. కార్మిక వర్గ అంతర్జాతీయతవాదాన్ని పునర్వ్యవస్థీకరించుకొని, బలోపేతం చేసుకొని, సామ్రాజ్యవాదం నిజ స్వభావం ముసుగు తొలగించాలి. సొంత ఆర్థిక వ్యవస్థ రక్షణవాదం, ప్రజారంజక వాగ్దానాలను మనం తిరస్కరించాలి. బదులుగా సోషలిజం కోసం పోరాటాలను ముందుకు తీసుకెళ్ళాలి. కార్మికవర్గం తమ విముక్తి ఐక్యమత్యంలోనే ఉందని, యుద్ధం, వెలివేతలలో లేదని, సంఘీభావం, ఉమ్మడి పోరాటాల ద్వారానే అది సాధ్యమని గుర్తించాలి.

విప్లవ సాధకులు నేడు మరింత ధైర్యంగా లెనిన్ అంతర్జాతీయవాదాన్ని పునరుద్ఘాటించాలి. ఆయన ప్రకటించినట్లుగా ''వలసవాద, ఆర్థిక బానిసత్వాన్ని నిష్కర్షగా బహిర్గతం చేయటం, కార్మిక సమూహాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏహ్యతను ప్రేరేపిస్తూ, దానికి వ్యతిరేకంగా పోరాటానికి వారిని దృఢసంకల్ప చిత్తులను చేయనిదే విజయంపై ఆశ ఉండదు.'' దాని అర్థం ఆర్థిక బెదిరింపులు, జాత్యాహంకార రూపాలన్నిటినీ వ్యతిరేకించటం, ఐక్యతను నిర్మించటం, కార్మికునికి వ్యతిరేకంగా కార్మికుణ్ణి ఎదురు నిలబెట్టే సైద్ధాంతిక ఆయుధాలను ధ్వంసం చేయటం.

ట్రంప్ వాణిజ్య యుద్ధం అమెరికా కార్మికవర్గాన్ని ఏమాత్రం రక్షించకపోగా సామ్రాజ్యవాద అంతర్జాతీయ క్షీణతను, న్యాయమైన లేదా శాంతియుత ప్రపంచ వ్యవస్థను అందించలేని దాని అసమర్థతను బట్టబయలు చేస్తుంది. అసమానతలను, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని పెంపొందించిన సంప్రదాయ నయా సరళీకరణవాదం దిశగా తిరిగి వెళ్ళడం ప్రత్యామ్నాయం కాబోదు; సోషలిజం దిశగా సంఘటిత ప్రయత్నమే ప్రత్యామ్నాయం. దాని మూలాలు మార్క్స్, లెనిన్, వారు స్ఫూర్తినిచ్చిన విప్లవ ఉద్యమాల వారసత్వంలో ఉన్నాయి. అప్పుడే మనం దోపిడీ, విభజన ప్రపంచం నుంచి సమానత్వం, సహకారంతో కూడిన ప్రపంచంలోకి వెళ్లగలం. ఆ ప్రపంచంలో శాంతి అనేది యుద్ధాల మధ్య బలహీనమైన విరామంగా ఉండదు; పెట్టుబడిదారీ విధానం ఆవల నిర్మితమయ్యే ప్రపంచంలో మన్నికగల ఫలితంగా ఉంటుంది.

# జాతీయ యవనికపై మరోసారి తెలంగాణ

రాజధాని సందడి – బొమ్మగాని కిరణ్‌కుమార్

భారతదేశ జాతీయ రాజకీయ యవనికపై మరోసారి తెలంగాణ రాష్ట్రం, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్లు చర్చనీయాంశంగా మారాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా 'అబ్ కీ బార్, చార్ సౌ పార్' అంటూ బిజెపి వేగంగా ప్రచారరంగంలో ఏకపక్షంగా దూసుకుపోతున్నప్పుడు మొదటిసారి ఆ విధంగా జరిగింది. బిజెపికి 400 లోక్‌సభ స్థానాలు వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్‌లను ఎత్తేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చేందుకే అన్ని సీట్లు కావాలంటోందని నాటి తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బలమైన కౌంటర్ ప్రచారంతో కాషాయ పార్టీని డిఫెన్స్‌లో పడేశారు. జాతీయ కాంగ్రెస్ కూడా ఆ తరువాత ప్రచారంలో ఇదే మాటను ఎత్తుకుంది. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోజరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిపిఎ) జనగణనతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయంతో రెండవసారి తెలంగాణ, రేవంత్‌రెడ్డిలపై దేశం దృష్టి పడింది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే కుల గణన సర్వే చేసి, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందడమే కాకుండా, అందుకు అనుగుణంగా రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లులను పకబడ్బందీగా రూపొందించి శాసనసభల్లో ఆమోదింపజేసింది. దీంతో కులగణనలో తెలంగాణ మోడల్‌ను అనుసరించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) శుక్రవారం సమావేశమై భారత జనగణనలో కులగణనకు తెలంగాణ నమూనాను స్వీకరించాలని తీర్మానించడం, అటు తెలంగాణకు, ఇటు సిఎం రేవంత్‌రెడ్డికి క్రెడిట్. అంతకుముందు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశంలో కూడా ఈ విషయంలో తెలంగాణ మన్ననలు పొందింది.

ఇప్పటి వరకు మూడు రాష్ట్రాలలో కులగణన పూర్తయింది. అవి బిహార్,కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలు. నిజానికి కులగణన కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలి. కానీ, రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక సర్వే పేరిట శాస్త్రీయంగా కులగణనే చేపట్టవచ్చు. కులగణన జరిగిన మూడు రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండడమో, లేదా అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పుడో కులగణన మొదలైంది. బిహార్‌లో రెండుసార్లు కులగణన చేపట్టాల్సి వచ్చింది. కర్నాటకలో ఆధిపత్య పోరుతో ఇంకా లెక్కలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై క్యాబినెట్ సమావేశం జరిగినప్పటికీ అసంపూర్ణంగానే ముగిసి, మరోసారి మే 9న సమావేశం కానుంది. ఈ రెండు చోట్ల బలహీనవర్గాల ముఖ్యమంత్రులు ఉన్నారు. తెలంగాణలో ఒసి వర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను ఒక విధంగా విజయవంతంగా పూర్తి చేయగలిగింది.

తెలంగాణలో కుల సర్వేను ప్రారంభించిన తరువాత అనేక అవరోధాలు ఎదురయ్యాయి. డెడికేటెడ్ కమిషన్ లేనందున చెల్లుబాటు కాదంటూ కొందరు కోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వం ఏమాత్రం ఆటంకం ఏర్పడకుండా వెంటనే ఆ పని చేసేసింది. ఎట్టకేలకు సర్వే పూర్తి చేసి, సమాచారాన్ని విడుదల చేయగా, బిసిల జనాభా గతం కంటే తగ్గిందని, అన్ని ఇళ్ళకు సర్వే చేసే వారు వెళ్ళలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే ప్రభుత్వ అప్రమత్తమై బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బిసి సంఘాలతో చర్చించి సూచనలు, సలహాలను స్వీకరించింది. శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి కుల సర్వే గురించి సవివరంగా చెబుతూ, ముస్లిం బిసి జనాభాను కూడా కలిపి చూపితే గతం కంటే చాలా అధికంగా ఉన్నట్లేనని సమాధానపరిచారు. అలాగే ఇంకా నమోదు చేసుకోని వారికి ఆన్‌లైన్‌ద్వారా, ఫోన్ ద్వారా, సమీప సంబంధిత కార్యాలయాలను సంప్రదించడం ద్వారా సర్వేలో పాల్గొనేందుకు ప్రభుత్వం మరికొంత గడువును ఇస్తున్నట్లు ప్రకటించారు. మొత్తానికి సుమారు 97 శాతం గృహాలు, 3.54 కోట్ల మందిని సర్వే చేసి, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసారిగా కులాల వారీగా సాధికార సమాచారాన్ని సేకరించడం ద్వారా ఒక ప్రాతిపదిక ఏర్పరచిన ఘనత తెలంగాణ ప్రభుత్వం సాధించింది. అందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మూడింటిలో తెలంగాణ నమూనానే ముందుకు తీసుకువస్తున్నారు.

## జాతీయ ఎజెండా చేసిన రాహుల్‌గాంధీ

నిజానికి కులగణన అంశం ఎప్పటి నుంచో చర్చలో ఉన్నప్పటి నుంచి దానిని జాతీయ స్థాయి ఎజెండాగా బహుళ ప్రచారంలోకి తీసుకువచ్చింది రాహుల్‌గాంధీ అంటే అతిశయోక్తి కాదు. గత లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఈ అంశాన్ని జనంలోకి విస్తృతంగా తీసుకెళ్ళారు. తెలంగాణ గడ్డపై ప్రచారం సందర్భంగా ఆయన పదే పదే ఈ అంశాన్నే లేవనెత్తారు. 'జిస్‌కీ జిత్నీ హిస్సేదారి, ఉస్కీ ఉత్నే భాగీదారి (ఎవరి వాటా ఎంతో, అధికారంలో అంతే వాటా)' అన్న ఆయన నినాదం విశేష ప్రాచుర్యం పొందింది. తాము అధికారంలోకి రాగానే కులగణన చేస్తామని, రిజర్వేషన్‌లపై 50 శాతం పరిమితిని బద్దలుకొడతామని, రాజ్యాంగంలోని 15(5) అధికరణ ప్రకారం ప్రైవేటు విద్యారంగంలో రిజర్వేషన్ కల్పిస్తామని వాగ్దానం చేశారాయన. ఆ దిశగానే తెలంగాణలో కాంగ్రెస్ అధికారం రాగానే కులగణన సర్వే పూర్తయ్యి, నివేదికపై చట్టసభల ముద్రపడింది.

కొన్ని వర్గాలకు చెందిన, కొందరి చేతుల్లోనే అధికారం, సంపద కేంద్రీకృతమైందని, ఆ వివరాలన్నీ బైటపడేందుకు తొలి అడుగే సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన అని, అది సామాజిక ఎక్స్‌రేలాంటిదని రాహుల్‌గాంధీ పదే పదే చెబుతూ వస్తున్నారు. ఇది నిరూపితమైందనేందుకు ఆయన తెలంగాణ సర్వేనే ఒక ఉదాహరణగా ఉటంకించారు. కులగణనపై కేంద్రం నిర్ణయం వెల్లడించిన రోజు ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో కీలకాంశాలు ఉన్నాయి:– ''తెలంగాణలోని కార్పొరేట్ స్ట్రక్చర్‌లో సిఇఒలు, మేనేజమెంట్ టీమ్, సీనియర్ మేనేజ్‌మెంట్, ఓనర్‌షిప్ స్ట్రక్చర్(యాజమాన్య వ్యవస్థ)లో ఒక్క దళితుడు, ఒక్క ఆదివాసీ, ఒక్క బలహీనవర్గానికి చెందిన వారు లేరు. నేను ఒక్క శాతం అనడం లేదు. ఆ వర్గాల నుంచి ఒక్కరు కూడా లేరు. అంటే ఆ స్థానాలలో 90 శాతం ఇండియాకు ప్రాతినిధ్యం లేదు. ఇక గిగ్ వర్కర్‌ల జాబితాలో చూస్తే కేవలం ఒబిసి, దళిత్, ఆదివాసీలే ఉంటారు. దీనిని నేను ఆధునిక బానిసత్వం అంటాను. ఇక్కడ రెండు ప్రవాహాలు ఏర్పడుతున్నాయి. ఒక ప్రవాహంలో కార్మికులు, పేదరికం, నిరుద్యోగం ఉంది. ఇందులో దళిత్, ఆదివాసీలు, వెనుబడినవారే ఎక్కువ. రెండవ ప్రవాహంలో ఉన్న ఇలైట్(ఉన్నతస్థానం వ్యక్తులు) మొత్తం వ్యవస్థను నియంత్రిస్తున్నారు. అందులో పైన అంబానీ, అదానీ కూర్చున్నారు. కుల గణన ఈ పద్ధతులను మార్చేందుకు మొదటి అడుగు'' అని ఆయన సాధికారికంగా చెప్పారు. మొత్తానికి రాహుల్‌గాంధీ ఆలోచనలకు తెలంగాణ రాష్ట్రం ఆచరణ రూపం చూపింది. అందుకే కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకోగానే , ప్రధాన ప్రతిపక్ష పార్టీ పదే పదే తెలంగాణ నమూనాను భారతప్రభుత్వం అనుసరించాలనే సిఫార్సు చేయడంతో దేశం దృష్టి తెలంగాణపై, సిఎం రేవంత్ రెడ్డిపై పడింది.

## బిజెపికి ఒక అవకాశం

కారణాలేమైనప్పటికీ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కులగణనను చేపట్టాలని తీసుకున్న నిర్ణయం స్వాగతించదగిందే. కులగణన భాగంగా ఉండే దేశవ్యాప్త జనగణనను బహుశా 2026 జనవరి తరువాత చేపట్టవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అంటే సుమారు ఏడాది తరువాత జనగణన ప్రారంభమై, ఆ తరువాత వాటి వివరాలు వెల్లడయ్యేందుకు మరో ఏడాదికిపైగా పట్టొచ్చు. అంటే కులగణన వివరాలు వెల్లడయ్యేందుకు దగ్గర దగ్గర రెండు, రెండున్నర సంవత్సరాలు పట్టొచ్చేమో! తెలంగాణ కులగణన సర్వేలో బిసిల శాతం 56.33 శాతంగా తేలింది. బిసి రిజర్వేషన్‌ల బిల్లుల్లో రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. పైగా ఆ బిల్లులు శాసనసభలో అన్ని పక్షాల సమ్మతంతోనే ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. రేపు జనగణనలో కులగణన వివరాలు వెల్లడైనప్పుడు తెలంగాణలో బిసి జనాభా ఇంతకంటే తక్కువకాదనేది సర్వాంగీకార సత్యమే. అప్పటిలోగా విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్‌ల పెంపు కోసం తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపి పంపిన రెండు బిల్లుకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపినట్లయితే చిత్తశుద్ధి నిరూపించుకున్నట్లవుతుంది.

కుల గణనపై కేంద్రం నిర్ణయం వెల్లడించిన రోజు ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో కీలకాంశాలు ఉన్నాయి:– ''తెలంగాణలోని కార్పొరేట్ స్ట్రక్చర్‌లో సిఇఒలు, మేనేజమెంట్ టీమ్, సీనియర్ మేనేజ్‌మెంట్, ఓనర్‌షిప్ స్ట్రక్చర్ (యాజమాన్య వ్యవస్థ)లో ఒక్క దళితుడు, ఒక్క ఆదివాసీ, ఒక్క బలహీన వర్గానికి చెందిన వారు లేరు. నేను ఒక్క శాతం అనడం లేదు. ఆ వర్గాల నుంచి ఒక్కరు కూడా లేరు. అంటే ఆ స్థానాలలో 90 శాతం ఇండియాకు ప్రాతినిధ్యం లేదు. ఇక గిగ్ వర్కర్‌ల జాబితాలో చూస్తే కేవలం ఒబిసి, దళిత్, ఆదివాసీలే ఉంటారు'' అని ఆయన అన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కేదార్‌నాథ్‌కు పోటెత్తిన భక్తులు..

**రుద్రప్రయాగ్:** జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 30వేల మందికిపైగా మంజునాథుడిని దర్శించుకున్నారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు వేద మంత్రోచ్చారణతో కేదార్‌నాథుని ఆలయ తలుపులు తెరచుకున్నాయి. సాయంత్రం 7గంటలవరకు అధికారిక గణాంకాల ప్రకారం 30 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. ఇందులో 19,196 మంది పురుషులు ఉండగా, 10,597 మంది మహిళలు, 361 మంది ఇతరులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో ఆరునెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయిఉంటుంది.తిరిగి వేసవిలో ఆలయ తలుపులు తెరుస్తారు. బద్రినాథ్ ఆలయం ఈ నెల 4న తెరచుకోనుంది.

# ఆలయంలో తొక్కిసలాట

## ఆరుగురు మృతి, మరో 70మందికి పైగా భక్తులకు గాయాలు









### గోవాలోని శ్రీ లైరాయ్ దేవాలయంలో ఘటన

**పనాజి :** గోవాలో తీవ్ర విషాదం జరిగింది. ఉత్తర గోవాలోని శిర్గావ్ గ్రామంలో ఉన్న శ్రీ లైరాయ్ దేవి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తొక్కిలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 70కిపైగా మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ దర్యాప్తునకు ఆదేశించారు. వార్షిక జాతరకు వచ్చిసిన వేలాది మంది భక్తులు ఆలయానికి వెళ్లే ఇరుకైన దారిలోకి ఒక్కసారిగా రావడంతో తొక్కిసలాట జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ తొక్కిలాటలో ఆరుగురు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారని, క్షతగాత్రులు రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని డిజిపి అలోక్ కుమార్ పిటిఐకి తెలిపారు. ఈ ఉత్సవానికి కనీసం 30,000 నుండి 40,000 మంది ప్రజలు తరలివచ్చారు. కొందరు ఒక వాలుపై నిలబడి ఉన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు వాలుపై పడిపోవడంతో మరికొందరు ఒకరిపై ఒకరు పడిపోయారు అని ఆ అధికారి తెలిపారు. 40 నుండి 50 మంది వాలుపై పడిపోయారని దీంతో అక్కడ తొక్కిసలాట జరిగిందన్నారు. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక నుండి వేలాది మంది భక్తులు ఆలయంలో జరిగే వార్షిక ఉత్సవానికి హాజరయ్యారు. ఈ విషాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని, స్థానిక పరిపాలన విభాగం బాధితులకు సహాయం చేస్తోందని ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేశారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఉత్తర గోవా జిల్లా ఆసుపత్రిలో, తొక్కిసలాట జరిగిన ప్రదేశంలో క్షతగాత్రులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘటనపై వివరణాత్మక విచారణకు ఆదేశించానన్నారు. నివేదిక రాగానే బహిరంగంగా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఇతర ఆలయ ఉత్సవాల్లో ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే మాట్లాడుతూ, దాదాపు 80 మంది గాయపడ్డారని, ప్రస్తుతం గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (జిఎంసి)లో 13 మంది చికిత్స పొందుతున్నారని, వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నారని, మిగిలిన వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అత్యవసర వార్డులో ఉన్నారని చెప్పారు. అసిలో హాస్పిటల్ (మాపుసా), బిచోలిమ్, సంఖలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్‌సి) మరియు జిఎంసితో సహా ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో 75 మంది రోగులకు చికిత్స అందించామని రాణే చెప్పారు. ప్రధానమంత్రి కార్యాలయం పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తోందని, కేంద్రం అన్ని సహాయం చేస్తామని హామీ ఇచ్చిందని బిజెపి గోవా యూనిట్ అధ్యక్షుడు దామోదర్ నాయక్ అన్నారు. ఈ సంఘటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ సంతాపం వ్యక్తం చేయగా, అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి) ప్రభుత్వం తొక్కిసలాటకు బాధ్యత వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌ఛార్జ్ అమర్‌నాథ్ పంజికర్ మాట్లాడుతూ వేడుకల సందర్భంగా మరిన్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రత, జనసమూహ నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గోవా ఫార్వర్డ్ పార్టీ (జిఎఫ్‌పి) ఈ ఘటనను పోలీసులు, స్థానిక పరిపాలన వైఫల్యంగా అభివర్ణించింది. మృతుల బంధువులకు రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసింది.

## రిజర్వేషన్ విధానాలు సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలి

### జనగణన డేటాపై ఆర్‌జెడి నేత తేజస్వి ప్రధానికి లేఖ



**పాట్నా :** వచ్చే జనాభా లెక్కల్లోనే కులగణనను చేర్చుతామని కేంద్రం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇది మన దేశం సమానత్వం వైపు సాగే ప్రయాణంలో ఒక మార్పును తీసుకొచ్చే క్షణమని అందులో పేర్కొన్నారు. కులగణన కేవలం డేటా కాదని, అనేక మంది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని రాసుకొచ్చారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కులగణన ఎప్పటికీ ముగిసిపోదని.. ఇది సామాజిక న్యాయం వైపు చేసే సుదీర్ఘ ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. కులగణన నిర్వహించిన అనంతరం ఆ డేటాను వ్యవస్థాగత సంస్కరణలు చేయడానికి ఉపయోగిస్తారా లేదా మునుపటి కమిషన్‌ల నివేదికల మాదిరిగానే ఉంచేస్తారా అని ప్రధానిని ప్రశ్నించారు. జనాభా లెక్కలు, కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వానికి బిహార్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నోఏళ్లుగా ప్రతిపక్షాలు చేస్తున్న కులగణన డిమాండ్లను ఎన్‌డిఎ ప్రభుత్వం పట్టించుకోకుండా.. దేశ ప్రజల్లో విభజనలు చేయడం సరైన చర్య కాదని పేర్కొందన్నారు. బిహార్ కుల సర్వే చేపట్టినప్పుడు కూడా పదేపదే దానిని అడ్డుకుందని గుర్తు చేశారు. ఆలస్యంగా అయినా కేంద్రం సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనివల్ల సమాజంలో చాలాకాలంగా అణచివేతకు గురవుతున్న ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. జనాభా గణన డేటా సామాజిక రక్షణ, రిజర్వేషన్ విధానాల సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలని తేజస్వీ అన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లపై ఉన్న ఏకపక్ష పరిమితిని కూడా పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా లెక్కల్లోనే దేశంలో కులగణనను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఇటీవల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

## సూసైడ్ బాంబు ఇవ్వండి.. పాక్‌పై యుద్ధానికి వెళ్తా..

### కర్ణాటక మంత్రి బిజె జమీర్ అహ్మద్‌ఖాన్



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడితో పొరుగుదేశం పాకిస్థాన్‌పై భారతీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దాడికి ప్రతీకారం తీర్చుకోవాలంటూ కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకు చెందిన ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆత్మాహుతికి బాంబు ఇస్తే పాక్‌పై పోరాటానికి తాను సిద్ధమేనని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కర్ణాటక గృహ నిర్మాణ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి బిజె జమీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఎప్పటికీ భారత్‌కు శత్రుదేశమే అని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనకు అనుమతిస్తే పాక్‌తో యుద్ధానికి వెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 'మేం భారతీయులం, మేం హిందుస్థానీయులం. పాకిస్థాన్ మాతో ఎప్పుడూ సంబంధాలు పెట్టుకోలేదు. పాక్ ఎప్పటికీ భారత్‌కు శత్రుదేశమే. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే.. ఆ దేశంపై యుద్ధాన్ని ప్రారంభించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఆత్మాహుతికి నాకొక బాంబు ఇవ్వండి. దాన్ని నా శరీరానికి అమర్చుకుని పాక్‌వెళ్లి వారిపై దాడి చేస్తాను' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

## బేషరతుగా బాక్రా నీరు విడుదల చేయండి

### పంజాబ్‌కు హర్యానా అఖిలపక్షం విజ్ఞప్తి

**చండీగఢ్ :** పొరుగు రాష్ట్రానికి బేషరతుగా త్రాగు నీరు విడుదల చేయాలని పంజాబ్ లోని ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వానికి హర్యానా అఖిలపక్ష సమావేశం విజ్ఞప్తి చేసింది. హర్యానాలో శనివారంనాడు అఖిలపక్ష సమావేశం జరిగింది. భాక్రా డ్యామ్ నుండి బేషరతుగా నీరు విడుదల చేయాలని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ అధ్యక్షతన జరిగిన సమావేశం కోరింది. భాక్రా బియాస్ నిర్వహణ బోర్డు మార్గదర్శకత్వాలను పంజాబ్ ప్రభుత్వం పాటించడంలేదనీ, ఆ మేరకు నీరు విడుదల చేయడం లేదనీ, ఈ విధమైన చర్యలు రాజ్యాంగ విరుద్ధం, అమానవీయమైనవనీ, సమాఖ్య రాజ్యాంగవ్యవస్థపై ఇది దాడి చేయడమేననీ అఖిలపక్ష సమావేశం పంజాబ్ ప్రభుత్వానికి తెలియజేసింది. సమావేశానంతరం ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పాత్రికేయులతో మాట్లాడారు. వివిధ పార్టీ నాయకులు పాల్గొన్న ఈ సమావేశం మాన్ ప్రభుత్వం తక్షణం బేషరతుగా భాక్రా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సమావేశం ఒక తీర్మానం ఆమోదించింది. ఏప్రిల్ 23 వ తేదీన, ఏప్రిల్ 30వ తేదీన రెండు సార్లు జరిగిన సమావేశాలలో భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు (బిబిఎంబి) టెక్నికల్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే పంజాబ్ ప్రభుత్వం అమలు చేయాలని తీర్మానం కోరింది. హర్యానా ప్రభుత్వ హక్కులను తాము కాపాడు కుంటామని నాయబ్ సింగ్ సైనీ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పొరుగురాష్ట్రంలో ప్రజల ఆవేదనను, రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. ''మేం జగడానికి సిద్ధంగా లేం, మా మార్గం అదికాదు, న్యాయబద్ధఃగా అడుగుతున్నాం, మాకు సహకరించండి, పొరుగు రాష్ట్రం బాధ అర్థం చేసుకోండి'' అని ఆయన కోరారు. నీటిని విడుదల చేయకుండా అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, అన్యాయపూరితమైన, అక్రమ, అసంబదధమైన నిషేధానికి స్వస్తిచెప్పాలని కోరారు.''వారు త్రాగునీటినికి రాకుండా చేశారు. అఖిలపక్షాలన్నీ బలంగా తమ ప్రతిస్పందన తెలియజేశాయి, హర్యానా రాష్ట్ర ప్రయోజనాలను ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా కృషి చేస్తాయి, కేవలం హర్యానాలోని రాజకీయపార్టీలు మాత్రమేకాదు, దేశంలో సమాఖ్య రాజ్యాంగ వ్యవస్థపట్ల విశ్వాసం ఉన్న అన్ని రాష్ట్రాలు సోదరభావంతో ఐక్యంగా నిరసన తెలియజేస్తాయి'' అని నాయబ్ సైనీ అన్నారు.

## మణిపూర్‌లో ప్రధాని శీతకన్ను

### ప్రపంచాన్ని చుట్టివస్తున్న మోదీకి జాతి కలహాలతో రగిలిపోతున్న రాష్ట్రంలో పర్యటించేందుకు తీరిక లేదా!?

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మండిపాటు



**న్యూఢిల్లీ :**ప్రధాని నరేంద్ర మోడీ మణిపూర్ పట్ల శీతకన్ను వేశారని కాంగ్రెస్ మండిపడింది. 2023 నుండి జాతి కలహాల గుప్పిట్లో ఉన్న రాష్ట్రంలో పరిస్థితిని నిర్వహించడం లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైఫల్యం చెందారని ఆరోపించింది. 2022 ఫిబ్రవరిలో బిజెపి భారీ మెజారిటీతో మణిపూర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో మత హింస చెలరేగిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. మణిపూర్‌లో మే 3వ తేదీన జాతి కలహాలు ప్రారంభమయ్యాయని, డబుల్ ఇంజిన్ సర్కార్ చెప్పుకుని మూడు నెలల తరువాత రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమైందని సుప్రీంకోర్టు ప్రకటించవలసి వచ్చిందని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్న ముఖ్యమంత్రిని మోడీ ప్రభుత్వం రాజీనామా చేయమని బలవంతం చేయగా, చివరికి ఫిబ్రవరి 13, 2025న రాష్ట్రపతి పాలన విధించిందన్నారు. 'మణిపూర్‌లో వేదన, బాధలు కొనసాగుతున్నాయి. రాజకీయ క్రీడలు జరుగుతున్నాయి. విలువైన సయోధ్య ప్రక్రియ జరగడం లేదు. 60,000 మందికి పైగా అంతర్గతంగా నిర్వాసితులైన వ్యక్తులు తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు' అని రమేష్ అన్నారు. ముఖ్యంగా, ప్రధానమంత్రి మణిపూర్‌ను సందర్శించకుండా తప్పించుకుంటూనే ఉన్నారు. రాష్ట్రంలో ఎవరినీ కలవలేదు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించారు కానీ సమస్యాత్మక రాష్ట్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలను చేరుకోవడానికి సమయం, ఆసక్తి లేదా సున్నితత్వం దొరకలేదు' అని రమేశ్ ఎద్దేవా చేశారు.

## ఇప్పుడైనా గౌతమ్ అదానీ మేనల్లుడిని ప్రాసిక్యూట్ చేస్తారా? నటిస్తారా ?

**న్యూఢిల్లీ :** అంతర్గత డేటాను పంచుకున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ మేనల్లుడిపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ప్రాసిక్యూట్ చేస్తుందా? లేదా? అని ఆశ్చర్యం వ్యక్తంచేసింది. 24 సెక్యూరిటీ చట్టాలను అదానీ ఉల్లంఘించడంపై సెబీ విచారణను పూర్తి కోసం ప్రజలు ఇప్పటికీ నిరీక్షిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. 'మోదానీ అంశం బయటకు పోవడాన్ని సులభవంగా తిరస్కరణకు గురవుతోంది. పలు అదానీ గ్రూప్‌లలో డైరెక్టర్‌గా ఉన్నటువంటి గౌతమ్ అదానీ మేనల్లుడు ప్రచురించబడని వాటిని తన బావతో పంచుకోవడం ద్వారా ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డాడు. దాని ఫలితంగా రూ.90లక్షల లాభం వచ్చింది' అని జైరామ్ రమేష్ శనివారం 'ఎక్స్'పోస్ట్‌లో వెల్లడించారు. మరోసారి సెబీ ప్రధానమంత్రి అభిమాన సమూహాన్ని చేతితో చెంపపై కొట్టి వదిలేస్తుందా? లేక చట్టాన్ని పూర్తి స్థాయిలో వర్తింపజేసి కేసును విచారణ జరుపుతుందా అని రమేష్ ప్రశ్నించారు. హిండర్‌బర్గ్ వెల్లడి మేరకు విచారణ పూర్తి అయిన తర్వాత సుప్రీం కోర్టు సెబీకి ఆదేశాలు జారీ చేసి 26 నెలలు గడిచాయని ఆయన చెప్పారు. అదే సమయంలో..సెబీకి యుఎస్ సమాన హోదా కలిగిన ది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ 20202024 మధ్యకాలంలో గౌతమ్ అదానీ, ఆయన ఏడుగురు అసోసియేట్లు సోలార్ పవర్ కాంట్రాక్టులను సాధించేందుకు భారతీయ అధికారులకు రూ.2,000కోట్లు లంచాలు ఇచ్చి, దానిపై రూ.16,000 కోట్ల మేరకు లాభాలు ఆర్జించారని జైరామ్ రమేష్ ఆరోపించారు.

## బంద్ పాటించిన మణిపూర్

### జాతి కలహాలకు రెండేళ్లు కావడంతో మార్కెట్లు, స్కూళ్లు, పాఠశాలలు మూసివేత



**ఇంఫాల్/చురుచందన్‌పూర్:** మణిపూర్‌లో జాతి కలహాలకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వివిధ సంఘాలు ఇచ్చిన బంద్ మైతీ నియంత్రణలో ఉన్న ఇంఫాల్ లోయ, కుకీ ఆధిపత్య కొండ జిల్లాల్లో సాధారణ జీవితాలను ప్రభావితం చేసింది. మణిపూర్ సమగ్రతపై మైతీ గ్రూప్ సమన్వయ కమిటీ లోయ జిల్లాల్లో బంద్‌కు పిలుపునిచ్చింది. అదే విధంగా జోమి స్టూడెంట్స్ ఫెడరేషన్ (జెడ్‌ఎస్‌ఎఫ్), కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (కెఎస్‌ఒ) కొండ జిల్లాల్లో బంద్ నిర్వహించాయి. 2023లో ఇదే రోజున మైతీ, కుకీల మధ్య జాతి ఘర్షణలు చెలరేగాయి. ఫలితంగా 260 మందికి పైగామరణించారు,1,500మంది గాయపడ్డారు. 70,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారని అధికారులు తెలిపారు. ఈ కలహాలకు రెండేళ్ల అయిన సందర్భంగా శనివారం బంద్ పాటించారు. మార్కెట్లు మూసివేశారు. ప్రభుత్వ వాహనాలు రోడ్లపైకి రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కార్యాలయాలు మూసివేశారు. ఉదయం కొన్ని ప్రైవేట్ వాహనాలు రోడ్లపై కనిపించాయి. పాఠశాలలు,కళాశాలలు,ఇతరసంస్థలు కూడా మూసివేశారు. అవాంఛనీయ కార్యకలాపాలను నివారించడానికి కీలక ప్రదేశాలలో భద్రతా దళాలను కూడా మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్‌లోని ఖుమాన్‌లాంపక్ స్టేడియంలో మణిపూర్ సమగ్రతపై మైతీ గ్రూప్ సమన్వయ కమిటీ 'మణిపూర్ పీపుల్స్ కన్వెన్షన్' నిర్వహించనుంది. సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరింది. హింసలో మరణించిన వారికి నివాళులర్పించడానికి ఇంఫాల్‌లో సాయంత్రంకొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చురాచంద్‌పూర్, కాంగ్‌పోక్పి జిల్లాల్లోని కొండ జిల్లాల్లోని కుకీ సామాజిక వర్గం ప్రత్యేక భూభాగం కోసం డిమాండ్ చేస్తూ 'విభజన దినోత్సవం' జరుపుకున్నది.

## ఉపరితలం నుండి ఉపరితలానికి.. పాకిస్థాన్ బాలిస్టిక్ క్షిపణుల పరీక్ష సన్నాహాలు 'రెచ్చగొట్టేచర్యే'

### కాల్పుల విరమణ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డ భారత్



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలపై భారత్ తీవ్ర స్థాయిలో మండిపడింది. పెరిగిపోతున్న ఉద్రిక్తతల నడుమ ఉపరితలం నుండి ఉపరితలానికి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడానికి పాకిస్తాన్ ప్రయోగాత్మక పరీక్షల సన్నాహక చర్యలు చేపట్టడం 'రెచ్చగొట్టే నిర్లక్ష్యపు చర్య', 'ప్రమాదాన్ని తీవ్రం' చేసే పరిస్థితిగా భారతదేశం చూస్తోందని శనివారం ఈ విషయం తెలిసిన పలువురు వ్యక్తులు తెలిపారు.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్‌చే పరీక్షించబడిన క్షిపణి పరీక్షలు 'కఠోరంగా రెచ్చగొట్టడం', భారతదేశంలో 'ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నానికి తక్కువేమీ కాదు' అని వారు చెప్పారు.కశ్మీర్‌లోయలోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడిచేసి 26మంది ప్రజలను అత్యంత కిరాతకంగా కాల్చిచంపిన తర్వాత భారతదేశంపాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు రగుల్కొంటున్నాయి. ఇరుదేశాల సరిహద్దు సంబంధాలతో అనుసంధానమైన ఈ ఉగ్రదాడిలో భాగస్వాములైన నిందితులను కఠినంగా శిక్షిస్తామని భారత్ వాగ్దానం చేసింది. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా సహా యురోపియన్ మరికొన్ని ప్రపంచ దేశాలు ఈ ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించాయి. 'ఈ వారంలో ఉపరితలం నుండి ఉపరితలానికి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడానికి పాకిస్థాన్ సన్నాహాలు చేస్తోంది' అని ఈ విషయం బాగాతెలిసిన వ్యక్తులు తెలియజేశారు.'ఇది రెచ్చగొట్టే నిర్లక్ష్యపు చర్య' అని, 'భారతదేశానికి వ్యతిరేకంగా ప్రమాద తీవ్రతను వ్యాప్తి చేస్తున్నామని సంకేతాలు ఇవ్వడమే' ఈ చర్యలు చేపట్టడంలోని ప్రధాన ఉద్దేశం' అని ఒక వ్యక్తి చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌ఓసి) వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా ఉల్లంఘిస్తూనే ఉన్నదని, అరేబియా సముద్రంలో నౌకాదళ విన్యాసాలు, నౌకాదళ హెచ్చరికలు పిచ్చిపిచ్చిగా జారీ చేస్తున్నదని వారు చెప్పారు. అయితే ఉగ్రదాడిలో పాల్గొన్న పాత్రధారులు, సూత్రదారులు, ప్రణాళికలు రచించిన వారిని ఎవ్వరినీ వదలబోమని, కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని భారత్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి రక్షణ శాఖ అధికారుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ సమర్థవంతంగా, సమయస్ఫూర్తితో 'ఆపరేషన్ నిర్వహించేందుకు పూర్తి స్వేచ్ఛను మీకు ఇస్తున్నాం' అని ప్రధాని అభయం ఇచ్చారని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి.

## 450 కి.మీ దూరం ప్రయాణించే పాక్ అబ్దాలీ క్షిపణి పరీక్ష విజయవంతం

**ఇస్లామాబాద్ :** భారత్–పాకిస్థాన్ మధ్య రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో శనివారంనాడు పాకిస్థాన్ అబ్దాలీ క్షిపణి ప్రయోగం చేసింది. భూతం నుండి భూతంపైకి 450 కి.మీ దూరం ప్రయాణించగల అబ్దాలీ క్షిపణి వ్యవస్థను తాము విజయవంతంగా ప్రయోగించినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. గడచిన పది రోజులుగా పాకిస్థాన్ తన క్షిపణి వ్యవస్థలను పరీక్షించడం ప్రారంభించిది. సైన్యాన్ని అప్రమత్తం చేసింది. గగనతల వ్యవస్థలను రాత్రివేళ కనిపెట్టుకుని ఉండేందుకు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నది. తమ ఆయుధ వ్యవస్థలు ప్రపచంలోని వివిధ ప్రాంతాలలో ఉన్నాయని, సమయానికి వాటిని రప్పిస్తామని కూడా పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రకటన చేసింది. తన సిబ్బందిని యుద్ధానికి సిద్ధం చేయడంలో భాగంగా కీలకమైన సన్నాహాలు చేస్తున్నది. వీటిలోభాగంగా ముఖ్యంగా క్షిపణులను విజయవంతంగా పరీక్షిస్తున్నది. ''ఇండస్ విన్యాసాలు'లో భాగంగా క్షిపణి పరీక్షలు చేస్తున్నట్లు పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. కమాండర్ ఆర్మీ స్ట్రేటజిక్ ఫోర్సస్ కమాండ్ ఈ శిక్షణ ప్రారంభించారు. వ్యూహాత్మక ప్రణాళికకు చెందిన సీనియర్ అధికారులు, పాకిస్థాన్ వ్యూహాత్మకసంస్థకు చెందిన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు వీటిని పర్యవేక్షిస్తున్నారు. ఆచరణాత్మకంగా దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్న ఆత్మవిశ్వాసాన్ని వారు ప్రకటించారు.

## భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా ఆత్మకూర్

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఆత్మకూర్ ఎం మండలంలో తేది మార్చ్ ఐదు నుండి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామానికి వచ్చి భూ సమస్యలు పరిష్కారం చేస్తారని తెలిపారు. ఎవ్వరికైనా భూ సమస్యలు ఉంటే రైతులు వారి గ్రామంకి వచ్చిన రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కృష్ణారెడ్డి, తహసిల్దార్ లావణ్య, డిప్యూటీ తహసిల్దార్ సఫీయోద్దీన్, గిరిధవరి మల్లికార్జున రావు పాల్గొన్నారు.



## సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలి: జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పలు సందర్భాలలో కేసులు నమోదు అయిన 73 ద్వి చక్ర వాహనాలు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనీ వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత వాహన యజమానులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లో వాహన డాక్యుమెంట్లు చూపించుకుని తమ యొక్క వాహనాలను తీసుకొని వెళ్లగలరని అన్నారు. లేని యెడల 6 నెలల కాల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి బహిరంగ వేలం వేయబడును అని తెలిపారు. ఈ వాహనా ల పూర్తి వివరాలను జిల్లా అధికారిక ఫేస్ బుక్,ట్విట్టర్ లో పొందుపర్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలు కొరకు సంప్రదించాల్సిన సంబంధిత అధికారులు మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ సూరప్ప నాయుడు ఫోన్ నంబర్ 8712670170కు ఫోన్ చేయాలని సూచించారు.






## కాంటాలు వేగం పెంచాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/మోతె:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. శనివారం మోతె మండలంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే మోతె, హుస్సేన్‌బాద్, మామిళ్లగూడెం కొనుగోలు కేంద్రాలను, పిఏసిఎస్ ఆధ్వర్యంలో నామవరం స్టేజీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా శుభ్రంగా ఉంటేనే మిల్లర్లు పెండింగ్ పెట్టకుండా దిగుమతి చేసుకుంటారని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందువల్ల ధాన్యంను కాంటాలు వేగంగా వేసి లారీల ద్వారా ధాన్యం ఎగుమతి చేయగానే ట్యాబ్ ఎంట్రీ బిల్లులు ట్యాగ్ వెంటనే చేయాలని సూచించారు. మోతె నుండి 3580 క్వింటాళ్లు, హుస్సేన్‌బాద్ నుండి 3230 క్వింటాళ్లు, నామవరం స్టేజీ నుండి 9800 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపియం వెంకయ్య, పిఏసిఎస్ సిఈవో అనంతరెడ్డి, సెంటర్ ఇంఛార్జీలు రామకృష్ణ, శ్రీనయ్య, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద మూడంచల భద్రత : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఆదివారం మద్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద మూడు అంచెల పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్సీ నర్సింహా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలలో జరిగే కళాశాలల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు, పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ర్యాలీలు, సభలు, సమావేశాలు, డిజె లు నిషేదం, జీరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ మూసివేయాలని అన్నారు. అభ్యర్థులు ఇంటి నుండి ముందుగా బయలుదేరి, హడావుడి ఒత్తిడితో ప్రయాణం చేయవద్దని కోరారు. అభ్యర్థులంతా అడ్మిట్‌కార్డు నందు చూపించిన నియమనిబంధనలు పాటించాలని కోరారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా గిరిజన యువతి సుష్మ




**ప్రజాపక్షం/చివ్వేంల:** తెలంగాణ హైకోర్టు 2024/25లో నిర్వహించిన జడ్జిల నియామక పరీక్షల్లో మండలంలోని రాజుతండాకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు ధారావత్ భాస్కర్‌సంధ్య దంపతుల కుమార్తె సుష్మా జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమైంది. సూర్యాపేట పట్టణంలోని సాహితీ స్కూల్‌లో నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు చదివిన ఆమె, అనంతరం ఆరు నుండి 8వ తరగతి వరకు బేబిమూన్ స్కూల్, 9 నుండి10 తరగతి వరకు వికాస్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్‌ను హైద్రాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివిన ఆమె, ఎల్‌ఎల్‌బి పెండెకంటి లా కళాశాలలో పూర్తి చేశారు. ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటిలో చదివిన ఆమె 2024/25లో తెలంగాణ హై కోర్టు ఇచ్చిన నోటిఫికేషన్‌ను జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమయ్యారు.

**తండ్రి కలను నేరవేర్చిన కన్నకూతురు...**

జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమైన ధారావత్ సుష్మా ప్రజాపక్షంతో మాట్లాడుతూ తనతండ్రి భాస్కర్ కలను నేరవేర్చినట్లు చెప్పారు. సూర్యాపేట మున్సిఫ్ కోర్టులో చాలకాలం న్యాయవాదుల వద్ద ఆయన మున్సీగా పనిచేశారు. తనపిల్లలను జడ్జిగా చూడాలనే ఆలోచన అతనిలో మొదలైంది. ఆయనకు కూతురు సుష్మాతో పాటు కుమారుడు నిఖిల్ ఉండగా ఇద్దరిని ఎల్‌ఎల్‌బి చదివించారు. దురదృష్టవశాత్తు తన కుమారుడు నిఖిల్ రెండున్నర ఏళ్ల క్రితం అనుమానస్పందగా మృతి చెందాడు. తన కూతురిని జడ్జిగా చూడాలని పట్టుదలతో న్యాయ విద్యను చదివించారు. దీంతో ఆమె తనతండ్రి చిరకాల వాంచ తీరేలా న్యాయవిద్యలో రాణించి జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికయ్యారు. సుష్మా జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నిక కావడం పట్ల సూర్యాపేట ప్రాంత ప్రజలతో పాటు గిరిజనులు ఆమెను వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి



**ప్రజాపక్షం/మోటకొండూరు :** యువత చదువుతో పాటు క్రీడలలో ముందుండి సన్మార్గంలో పయనించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎస్వోటి అడిషనల్ డిజిపి నంద్యాల నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆయన శనివారం మోటకొండూరు మండల కేంద్రంలో చామల పౌండేషన్ వ్యవస్థాపకులు చామల భాను చందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిఎల్ క్రికెట్ ప్రీమియర్ లిగ్ టోర్నమెంట్ 2025 ముగింపు కార్యక్ర మంలో పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో 22 టీములకు గాను ఫైనల్ కు చేరిన టీమ్‌లు మాటూర్, మోటకొండూర్‌లు చేరుకోగా మోటకొండూరు విజయం సాధించింది మొదటి బహుమతి మోటకొండూరు రూ.31000, రెండవ బహుమతి మాటూరు రూ.21000 నగదు బహుమతి ప్రదానం చేశారు. పౌండేషన్ సభ్యులు అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహ్మా రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చామల ఫౌండేషన్ వ్యవస్థాపకులు చామల భాను చందర్ రెడ్డి, ఉదయ్ చందర్ రెడ్డి, ఎస్సై నాగుల ఉపేందర్ యాదవ్, ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి, చామల సురేష్ రెడ్డి, క్రీడల ఆర్గనైజర్‌లు కర్రె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మోటర్‌సైకిల్ దహనం.. వ్యక్తులపై చర్యలు

**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని కిష్టరాయినిపల్లి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు పల్సర్ బైక్‌ను దహనం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాములు వృత్తి రీత్య డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శ్రీరాములు వ్యక్తిగత పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి తన బైక్‌ను కిష్టరాయినిపల్లి గ్రామపంచాయతీ ముందు ఉంచాడు. అర్ధరాత్రి శ్రీరాములు తండ్రి బహిర్భూమికి వెళ్లగా మంటల్లో కాలుతున్న బైక్‌ను చూసి కుమారుడిని లేపడంతో వారు మంటలను ఆర్పివేశారు. తన బైక్‌ను అకారణంగా కాల్చివేసిన వక్తులపై చర్యలు తీసుకోవాలని శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

# ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

### కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలి
### రోజువారి వేతనం రూ. 700 ఇవ్వాలి
### పుల్లెంలలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలు




**ప్రజాపక్షం/చండూరు :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం చండూరు మండలం పుల్లెంల గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలిసి బొల్గూరి నర్సింహ్మా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలు , ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు అందుతున్న సౌకర్యాలతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల దగ్గర కనీస అవసరాలు అయిన మంచినీరు , నీడ,మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం కూలీలకు పార, గడ్డపార ఉచితంగా ఇవ్వాలన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మండు వేసవిలో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తీవ్రమైన ఎండలు, వడగాల్పులకు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 7గంటల నుంచి 10గటల వరకు మాత్రమే పని వేళలు ఉండే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి కూలీకి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజు వారి వేతనం 700రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేరుకపోయిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లేని ఉపాధి హామీ కూలీలకు వెంటనే నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని, జాబ్ కార్డుకు అప్లై చేసుకున్న వారికి వెంటనే జాబ్ కార్డు ఇచ్చి పని కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు నిమిత్తం లేకుండా ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గం అధ్యక్షకార్యదర్శులు ఎండి జానిమియా, చెదుబుద్ది ఊషయ్య, చండూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షకార్యదర్శులు బాతరాజు సైదులు, సంజీవ, గండు సత్తయ్య, దుబ్బాక వెంకన్న, పాక లింగయ్య , మొగుదాల బిక్షపతి, కనకమ్మ, అంజమ్మ, పద్మ లక్ష్మమ్మ పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ దత్త విద్యార్థి భరత్ ఇంటికి వెళ్లి భరోసా

### పది ఫలితాల్లో 73% మార్కులు సాధించడంతో సన్మానించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** తాను దత్తత తీసుకున్న 10వ తరగతి విద్యార్థి కుటుంబానికి యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భరోసానించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లారు. పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన తెల్లవారుజామునే విద్యార్థి ఇంటి తలుపు తట్టే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శేరిగూడం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారి ఇంటికి వెళ్లిన విషయం తెలిసింది. ఆ సమయంలో భరత్ చంద్ర చారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిన జిల్లా కలెక్టర్ పదవ తరగతి పూర్తయ్యే వరకు తాను సాయం అందిస్తానని బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ప్రోత్సహించారు. అందులో భాగంగా ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో భరత్ చంద్ర చారి 73 శాతం మార్కులు సాధించడంతో స్వయంగా జిల్లా కలెక్టర్ ఇంటికి వచ్చి భరత్ చంద్ర, ఆయన తల్లి విజయలక్ష్మి లను సన్మానించారు. ఈ సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

**ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి..**

అనంతరం గుడిమల్కాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారిణి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు జరగాలని సూచించారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎస్సై జగన్,ఆర్ఐ కట్ట పాండు, ఏఈఓ శశి బిందు, పంచాయతీ కార్యదర్శి సుభాష్ తదితరులు ఉన్నారు

# నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నేడు ఆదివారం నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబులిటికం ఎంట్రన్స్ టెస్టు) అండర్ గ్రాడ్యుయేషన్ 2025 ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం నీట్ పరీక్ష కేంద్రాలైన దురాజ్‌పల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, ఇమాంపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్. జూనియర్ కళాశాల, టిజిఎస్‌డబ్ల్యూ ఆర్ స్కూల్ ఇమాంపేట, సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలలో 890 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఐదు గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకుంటున్నందున ఉదయం 11 గంటలకు కచ్చితంగా పరీక్ష కేంద్రాల గేట్లను మూసి వేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు తప్పకుండా పాటించాలని, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపుకోసం ఆధార్, డ్రైవింగ్ లైసన్స్, ఓటర్‌కార్డు ఎదో గుర్తింపుకార్డు తీసుకరావాలని, రీసెంట్ పాస్‌ఫోటో తీసుకరావాలని తెలిపారు. ఆభరణాలు, ఫుల్ హ్యాండ్ షర్ట్స్, బూట్లు ఉంటే పరీక్ష కేంద్రంలోకి అనుమతిలేదని, జామెట్రిక్ బాక్సులు, మొబైల్ ఫోన్లు , బ్లూటూత్, రిస్ట్ వాచ్, పెన్ను, వాటర్ బాటిల్స్, ఎగ్జామ్ ప్యాడ్స్‌కు అనుమతిలేదని, అభ్యర్థులకి పెన్ను పరీక్ష కేంద్రాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులు అందరు సమన్వయం చేసుకుంటూ నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు ఏర్పాట్లు చేశారని, తాగునీరు, హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జీరాక్స్ సెంటర్లు మూసివేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జయలత, సెంటర్ సూపరిండెంట్లు రమేష్, పద్మ, వినోద, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో జై బాపు జై బీమ్ సంవిధాన్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగ కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కేంద్రంలో అమిత్‌షా మాట్లాడిన మాటలకు నిరసనగా రాహుల్‌గాంధీ పిలుపు మేరకు జై బాపు, జై బీమ్ సంవిధాన్ కార్యక్రమాన్ని దేశమంతా చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ గ్రామన నిరసనలు వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గోవర్ధన్, మాచర్ల అనిల్‌కుమార్, పూసపల్లి బిక్షం, మారోజు అంజయ్య, కొమరవెల్లి, గణేష్, పరుశురాములు, సృజన్, కొండరాజు, రవి, రాకేష్, చిరంజీవి, మల్లేష్, నాగరాజు, మల్లేష్, రాంబాబు, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

### మర్రిగూడ మండల కార్యదర్శి బిక్షం రెడ్డి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** సిపిఐ బలోపేతం చేస్తూ నూతన నిర్మాణం చేయాలని,ప్రజల సమస్యల పైన అనునిత్యం ప్రజల కోసం పని చేయాలని మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్ లుకోరారు.సిపిఐ ఖుదాభక్ష్ పల్లి గ్రామ శాఖ సమావేశానికి ముఖ్య అతిధిగా వారు పాల్గొని మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరివిముక్తి కోసం తెలంగాణలో జరిగిన నైజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని వారి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త పునరుకితం కావాలని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.అనంతరం నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా మేతరి యాదయ్య, సహాయ కార్యదర్శి యట యాదగిరిని ఎన్ను కోవడం జరిగింది.ఈమావేశంలో మాజీ ఎంపిటీసీ శిరగోని బలరాం, పున్నం లక్ష్మయ్య, రాపోతు ముతయ్య, ఎఐఎస్ఎఫ్ ఇస్కిళ్ల మహేందర్, ఎఐవైఎఫ్ మండల సహాయ కార్య దర్శి పొట్ట అశోక్, ఐతగోని కృష్ణయ్య,పొట్ట యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, రామలింగం, వెంకటేష్, శంకర్, కుమార్, రాము, పవన్ పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు

### 2087 మంది అభ్యర్థులు
### నీట్‌పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.శనివారం ఆమె జిల్లా కేంద్రం, అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలోని రామగిరి లో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంజి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.కాగా నీట్ అండర్ గ్రాడ్యుయేట్ 2025 ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7 కేంద్రాలు జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 4 పరీక్ష కేంద్రాలు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయలో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 2087 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె తనిఖీ చేయడమే కాక పరీక్ష కేంద్రాల సూపరింటిండెంట్లు,నోడల్ అధికారి, సంబంధిత శాఖల అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అడిషనల్ ఎఎస్‌పి రమేష్, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాం రెడ్డి ,నీట్ నోడల్ ఆఫీసర్ ,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ,తదితరులు ఉన్నారు.



## ప్రపంచమంతా మెచ్చేలా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పోచంపల్లి ఆతిథ్యం

### స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రపంచమంతా మెచ్చేలా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ కార్మికుల తమ విభిన్న కళాకృతుల వస్త్ర ప్రపంచాలతో ఆతిథ్యం అందించనున్నట్లు స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, ఈవెంట్ ఇంచార్జ్ లక్ష్మి తెలిపారు. త్వరలో హైదరాబాదులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 72వ ఎడిషన్ మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే అందాల యువతులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక కేంద్రాల సందర్శనలో భాగంగా మే 15న పోచంపల్లి ఇక్కత్ చేనేత పరిశ్రమ బ్రాండ్ ఇమేజ్, చేనేత కార్మికుల వారసత్వ కళా సంపద ప్రపంచానికి ఎలుగెత్తి చాటేలా ప్రమోట్ చేసేందుకు రానున్న నేపథ్యంలో పట్టణంలోని టూరిజం పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. ప్రపంచ సుందరీమణుల సందర్శన క్రమాన్ని అధికారులకు వివరించారు. పోటీలలో పాల్గొనే 25 మంది ప్రపంచ సుందరిమణులు టూరిజం పార్కును సందర్శించినప్పుడు సీక్వెన్స్, కేటాయించిన సమయంలోనే సుందరిమణులకు ఎలా చేనేత తయారీ క్రమాన్ని ఎలా వివరించాలానే అంశాలను వివరించారు. ఎంట్రెన్స్ గేట్ వద్ద నుంచి మొదలుకొని పార్కులోని మ్యూజియంలో దశలవారీగా చేనేత వస్త్రాల తయారీలో నూలు వడకడం నుంచి మొదలుకొని చీర తయారయ్యే వరకు ప్రతి దశను సమయం ప్రకారంగా వారికి డెమోన్‌స్ట్రేషన్ ఇలా ఇవ్వాలనేది అధికారులకు ప్రణాళికను సూచించారు. మెహందీ స్టాలు, ప్రొజెక్టర్ హాలు, చేనేత తయారీలో ప్రతి దశను కంటెస్టెంట్లకు వివరించేందుకు స్పష్టంగా ఆంగ్లం వచ్చే స్థానిక చేనేత కళాకారిణి నియమించి ఎలా ఎక్స్ప్లెయిన్ చేయాలో శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఏడి శ్రీనివాస్, ఇన్చార్జి తహసిల్దార్ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, విద్యుత్ శాఖ అధికారి వివిధ శాఖల అధికారులు ఆమె వెంట ఉన్నారు.



## వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తం

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందువల్ల ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. వేసవిలో ప్రజలు ఎండ తీవ్రతో వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ వివరించారు. ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప బయటకు రాకూడదని,మద్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్యతో ఎట్టి పరిస్థితుల్లో ఇండ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎక్కువగా ప్రచారం చేయాలని అదేశించారు. ఎండలలో ఆల్కహాల్, టీ, కాఫీ, స్వీట్స్, చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయటకు నడవవద్దని తెలిపారు. చిన్నారులు, వృద్దులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడా నీరు త్రాగాలని, వదులుగా ఉన్న దుస్తులను ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపి, ద్విచక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వేసవిలో పలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

## వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు



**ప్రజాపక్షం/సారంగపూర్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో గత నాలుగు నెలల నుండి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పని కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వందరోజుల పనిని కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్లు మండల ఎపిఒలకు తదితర సిబ్బందికి జనవరి మాసం నుండి నేటివరకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పని కల్పించి పనిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయవలసిన అధికారులు, చేతిలో చిల్లి గవ్వలేక, తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇ ప్పటికైన ప్రభుత్వం తమ జీతాలు సకాలంలో చెల్లించాలని మండల ఫీల్డ్ అ సిస్టెంట్లు, సంఘం అధ్యక్షులు మామిడాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి సదానందం, సభ్యులు శంకర్‌రెడ్డి, రవీంధర్, ప్రకాష్, గంగాధర్, లహరి, రాజు వేడుకుంటున్నారు.

## మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లించాలని ధర్నా



**ప్రజాపక్షం / మెట్ పల్లి :** మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకు గత రెండు నెలలు నుండి జీతాలు చెల్లించకపోవడంపై శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద పరిశుద్ధ కార్మికులు వారి విధులను బహిష్కరించి గేటు వద్ద ధర్నా చేశారు. వారికి వద్దతుగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి. ఉస్మాన్ వద్దతు తెపిపారు. అక్కడి నుండి కార్మికులంతా ర్యాలీగా పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద వెళ్లి కార్మికుల జీతాలను మున్సిపల్ కమిషనర్ వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు, వీరి సమస్యలు తెలుకొని కమిషనర్ టి. మోహన్ మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి కార్మికుల యూనియన నాయులతో మాట్లాడి త్వరలో జీతాలు వేస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులంత విధుల్లోకి చేరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మిక అధ్యక్షుడు బర్ల లక్ష్మ ణ్, తోటి కార్మికులు తదితరులు పాల్గోన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలింపు వేగవంతం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** యాసంగి పంట కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలు పురోగతి పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరం లిఫ్ట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు జిల్లాలో 15 వేల క్వింటాళ్ల ధాన్యం కూడా లిఫ్ట్ చేయడం లేదని, అకాల వర్షాలు కురిస్తే అనవసరంగా నష్టం వస్తుందని, హమాలీల కొరత లేకుండా చూసి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల సమస్య అధికంగా ఉంటుందని,ప్రతి కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లుల వద్ద అవసరమైన మేర హామీలీలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు .ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని, రైస్ మిల్లుల వద్ద ఎక్కడా కోత విధించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో డి సి ఓ శ్రీ మాల, డి ఎ వో ఆదిరెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, మేనేజర్ శ్రీకాంత్,జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శారీరక మానసిక మేధో వైకల్యం గుర్తించడానికి ఇస్మార్ట్ సర్వే

జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ నరేష్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల ప్రాజెక్టు పరిధిలోని జగిత్యాల అర్బన్ లో జులాయివాడ అంగన్వాడి కేంద్రంలో శనివారం రోజున 42 ప్రశ్నలకు సంబంధించిన సర్వేను జగిత్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ నరేష్ ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఉన్న 05 సంవత్సరాల పిల్లలందరికీ ఇస్మార్ట్ సర్వే చేయడం జరుగుతుంది అని చెప్పడం జరిగింది. వయస్సును బట్టి ప్రశ్నలు ఇవ్వడం జరిగింది అని, ప్రతి పిల్లలలో మేదో వైకల్యం ఎలా ఉందో తెలుసుకొని శారీరక, మానసిక వైకల్యం తొందరగా గుర్తించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని, ఈ సర్వేతో పాటు ప్రతి అంగన్వాడి సెంటర్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని ఫ్యామిలీ సర్వే కూడా చెయ్యడం జరుగుతుందని అన్నారు. వేసవి కాలం దృశ్య మే నెలలో లబ్ధిదారులందరికి హోం రేషన్ ఇవ్వడం జరుగుతుందని, జులాయివాడ అంగన్వాడి కేంద్రంలో ఉన్న గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు హోం రేషన్ పంపిణీ చెయ్యడం జరిగిందని, పిల్లల ఎత్తులు, బరువులు తీసి తల్లితండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్టు సిడిపిఓ మమత, సెక్టార్ సూపర్వైజర్ కవిత, అంగన్వాడి టీచర్, ఆయా, గర్భిణిలు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల అభివృద్ధికి కృషి

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవదుర్గ ఆలయా అభివృద్ధి పనుల కోసం కోటి రూపాయలు నిధుల మంజూరు పత్రాన్ని శనివారం రోజున నవదుర్గ సేవా సమితి సభ్యులకు జగిత్యాల జిల్లా మాజీ జడ్పి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో జగిత్యాల అభివృద్ధి ప్రదాత బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అందజేశారు. జగిత్యాల జిల్లా అభివృదికి ఎల్లపుడు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. అమ్మవారి దయ అందరిపై ఉండాలని కోరుకుంటూ నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శాలువతో సన్మానించి, ఎమ్మెల్సీ కవితకు, జగిత్యాల జిల్లా మాజీ జడ్పి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ కి నవదుర్గ సేవా సమితి సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరి శ్రీనివాస్, అంగారి నాగరాజు, బుస ఉమాపతి, అనుమల్ల వాసు, అంగారి విజయ్ కుమార్, సిరపురపు జితేందర్, గుండేటి వెంకట రమణ, అనుముల చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ రాజు



**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.రాజును శనివారం స్థానిక తహసీల్ కార్యాలయంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, అద్ది,దడ్వాయిల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జమ్మికుంట మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతు సోదరులు, ప్రజల సమస్యల పట్ల అలసత్వం లేకుండా తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దొడ్డ శ్యాం కుమార్, కందాల తిరుపతి, అడ్తిదారులు మర్రి రాంరెడ్డి, ఎగిత అశోక్, మర్రి తిరుపతి, గుత్తి కుమార్ గౌడ, శ్రీనివాస్, కొండారి రవీందర్, సతీష్, శ్రీనివాస్, మోహన్, పాపిరెడ్డి తదితరులున్నారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలో ఈ నెల 4న(ఆదివారం) జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర పమేలా సత్పతి తెలిపారు. శనివారం ఎల్ ఎండి కాలనీలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాలో 2975 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఈ మేరకు మొత్తం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని అన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష హాలులోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డుపై ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, మరొక పోస్టు కార్డు సైజ్ ఫోటోను అతికించాలన్నారు. అదనంగా మరొక పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోను అప్‌డేట్ ఆధార్ కార్డును, లేటెస్ట్ ఫోటోతో కూడిన ఐడి ప్రూఫ్‌ను అభ్యర్థులు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లను, ఇతర ఎలాంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని సూచించారు. పరీక్ష కేంద్రంలోని అభ్యర్థులకు అక్కడే పెన్నులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ వంటివి అనుమతించబడవని అన్నారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును మరోసారి పర్యవేక్షించాలని, నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రశ్న, జవాబు పత్రాల తరలింపులో పటిష్ట బందోబస్తు, పకడ్బందీ నిఘా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం 0878 2997247 నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

## నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/కోరుట్ల:** యాసంగి పంటలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లాలోని మేడిపల్లి మండలం వల్లంపల్లి, దమ్మన్నపేట్, భీమారం మండలం వెంకట్రావ్ పేట్, ఐకెపి వరిధాన్యం కేంద్రాలను, భీమారం మండలంలోని పిఏసిఎస్ కోరుట్ల మండలం ఎకీన్‌పూర్ పిఎసిఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తేమశాతం వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు రికార్డు చేయాలని, కలెక్టర్లు సెంటర్లలో అవతవకలు జరిగినట్లయితే కఠిన చర్యలు తప్పవని సెంటర్ల నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్‌రెడ్డి, డిఆర్‌డివో రఘువరన్, డిసిఒ మనోజ్‌కుమార్, మండల ఎంఆర్‌ఒలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఖనిలో శనివారం స్థానిక భాస్కరరావు భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జెండా నీలి అరుణ పతాకాన్ని సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షు డు శనిగరపు చంద్రశేఖర్, సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్‌లు మాట్లాడుతూ అఖిలభారత యువజన సమాఖ్య భారతదేశంలో ఆవిర్భవించి 66 సంవత్సరాలు అవుతున్నదని ఆవిర్భవించిన నాటి నుండి నేటివరకు యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత ఎఐవైఎఫ్‌కే దక్కిందని ఆ పోరాట ఫలితంగా దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి అమలవుతున్నదని అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా నిరుద్యోగ భృతి ఇవ్వాలని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, అసాలా నవీన్, సుధీర్ మాతంగి సాగర్, శని గరపు తిరుమల,గని, పి.కనకరాజ్, జగన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ఉపాధి హక్కులకు నిరంతరం ఉద్యమం

రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 66వఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఎఐవైఎఫ్ జెండాను రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బోయిని అశోక్ ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ విద్యా ఉపాధి అవకాశాలు అందరికీ అందకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉద్యమాల ద్వారానే హక్కులను కాపాడుకోవాలని, అందుకు పాలక ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని యువతకు పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మే 3, 1959న ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు 66 సంవత్సరాలుగా దేశ రాష్ట్రవ్యాప్తంగా యువతీ యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరాయంగా ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యువతీ యువకులు ఉపాధి అవకాశాలు లేక ఉద్యోగాలు కానరాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 11సంవత్సరాల కాలంలో ఉపాధి రంగానికి కేటాయించాల్సిన నిధుల మంజూరులో అలసత్వాన్ని వహిస్తుందని మండిపడ్డారు. దేశ భవిష్యత్తు నిర్ణయించాలన్నా. నవీన భారతాన్ని నిర్మించాలన్నా యువతతోనే సాధ్యమవుతుందన్నారు. యువతను ఉపయోగించుకుంటే దేశగతి మారిపోతుందన్నారు. కానీ పాలకుల విధానాల్లో మార్పుకు నోచుకోవడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగశాతం 42కు పెరిగిందన్నారు. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరునికి విద్య, ఉ పాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ తమకు సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చే శారు. యువతీ యువకులను ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా వాడుకుని తర్వాత వదిలేస్తున్నటువంటి పాలక ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడానికి సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి యుగంధ ర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా నా యకుడు బూడిద సదాశివ, ఎఐవైఎఫ్ నాయకులు సాంబరాజు, హేమంత్, అరవింద్, రాజు, అజయ్, చందు, రమేష్, సురేష్, బాబు, వినయ్ తదితరులున్నారు.

## ఎన్నికల హామీల అమలుకోసం పోరాడాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపు



**ప్రజాపక్షం/రామడుగు:** ఎన్నికల హామీల అమలు కోసం గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు ప్రజల కోసం పోరాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రామడుగు గ్రామంలో సిపిఐ గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సృజన్ కుమార్‌మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిపిఐ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, అందులో భాగంగానే ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి కేంద్రంలో, రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న వారిని హామీలు అమలు పరచాలని సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలన్నారు. ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల పేరుతో అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వకుండా సొంత పార్టీ కార్యకర్తలు రాజకీయం చేస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా పేదలకు ఇండ్లు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకునే నాధుడే లేరని, వెంటనే స్థానిక ఎన్నికలు పెట్టాలని అన్నారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆలస్యం అవుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, పెన్షన్స్ పెంపు, రైతుల రుణమాఫీ, తదితర హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని సృజన్ హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, మండల నాయకులు కీర్తి కుమార్, దాము భూమయ్య, యోగి బీరయ్య, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డు నుంచి డంపు యార్డును తరలించాలి

సిపిఐ నగర శాఖ నాయకుల డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగర శివారు బైపాస్ రోడ్‌లోని డంపు యార్డును తరలించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు కోరారు.ఈ మేరకు డంపు యార్డును తరలించి వచ్చే పొగను వెంటనే ఆర్పివేయాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయ ముట్టడికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ నగరంలోని బైపాస్‌రోడ్‌లో గల డంప్ యార్డు వల్ల దాదాపు పది డివిజన్లలో ముఖ్యంగా కోతిరాంపూర్ ,అలకాపురి, హనుమాన్‌నగర్, గణేష్ నగర్, లక్ష్మి నగర్, హౌజింగ్ బోర్డు, కట్టరాంపూర్, పోచమ్మవాడ, శాషామహల్, మారుతి నగర్, అలుగునూర్, బొమ్మకల్ ప్రజలకు ఎండాకాలంలో మంటలు అంటుకుని పొగరావడం వల్ల వాయు కాలుష్యం నెలకొని చాలామంది ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులతో హాస్పిటల్ పాలవుతున్నారన్నారు. గర్భిణులు పొగ పీల్చడం ద్వారా పుట్టే బిడ్డలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, కనీసం నగరపాలక అధికారులకు డంపు యార్డు తరలింపుపై ఆలోచన లేకోపవడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో కరీంనగర్ మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యుడు గంగుల కమలాకర్, మాజీ మేయర్ సునీల్‌రావు కొన్ని కోట్ల రూపాయలతో చెత్తను శుద్ధి చేయడం కోసం మిషనరీ ఏర్పాటు చేశారని, ఆ మిషనరీ రెండు, మూడు రోజులు మాత్రమే నడిచి మూలకు పడ్డదని కోట్ల రూపాయల మిషనరీలో కుంభకోణానికి మేయర్, ఎమ్మెల్యే పాల్పడ్డారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపు యార్డు మిషనరీ కొనుగోలుపై న్యాయ విచారణ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి డంప్ యార్డులో వస్తున్న మంటలను ఆర్పివేయుటకు చర్యలు తీసుకోవాలని, వెంటనే డంపింగ్ యార్డుని ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలి

శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి శాంతియుత వాతావరణంలో చర్చలు జరిపించాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. హింస ద్వారా శాంతి స్థాపన జరగదని, రాజీ మార్గంతో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. జమ్మికుంట పట్టణంలో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల మధ్య శాంతి చర్చల ఆవశ్యకతపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర బాధ్యుడు డా.తిరుపతయ్య ఆధ్వర్యంలో సదస్సును ఏర్పాటు చేయగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి ఒక్కరికీ జీవించే హక్కును కల్పించిందని, అటువంటి హక్కు నేడు ఆదివాసీ ప్రాంతాలలో ఉన్నవారికి ఉపయోగ పడడం లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరిగి ఆదివాసీ ప్రాంతాలలో శాంతి నెలకొల్పాలని, ఇరు వర్గాల మధ్య యుద్ధ వాతావరణం నివారింపబడాలని కోరారు. ఒక సమస్యను రాజకీయంగా, శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవడం ఒక గొప్ప ఆదర్శమన్నారు. ఆ బాధ్యత రాజ్యాంగానికి లోబడి పాలించాల్సిన ప్రభుత్వాలపై ఎక్కువగా ఉంటుందని వెల్లడించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన నాయకులు ప్రతి ఒక్కరికి జీవించే హక్కు కల్పిస్తామని రాజ్యాంగంలో ఉన్నప్పుడు వారికి ఎందుకు ఆ హక్కును కల్పించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంల మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పి చైర్మన్ కనుమల్ల విజయ, గుంటి సామ్రాజ్యం, పింగిలి రమేష్, వాసుదేవ రెడ్డి, దేశిని కోటి, పోడేటి రామస్వామి, నరహరి, సదయ్య, పుల్లూరి సంపత్‌రావు, పొనగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అధికారుల వత్తాసు తగదు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ ఆక్షేపణ




**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ అనుచరులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం అన్యాయమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ మండిపడ్డారు. శంకరపట్నం మండల కేంద్రంలో బోయిని అశోక్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామ కమిటీలను నియమించిందని, అయితే ఆ కమిటీ సభ్యులు తమకు అనుకూలంగా ఉన్న వా రిని పార్టీకి విధేయత ఉన్న వారిని అర్హతతో సం బంధం లేకున్నా ఇందిరమ్మ ఇండ్లు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు అధికా రయంత్రాంగం వత్తాసు పలకడం తగదన్నారు. ఫలితంగా అసలైన లబ్ధిదారులు కొన్నేళ్లుగా ఇండ్ల కోసం నిరీక్షిస్తున్న వారికి తిరిగి నిరాశే ఎదురవుతోందని వాపోయారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో పదేళ్ల కాలంలో ఒక డబుల్ బెడ్‌రూం ఇల్లు సై తం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పన ఇస్తామని ప్రకటించినప్పటికీ అర్హులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయగా వారి ఆధ్వర్యంలో అర్హులను పక్కన పెట్టి అనుచరులకే ఇండ్లను మం జూరు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టిసారించి అనర్హులను పక్కన పెట్టి అర్హులైన నిరుపేదలకే ఇండ్లు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు కన్నం సదానందం, గోదారి లక్ష్మ ణ్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిపెండెంట్‌లకు ఉద్యోగ ఉత్తర్వులు అందించిన రాష్ట్ర ప్రభుత్వం

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ వెల్లడి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణి యాజమాన్యంపై గుర్తింపు సంఘం ఎఐటియుసి చేసిన ఒత్తిడి మూలంగా మెడికల్ ఇన్వాల్యుడేషన్ ఐన కార్మికుల డిపెండెంట్లకు 35 సంవత్సరాలు దాటిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో 35సంవత్సరాలు దాటిన డిపెండెంట్ లు అర్హత కోల్పోతున్న నేపథ్యంలో గత ప్రభుత్వమే దీనిని అమలు చేస్తామని హామీ ఇస్తూ ప్రకటన చేసిందని,కారణాలు ఏమైనా ఆ ప్రభుత్వము దీన్ని అమలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. వారసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితులలో దీనిని అమలు చేయించాలని గుర్తింపు సంఘంగా యాజమాన్యంపై తీవ్ర ఒత్తిడి పెంచామని,ఈ నేపథ్యంలో గత ఆరు నెలల క్రితమే 35 సంవత్సరాలు దాటిన వారికి కూడా ఉద్యోగాలు ఇస్తామని సర్క్యులర్ జారీ చేసినప్పటికీని యాజమాన్యం వారికి ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వలేదని ఆయన తెలిపారు. దీనిని వెంటనే అమలు చేయాలని లేనట్లయితే 40 సంవత్సరాల వయసు దాటిన డిపెండెంట్లు వారి సర్వీస్ కోల్పోతున్నారని యాజమాన్యం దృష్టికి ఏఐటియుసి తీసుకెళ్ళడం తో వెంటనే ఆఫీస్ ఆర్డర్లు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు.సింగరేణి లో ఈ పథకాల అమలుకై ఏఐటియుసి సీరియస్ గా చిత్తశుద్ధితో పనిచేస్తుందని,కనుక గని కార్మికులు ఏఐటియుసి కృషి ని గుర్తించాలని ఆయన కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ తాండూర్:** తాండూరు మండల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రేచిని గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకుంటే పూర్తి మద్దతు ధర లభిస్తుందని, రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి. ఈసా, మాజీ ఎంపిపి సిరంగి శంకర్, సాలిగామ బానయ్య, మాజీ ఎంపిటిసి మొగిలి శంకర్, ఎఇఒ ధనలక్ష్మి, ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్లు పుల్లం తిరుపతి, కేశెట్టి సంతోష్, దేవరకొండ రాజయ్య, మాసాడి తిరుపతి,షేక్ అహ్మద్, భాస్కర్ గౌడ్, సహకార సంఘం సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** రాజీవ్ యువ వివాసం పథకానికి సంబంధించిన అర్హులను ఎంపిక చేయడానికి ఈనెల 8న కాగజ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తు దారులు హాజరు కావాలని చింతగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతగూడ గ్రామ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనార్టీ కార్పొరేషన్‌ల కొరకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు 8వ తేదీన ఉదయం 10 గంటలకు దరఖాస్తు ఫారం, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర సంబంధిత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరు కాని దరఖాస్తు దారుల దరఖాస్తులను తిస్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా ఎఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్ ఆధ్వర్యంలో ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద ఎఐవైఎఫ్ జెండాను సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్ మాట్లాడుతూ దేశంలో సింహ భాగం యువత ఉందని రేపటి దేశ భవిష్యత్తు అయిన యువతను విద్యా ఉద్యోగ సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో యువతను ప్రోత్సహించి వారి అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మి నారాయణ, జిల్లా సమితి సభ్యులు గుండా చంద్రమాణిక్యం, ఎఐవైఎఫ్ నాయకులు నస్పూరి అభిలాష్ పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల రాజీవ్ నగర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, డిగ్రీ కళాశాలలోని నాలుగు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ మంచిర్యాలలో నాలుగు కేంద్రాలలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నామని, పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడటానికి సెంటర్లను సందర్శించడం జరిగిందని అన్నారు. ఈ నాలుగు సెంటర్లలో 1224 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాలలో 163 బిఎన్ఎస్ఎస్ ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సెక్టార్ సూపరింటెండెంట్‌తో మాట్లాడామని, లోపల ఉన్న సిబ్బంది, ఇన్విజిలేటర్లకు ప్రత్యేక సూచనలు కమిటీ ద్వారా అందజేస్తారని తెలిపారు. పోలీస్ సిబ్బంది బయట నుండి వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తారని, పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పటిష్టంగా ఉంటుందని సిపి వివరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లరాదని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకుని పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి ఆర్. ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఇన్స్పెక్టర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డు జారీ

**ప్రజాపక్షం/ నస్పూర్:** రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డు జారీ చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న నూతన రేషన్ కార్డులు, కార్డులలో సభ్యులను చేర్చడంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులను సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లాలో 956 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డులలో పిల్లలను చేర్పించుట, ఇతర మార్పులకు సంబంధించి 29 వేల 237 దరఖాస్తులు విచారించి ఆమోదించడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు గ్రామానికి చెందిన బోడ యాదయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు.మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడేవాడు.జీవితం పై విరక్తి చెందిన యాదయ్య శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని ఎస్సై పేర్కొన్నారు.

## రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం 15 వరకు అవకాశం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలలో మొత్తం 22,694 విద్యార్థులు హాజరు కాగా 21,928 మంది ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల ఉత్తీర్ణత శాతం 97.26 శాతం కాగా అందులో బాలుర ఉత్తీర్ణత శాతం 95.99 శాతంగా, జిల్లా మొత్తం ఉత్తీర్ణత శాతం 96.62గా నిలిచిందని రాష్ట్రంలో జిల్లా 16వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం విద్యార్థులు ఫలితాలు వచ్చిన నుండి 15 రోజులలో 15 మే 2025 వరకు తగు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీటికి కావల్సిన అప్లికేషన్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించబడునని, ఫీజు వివరాలకు సంబంధిత పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

# నీట్ 2025 పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ


### నీట్ పరీక్షకు 487 మంది అభ్యర్థులు
### కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:** జిల్లా కేంద్రంలో మే 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ 2025 ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని అదనపు ఎస్‌పి మహేందర్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సంబంధిత అధికారులతో కలిసి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో తరగతి గదులను తనిఖీ చేసి, నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు), జామర్ల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 366 మహిళా అభ్యర్థులు, 121 మంది పురుష అభ్యర్థులు మొత్తం 487 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, తదితరాల వంటి మౌలిక వసతులను సమకూర్చాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదుల్లో ఎక్కడా కూడా ఎటువంటి కాగితం ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతను అమలు చేయాలని, ప్రతి అభ్యర్థిని నిశితంగా పరిశీలించాకే పరీక్ష కేంద్రం లోకి అనుమతించాలన్నారు. పరీక్ష రోజున (మే 4) ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని 1:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్ లను మూసివేస్తారన్నారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని, మహిళా అభ్యర్థులు అవసరం లేని ఆభరణాలు ధరించవద్దని, హ్యాండ్ కర్చీఫ్, మొబైల్ ఫోన్లు, వాచ్, బెల్ట్, పెన్, పెన్సిల్, రబ్బర్, శార్పనర్, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే పరీక్ష అడ్మిట్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, దానిపై గల పరీక్ష కేంద్రం వివరాలను సరైన విధంగా సరి చూసుకోవాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లో లిఫ్టులు మరమ్మతులు వెంటనే చేపట్టాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ (అదిలాబాద్):** అదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్స్‌లో మూడంతస్తుల భవనం ఎక్కడానికి అనేక మంది ఇబ్బంది పడుతున్న పేషెంట్లను దృష్టిలో పెట్టుకొని వెంటనే లిఫ్టులు మరమ్మత్తులు చేయాలని లేనిడలా రిమ్స్ ఆస్పత్రి ముందు సిపిఐ పార్టీ ధర్నాకు దిగుతాయని శనివారం రోజు డైరెక్టర్‌కు తెలియజేయడంత్వరలోనే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించడం జరిగిందని వెంటనే జిల్లా కలెక్టర్ చర్య తీసుకొని మరమ్మత్తులు చేయించి పేషెంట్లలకు వసతులు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శిములుగు ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## 800పైగా కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

### ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
### పేదల సంక్షేమ సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యం



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న 800 లకు పైగా కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బాగనోల్ల విజయ, వైస్ చైర్మన్ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం వర్గల్ లో తహసిల్దార్ బాలరాజుతో కలిసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. పేదల సంక్షేమం సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం కాగా, రాష్ట్రంలో ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ రోజుల్లో పేదింటి ఆడపిల్ల పెళ్లి చేయడం ఎంత కష్టమో ప్రతి ఒక్కరికి తెలిసిందేనని, అయితే దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆడపడుచు కానుకగా కళ్యాణ లక్ష్మి నిధులు మంజూరి చేసినట్లు చెప్పారు. అలాగే త్వరలోనే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరీ చేస్తుండగా, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 20న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కార్మికుల సమ్మె

### హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** 20న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమయ్య అన్నారు. శనివారం ఐడీఓసీలో సివిల్ సప్లయి కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సివిల్ సప్లయి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలాలను కేటాయించి స్వంత గోదాములను నిర్మించాలన్నారు. కార్మికుల కనీస పెన్షన్ 6 వేలకు పెంచాలని, ఏడుగురు సభ్యులుంటే యూనియన్ రిజిస్ట్రేషన్ చేసే పాత ప్రక్రియను పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, హన్మాండ్లు, దేవేందర్, రాజు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అధ్యక్షులు ఓమయ్య, సుధాకర్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులపై పని భారం పెంచేలా 12 గంటల పని విధానంతో పాటు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తెచ్చే ఆలోచనలను విరమించుకువాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హన్మాండ్లు, కవిత పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నస్పూర్ మండల సమితి ఆధ్వర్యంలో ఏరియాలోని కటిక దుకాణాల దగ్గర శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి లింగం రవి జెండాను ఆవిష్కరించారు. అనంతరం యువతకు అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1956 మే 3న కాన్పూర్‌లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని భగత్ సింగ్ కలలు కన్న ఆశయం కోసం ఏర్పడ్డ అఖిల భారత యువజన సమాఖ్య నేటికి 66 వసంతాలు పూర్తి చేసుకుందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఏటా రాష్ట్రంలో అనేక ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఉద్యోగాల కల్పనలో విఫలం చెందిందని ఆయన విమర్శించారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి మహేష్, ఎస్‌కె. అక్బర్, తిరుపతి, శ్రీనివాస్, రాజేష్, సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య పాల్గొన్నారు.

## అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నాఖాబందీ



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** జిల్లా ఎస్‌పి డా.జానకి షర్మిల ఆదేశాల మేరకు బైంసా ఎఎస్‌పి అవినాష్ కుమార్, నిర్మల్ ఏ.ఎస్పి రాజేష్ మీనల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పోలీస్ సిబ్బంది, జిల్లా ఎఆర్ సిబ్బందితో శనివారం సాయంత్రం ఒకే సారి నాఖాబంది నిర్వహించారు. సరియైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకోవటం జరిగింది. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో అసాంఘిక కార్యకలాపాలను అరికాట్టడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని వాహనాల వాళ్ళ జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహాయం అందదు, ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఎస్‌పి ఆదేశాలతో ప్రతిరోజు నగరంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అన్ని లాడ్జలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అవినాష్ కుమార్ ఐపిఎస్,రాజేష్ మీన ఐపిఎస్, ఇనస్పెక్టర్‌లు ,ఎస్‌ఐలు, ప్రొబేషనరీ ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించొచ్చు

### ఎస్‌పి శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్:** జిల్లాలోని మహిళలు, యువతులు ఎవరైనా హింసకు గురైనట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్‌పి శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరిలో షీ టీం ద్వారా 91 హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించామని, 23 అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించామని ఆయన తెలియజేశారు. 7 ఫిర్యాదులలో 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పనిచేస్తున్నాయని, ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670564, కాగజ్ నగర్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670565 తో పాటు డయల్ 100కు సమాచారం అందించవచ్చని ఎస్‌పి తెలిపారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్



### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పాత భవనంలో కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం సందర్శించారు. నుడా చైర్మన్ కేశవేణు నగరపాలకసంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు చికిత్స కోసం వచ్చే రిటైర్డ్ ఉద్యోగులకు తగు సదుపాయాలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెయింటిగ్ హాల్‌తో పాటు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్, ఔషధాలను పంపిణీ చేసే గదులను అందుబాటులోకి తేవాలని వెల్‌నెస్ సెంటర్‌కు ఆనుకుని ఉన్న గదులకు మరమ్మతులు చేయటంతో పాటు కొత్తగా వెయిటింగ్ హాల్ నిర్మించాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని పనులను సత్వరమే చేపట్టి పూర్తి చేయాలన్నారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగులకు, పాత్రికేయులకు నాణ్యమైన విద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. సమావేశ మందిరం పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సంఘ ప్రతినిధులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీఓ స్రవంతి, రవీందర్‌రావు, భూమాగౌడ్, మోహన్‌రావు, రామ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** దేశానికి అన్నం పెట్టే రైతు అంటే ప్రతి ఒక్కరూ గౌరవిస్తారు రైతులను రాజును చేస్తామని మాది రైతు ప్రభుత్వమంటూ ప్రసంగాలు చేస్తారు. కానీ నిజంగా కష్టమస్తే మాత్రం ఎవరు పట్టించుకోరు. రైతు ఆరుంగాలం కష్టపడి వరి పంటను పండించి ప్రభుత్వ కొనుగోలు సెంటర్‌లో ధాన్యాన్ని పోసి ఆరబెట్టి కుప్ప నూడ్చి రైతు పొలంలో పని చేస్తూ వడదెబ్బతో మరణించి ద్వాదశ కర్మ (11) రోజుల కార్యక్రమం పూర్తయిన కొనుగోలు కేంద్రంలో నుంచి మాత్రం వరి ధాన్యం రైస్‌మిల్లులకు చేరని పరిస్థితి నెలకొంది. వివరాల ప్రకారం ధర్పల్లి మండలంలో హొన్నాజీపేట్ సొసైటీ పరిధిలోని వాడీ కొనుగోలు సెంటర్‌లో రైతు రాములు ధాన్యం పోసి నెల రోజులకు పైగా గడుస్తున్న సొసైటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెం తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒకరైతు చనిపోయాడు అతని కుటుంబ బాధలో ఉంటారన్న ఏమాత్రం ఇంగిత జ్ఞానం కూడా లేకుండా సొసైటీ అధికారులు వ్యవహరించటం ఏంటని రైతు కుటుంబ సభ్యులు బాధను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు సొసైటీ వారికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితుల్లో తెలిసిన వ్యక్తుల ద్వారా చెప్పించిన కూడా ఇనుమంతైనా స్పందించకపోవడం గమనార్హం. ఫోన్ ద్వారా రిక్వెస్ట్ చేయగా ఎలాగోలా కొనుగోలు సెంటర్‌లో నమోదు చేసుకున్న నెంబర్ ప్రకారం వరిధాన్యం తూకం వేసి వారం రోజులు పూర్తయ్యాయి. రైతు ద్వాదశ దినకర్మ పూర్తయిన కూడా ఆ లోపు తూకం వేసిన బస్తాలను రైస్‌మిల్లులకు పంపించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు లారీల కొరతతో వడ్ల బస్తాలు తీసుకెళ్లాలంటే ఒక్కో సంచికి మూడు రూపాయలు ఇవ్వాలనిడిమాండ చేయడం గమనార్హం. ఇది ఒక రైతు పరిస్థితి జిల్లాలో ఇలాగే కొనసాగుతున్న జిల్లా యంత్రాంగం మాత్రం ఇటు వైపు చూడటం లేదు. జిల్లా అధికారులు ఐడీఓసీలో అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతలకు అన్యాయం జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటాం. జిల్లా కలెక్టర్‌తో పాటు డీఎస్‌ఓ లాంటి జిల్లా అధికారులు వరి ధాన్యం పరిశీలనలు వచ్చినప్పుడు అంత బాగానే ఉందని కాగితాలపై లెక్కలు చూపిస్తూ తప్పించుకుంటున్నారు. రైతును రాజును చేయాల్సిన అవసరం లేదని తాను పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసి సహకరిస్తే చాలని ఎక్కువ రోజులు ఎండలో ఉండటంతో వెయిట్ లాస్ వస్తుందని రైస్‌మిల్లర్లు కట్ చేస్తున్నాని రైతుకు కోరుతున్నారు.

# నేటి నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ కాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** నేటి నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులు సకాలంలో పరికా కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు వెల్లడించారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 3,320 మంది పరీక్షకు హాజరు కానున్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో ఐఐటి కందిలో 1,2 పరీక్షాకేంద్రాలు, కేంద్రీయ విద్యాలయంలో ఎద్దు మైలారంలో 1 పరీక్ష కేంద్రాన్ని గవర్నమెంట్ హై స్కూల్ శివాజీ నగర్‌లో 1 పరీక్ష కేంద్రం మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని అన్నారు. అభ్యర్థులు పరీక్షా ప్రారంభం అయ్యే సమయానికి కనీసం అరగంట ముందే లోనికి చేరుకోవాల్సి ఉన్నందున నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితువు పలికారు. పరీక్ష కేంద్రం లోనికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితులోను పరీక్షా కేంద్రంలోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్షా హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు రిజిస్ట్రేషన్ తనిఖీ ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు పైన ఒకపాస్‌పోర్ట్ సైజ్ ఫోటో మరొక పాస్ పోర్ట్ కార్డు అతికించాలని అన్నారు. అదనంగా మరొక పాస్పోర్ట్ సైజ్ ఫోటోను అప్లోటెడ్, ఆదార్ కార్డును లేటెస్ట్ పోటోతో కూడిన ఐడి ప్రూ ను అభ్యర్థులు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిపికెట్లను తీసుకురావాలన్నారు. పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని పోలీసు బందోబస్తు ఉంటుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు.

ఫోకస్

# క్రీడ

## శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల ఫైన్



ఐపిఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. మంగళవారం (ఏప్రిల్ 30) చెన్నైలోని ఎం.ఏ.చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు నిర్దేశిత సమయంలో తమ ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోవడం ఇదే తొలిసారి. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, శ్రేయస్ అయ్యర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో యుజ్వేంద్ర చాహల్ హ్యాట్రిక్ తీసినప్పటికీ, శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లు అర్ధ సెంచరీలతో విజయంలో కీలక పాత్ర పోషించారు. వారి అద్భుత ప్రదర్శనతో పంజాబ్ కింగ్స్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ ఓటమితో ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేస్ నుంచి తప్పుకుంది. శ్రేయస్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చారు. అయితే, ఈ మ్యాచ్‌లో పంజాబ్ బౌలర్ల నిదానంగా ఓవర్లు వేయడంపై ఐపీఎల్ అధికారుల దృష్టి పడింది. నియమాల ప్రకారం నిర్ణీత సమయానికి ఓవర్లను పూర్తి చేయకపోతే దాన్ని నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇది మొదటిసారి కావడంతో శ్రేయస్ అయ్యర్‌కు కేవలం జరిమానాతో సరిపెట్టారు. అయితే, భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ జరిగితే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటారు.

## ఐపిఎల్ 2025లో టాప్-3 సూపర్ క్యాచ్‌లు

ఐపిఎల్ 2025 సీజన్ అత్యంత ఉత్కంఠభరితంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు 51 మ్యాచ్‌లు పూర్తి కాగా, కొన్ని బౌలింగ్‌తో, మరికొన్ని బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాయి. అయితే ప్రేక్షకుల గుండెలను గెలిచింది మాత్రం ఫీల్డర్ల అద్భుత క్యాచ్‌లే. ఈ ఏడాది మూడు అద్భుతమైన క్యాచ్‌లు అభిమానుల మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. రషీద్ ఖాన్ ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేయడం, కమిందు మెండిస్ డెవాల్డ్ బ్రెవిస్‌ను అద్భుతంగా పెవిలియన్‌కు పంపడం, దుష్మంత సమీరా అనుకూల్ రాయ్‌ను అవుట్ చేయడం.. ఇవన్నీ ఐపిఎల్ 2025లో సూపర్ క్యాచ్ లు గా నిలిచాయి. తుది దశకు చేరుకున్న ఈ సీజన్‌లో చాలా మ్యాచ్‌లు థ్రిల్లింగ్ గా సాగాయి. బ్యాట్స్‌మెన్ పరుగులు సునామీ రేపగా, బౌలర్లు నిప్పులు వర్షంతో పాటు స్పిన్ మాయాజాలంతో అదరగొట్టారు. ఇక





ఫీల్డింగ్ లో కూడా అనేక అద్భుతాలు కనిపించాయి. మ్యాచ్ కొన్ని అద్భుతమైన క్యాచ్ లు మ్యాచ్ ఫలితాన్నే మార్చేశాయి.

1. రషీద్ ఖాన్ – ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం
సన్ రైజర్స్ హైదరాబాద్–గుజరాత్ టైటన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్‌ను మలుపు తిప్పే క్యాచ్‌ను అందుకున్నాడు జీటీ ప్లేయర్ రషీద్ ఖాన్. ఎస్ఆర్‌హెచ్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ షార్ట్ బాల్‌ను లాంగ్ ఆన్ వైపు సిక్స్ కొట్టాలని యత్నించాడు. అయితే బాల్ సరైన ఫోర్స్‌లో వెళ్లలేదు. దీంతో బౌండరీ లైన్ వద్ ఫీల్డర్ రషీద్ ఖాన్ చిరుతలా పరిగెత్తి, గాల్లోకి ఎగిరి అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా క్యాచ్ పట్టేశాడు. ఈ క్యాచ్‌ను చాలా మంది సీజన్ బెస్ట్‌గా పేర్కొంటున్నారు.
2. కమిందు మెండిస్– బ్రెవిస్‌ను ఔట్ చేసిన క్యాచ్
చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ కమిందు మెండిస్.. డెవాల్డ్ బ్రెవిస్‌ను అద్భుతమైన క్యాచ్‌తో ఔట్ చేశాడు. హర్షల్ పాటేల్ బౌలింగ్‌లో బ్రెవిస్ సిక్స్ కొట్టే ప్రయత్నంలో బౌండరీ దాటి వెళ్లే బాల్‌ను కమిందు గాల్లోకి ఎగిరి సూపర్ మ్యాన్ లా క్యాచ్ పట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇది మజికల్ ముమెంట్స్‌లో ఒకటిగా మారింది.
3. దుష్మంత సమీరా–అనుకూల్ రాయ్ ని ఔట్ చేసిన క్యాచ్
ఢిల్లీ క్యాపిటల్స్‌కోల్ కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో దుష్మంత సమీరా అద్భుతమైన మ్యాచ్‌తో అనుకూల్ రాయ్‌ని అవుట్ చేశాడు. అనుకూల్ రాయ్ బాల్‌ను లెగ్ సైడ్‌గా ఫ్లిక్ చేయగా, అది బౌండరీ దాటేలా కనిపించింది. కానీ సమీరా తన ఎడమవైపుగా పులిలా దూకి బాల్‌ను పట్టేశాడు. దీంతో ఒక్కసారిగా అందరూ షాక్ అయి వెంటనే అరవడం మొదలెట్టారు.

## విరాట్-అనుష్క తాగే నీరు ఏవియన్ లీటరుకు రూ.4 వేలా!





టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లి, బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. పరుగుల మిషన్ టీమిండియా ప్లేయర్ విరాట్ కోహ్లి, తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచాన్ని ఆకర్షించారు. 36 ఏళ్లలో కూడా దూకుడుగా ఆడుతున్న తన అభిమానులను ఎంటర్‌టైనమ్ చేస్తారు. ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఏమిటి? క్రికెటర్ విరాట్, అనుష్క ఏ నీళ్లు తాగుతారో చూద్దాం. వారు ఏవియన్ నేచురల్ స్ప్రింగ్ వాటర్ తాగుతారట. ఏవియన్ నేచురల్ స్ప్రింగ్ వాటర్ ఫ్రాన్స్‌లోని జెనీవా సరస్సు దగ్గర నుండి వస్తుంది. ఇందులో అధిక మొత్తంలో ఖనిజ లవణాలు ఉంటాయి. ఏవియన్ లీటరు కు 4000 రూపాయలు. అమెజాన్‌లో ఒక లీటర్ బాటిల్ 600 రూపాయలు. ఈ నీటిలో సహజసిద్ధమైన బ్లాక్ ఆల్కలీన్ ఉంటాయి. ఇవి శరీరాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండేలా చేస్తుంది.

## కొత్త ప్రేయసితో శిఖర్ ధావన్

ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్‌తో తనకున్న సంబంధంపై శిఖర్ ధావన్ క్లారిటీ ఇచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ మై లవ్ అంటూ ఎమోజీతో వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోను పంచుకున్నాడు. మాజీ భార్య ఆయేషా ముఖర్జీ నుండి విడాకులు తీసుకున్న రెండు సంవత్సరాల తరువాత భారత స్టార్ బ్యాటర్ శిఖర్ ధావన్ ఐర్లాండ కు చెందిన సోఫీ షైన్‌తో డేటింగ్‌లో ఉన్నారనే వార్తలపై క్లారిటీ ఇచ్చాడు. ఇటీవల సోషల్ మీడియా పోస్ట్‌లో శిఖర్ ధావన్ సోఫీ షైన్‌తో తన సంబంధాన్ని ధృవీకరించాడు. దీంతో అన్ని ఊహాగానాలకు తెరపడింది. ధావన్, షైన్ చాలా కాలంగా ఒకరితో ఒకరు డేటింగ్ చేస్తున్నారు. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మై లవ్ అంటూ ఎమోజీ సింబల్‌తో శిఖర్ ధావన్ వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోను ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేశాడు. ఈ పోస్టుకు సోఫీతో పాటు చాహల్ కూడా లైక్ కొట్టారు. దీంతో ఈ జోడీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

### సోఫీ షైన్ ఎవరు?

సోఫీ షైన్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.34 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ప్రకారం ఆమె 2018 నుండి నార్తర్న్ ట్రస్ట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రొడక్ట్ కన్సల్టేషన్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆమె యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలోని కంపెనీలో పనిచేస్తుంది. ఆమె ఐర్లాండ్‌లోని లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీని పూర్తి చేశారు. కాజిల్‌రాయ్ కాలేజీలో కూడా చదువుకుంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ధావన్, షైన్ స్టాండ్స్‌లో కలిసి కనిపించారు. దీంతో అప్పటి నుంచి వీరు వైరల్ గా మారారు. కాగా, శిఖర్ ధావన్ 2012లో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఆయేషాను వివాహం చేసుకున్నాడు. 2023 అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టు ఈ స్టార్ భారత క్రికెటర్ ధావన్‌ఆయేషాకు విడాకులు మంజూరు చేసింది. ఈ జంటకు



2024లో కుమారుడు జోరావర్ జన్మించాడు. ధావన్ ఆగస్టు 2024లో అన్ని రకాల ప్రొఫెషనల్ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. అతను చివరిసారిగా 2024లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఆడాడు. భారతదేశం తరపున చివరిగా డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన ఒడిఐలో ఆడాడు.

## కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కనీస వేతనం కార్మికులకు నెలకు రూ.26వేలు ఇవ్వాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సామిల్ అండ్ డింబర్ డిపో ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కాసర్ల గోవర్ధన్ సమ్మె నోటీసును ఓరుగల్లు సామిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ ఎంతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ, 29 కార్మిక చట్టాలను రద్దుకు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌గా బడా బూర్జువా పెట్టుబడి దారి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. ఇప్పటికే సామిల్ కార్మికులు చాలి చాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు గడుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలు తీసుకొని పనిచేస్తూ వారికి బోనసు సర్వీస్, ఈఎస్ఐ, పిఎఫ్, పని భద్రత లాంటి సౌకర్యాలు వర్తించడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలు అమలు అయితే సామిల్ కార్మికులకు అన్యాయమే జరుగుతుందన్నారు. కావున చట్టాలను రక్షించుకోవాలంటే మే 20 న దేశ వ్యాప్తంగా జరుగే సార్వత్రిక సమ్మెలో సామిల్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దామేర కృష్ణ, సామిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తురాసి రాజు, ముకుందం సీనియర్ కార్మికుడు బక్కయ్య, మధు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా పోరాటాలకు సన్నద్ధం

మే 26, 27 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభ : సిపిఐ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రజా పోరాటాలకు సిపిఐ శ్రేణులు సన్నద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హన్మకొండ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొట్టెపాక రవి అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక పార్టీలు విఫలం అయ్యాయని, హామీల అమలు కోసం ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టారని, ఆదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఇడిలను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ అని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసారని అన్నారు. సిపిఐ హన్మకొండ జిల్లా మహాసభ మే 26,27 తేదీలలో హసన్‌పర్తిలో జరగబోతున్నాయని, ఈ మహాసభలకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి , జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, బాషాబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, మునిగాల భిక్షపతి,మాలోతు శంకర్, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, ఏదునూరి వెంకటరాజం, వేల్పుల సారంగపాణి,మెట్టు శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యపరచాలని, ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సిపిఐ నాలుగవ మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిపిఐ 4వ మహాసభలను విజయవంతం చేయాలని, ఈ నెల 25న జరగనున్న మహాసభలకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన 2025, 26 ఆర్థిక బడ్జెట్ కార్పొరేట్లకు ఊతమిచ్చేలా, ప్రజలకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బడా వ్యాపారులకు రాయితీలు కొనసాగిస్తూనే, ఆరోగ్యం, విద్య, గ్రామీణ ఉపాధి, ఉపాధి హామీ పథకం, సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించారని ఆరోపించారు. నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, వ్యవసాయ సమస్యలను బడ్జెట్‌లో పట్టించుకోలేదని అన్నారు. ఇది కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పూర్తయినా ఎన్నికల హామీలన్నీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా పథకాల అమలులో రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలెండర్ రాయితీ, ఉచిత విద్యుత్ వంటి కొన్ని పథకాలు సానుకూల ఫలితాలనిచ్చాయని, సన్నబియ్యం పథకం మంచి పేరు తెచ్చిందన్నారు. మిగిలిన హామీలు అమలు చేయకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బిఆర్ఎస్ అప్పుల వల్ల ఆర్థిక సంక్షోభం ఉన్నా, దానిని అధిగమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. దేశంలో 2026 నాటికి నక్సల్స్‌ను లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన మారణహోమాన్ని సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లు, హత్యలు చేస్తున్నారని, బస్తర్, బీజాపూర్, కంకర్ ప్రాంతాలలో ఎన్‌కౌంటర్లు పెరిగాయని, నక్సల్స్ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణలో శాంతి కమిటీ వేయాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదని, బస్తర్‌లో ఆదివాసీలకు అండగా నిలుస్తున్న సిపిఐపై కక్షతోనే మనీష్ కుంజాంపై ఇడి దాడి చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ల ద్వారా నక్సల్స్‌ను చంపే విధానాన్ని ఖండిస్తూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, నక్సల్స్‌ను చర్చలకు ఆహ్వానించాలని, నక్సల్స్ కూడా ఆయుధాలు విడిచి ప్రజాస్వామ్యంలో పాల్గొనాలని సిపిఐ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా మహాసభకు ముందు మండల శాఖల మహాసభలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, తాళ్లపల్లి దివాకర్ పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం?

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల చేయకపోగా డిగ్రీ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేక వాయిదా పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమేనని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. ప్రభుత్వానికి కమీషన్లు రావనే ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలకు పొంతన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే డిగ్రీ పరీక్షలకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం కరీంనగర్ నగరంలోని స్థానిక బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల లేకపోవడం మూలంగా డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం లేదని, రాష్ట్రంలోని కాకతీయ, పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలకు ఫీజు బకాయిలు విడుదల లేక కళాశాలల నిర్వహణ జరగడం లేదన్నారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్న కళాశాలలు ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేది లేదని ప్రకటించాయని పేర్కొన్నారు. ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా డిగ్రీ మూడో సంవత్సరం ఆరవ సెమిస్టర్ పరీక్ష రాసే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆ సెమిస్టర్ విద్యార్థులు పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి పిజి సెట్, ఇతర సెట్లు రాయడానికి వీలుంటుందన్నారు. ఇప్పటికే సెట్ల తేదీలు వచ్చాయని, కానీ పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే ఆ విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిలను ఒకసారి సెటిల్మెంట్‌గా విడుదల చేస్తామని, మరోసారి ప్రతి నెల కొంత మొత్తం విడుదల చేస్తామని ప్రకటనలకే పరిమితం అవుతున్నారే తప్ప విడుదల చేయడం లేదన్నారు. విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్, శ్రావణ్, రాజేష్, శివ తదితరులున్నారు.

## నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

మతోన్మాద శక్తుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ ఆరోపించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ పతాక ఆవిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతు నిరుద్యోగుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదులు చేసిన దాడిని మన దేశం మీద దాడిగా కాకుండా మన లౌకిక తత్వం మీద,మన ఐక్యత మీద, మన ప్రజాస్వామ్య విలువల మీద దాడిగా చూడాలన్నారు. ఈ దాడిపై మతతత్వాన్ని రగిలించి మనషుల మధ్య ఉన్న సామరస్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్న శక్తులపై యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. యువత ప్రతి రంగంలో ముందుండాలని కోరారు. ప్రపంచ దేశాల కంటే భారత దేశంలో ఉన్న యువత సంఖ్య పెద్దదని, అలాంటి యువతీ యువకుల భవిష్యత్ కోసం ప్రభుత్వాలు ఏమి పట్టించుకోవడంలేదని తెలిపారు. నిరుద్యోగ సమస్య



లేకుండా చూడాలని కోరారు. నిరుద్యోగ యువత కు ప్రభుత్వ ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని తెలిపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృ తి కల్పించాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో అ ఖిల భారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజన సమస్యల పైన ఆందోళన పో రాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలి పా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సో తుకు ప్రవీణ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు కొమ్మెర రమేష్ చారి, కూనూరి భగత్, బొల్లపల్లి తిరుపతి, జంపా ల పవన్, అభిలాష్ సాయి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పదిలో కివి విద్యార్థుల హవా..




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాలలో కివి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారు. సెంట్ కరీ లిఖిల 600 మార్కులకు గాను 577, నల్ల వినూత్న 576, చిదురాల ప్రశాంత్ 576, సుంకరి సాయి అంజలి 574, దొంత సంజన 572 మార్కులు సాధించగా 500 పైబడిన మార్కులు 33 మంది విద్యార్థులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసి రజని, అధ్యాపక బృందం మురళి, శాంతకుమారి, రమేష్, ఇంతియాజ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే కార్మికహక్కుల సాధన

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రభుత్వాలు తమ నియంతృత్వ ధోరణితో కాలరాసిన హక్కులను మేడే స్ఫూర్తితో సంఘటిత ఉద్యమాలను కొనసాగించి తమ హక్కులు సాధించుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో తట్టుపల్లి గ్రామంలో దొండ రామ్మూర్తి అరుణపతాకాన్ని ఎగురవేశారు. సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 11సంత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల సంపద కేవలం కొద్దిమంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండడం వల్ల మునుపెన్నడూ లేని విధంగా అసమానతలు పెరిగిపోయి, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, అనారోగ్యం తీవ్రమయ్యాయన్నారు.బిజెపి ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తోందని, ప్రగతి శీల శక్తులు ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, బుడమ వెంకన్న, దొంతు సావిత్రి, రవి, షేక్ గఫార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు

**హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వార ందరికీ సముచిత ప్రాధాన్యం లభిస్తుందని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వరంగల్ పశ్చిమ నియోజక వర్గ సమావేశానికి పిసిసి అబ్జర్వర్లు హన్మకొండ జిల్లా పార్టీ సంస్థాగత ఇన్‌ఛార్జిలు కే.వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, వరంగల్ ఎం.పి. కడియం కావ్యపాల్గొన్నారు.నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రారంభమైందని, ముందుగా జిల్లా స్థాయి పార్టీ సమావేశం నిర్వహించామని, అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తి చేస్తామని, అలాగే కార్యకర్తలు నిరాశ పడవద్దని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తిస్తామని, డివిజన్ స్థాయి, బూత్ స్థాయి నాయకులే పార్టీకి పునాది అన్నారు. వరంగల్ ఎం.పి. కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌కి సేవ చేయాలనే ఆలోచన విధానంతో ప్రజల అవసరాలను తీర్చడంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ రియాజ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కూచన రవళి, టిపిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలి

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి**



**ప్రజాపక్షం/తొర్రూరు :** భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన గొప్ప రాజ్యాంగమని, రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు ముం దుకు రావాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జ్ బొర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. ఎఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ ఆధ్వర్యంలో మండలంలోని హరిపిరాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ టిపిసిసి సభ్యుడు ముత్తినేని సోమేశ్వర రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ పట్టణ అధ్య క్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, స్థానిక నాయకులు వల్లపు మల్లయ్య, నారా యణ, రావుల కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో నీట్ ప్రవేశ పరీక్ష



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ (యూ.జి) పరీక్ష సజావుగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు అభ్యర్థులను కేంద్రంలోనికి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు మాత్రమే అనుమతించాలన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సీపీ సూచనలు చేస్తూ అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు, 2 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటోలను తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. అడ్మిట్ కార్డ్ నందున్న సూచనలు పాటిస్తూ.. పరీక్ష కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని పోలీస్‌కమిషనర్ అభ్యర్థులు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్,ఐటీ కోర్, కమ్యూనికేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నేడు జిల్లాలో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నీట్ పరీక్షల నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశా లలో 240 మంది, జూనియర్ కళాశాలల్లో 105 మంది మొత్తం 345 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులను రెండంచల నిశిత తనిఖీ తదుపరి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచిం చారు. విద్యుత్ అతరాయం లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వేడి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలతో పాటు ఓఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర సేవలకుగా నుఅంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి సూచించారు. 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అను మతిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 నిమిషాల తర్వాత గేట్ మూసి వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. నీట్ యు.జి. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా అభ్యర్థులు, సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ట్యాబ్లెట్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, ఇయర్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదని, షూస్, బెల్ట్, ఆభరణాలు ధరిం అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ ప్రింట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని, అడ్మిట్ కార్డు లేకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని, పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ ఒక కాపీ అడ్మిట్ కార్డ్ కలెక్ట్ చేసుకుంటారని, అభ్యర్థులు రెండు కాపీలు తీసుకుని రావాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, పర్యవేక్షక అధికారులు ఆర్ శ్రీధర్, బి.బాలు నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయం

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

**47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కుల అందజేత**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పేదింటి ఆడ బిడ్డలు పెళ్లికి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ద్వారా లక్ష రూపాయలు అందజేసి పేదింటి ఆడబిడ్డలకు పెద్దన్నగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలుస్తున్నాడని భూపాలపల్లి ఎమ్మె ల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం ఉదయం భూ పాలపల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 47 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదా రులకు రూ. 47,05,452 విలువైన చెక్కులను ఎమ్మెల్యే సత్యనారాయణ రావు చే తుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అన ంతరం కార్యక్రమాన్నుద్దేశించి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, పేదింటి ఆడపడుచులకుఅండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కు లం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా క ల్యాణ లక్ష్మి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందన్నారు.ప్రజల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభు త్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, జిల్లా ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, ఆర్ఐ రామస్వామి, కాంగ్రెస్ నాయకులు బుర్ర కొమురయ్య, రామినేని రవీందర్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, తోట రంజిత్, రజినీకాంత్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి స్తంభాల ఆలయం పరిసరాల పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** వెయ్యి స్తంభాల ఆలయం చుట్టూ ఉన్న పరిసరాలను వరంగల్ కుడా చైర్మన్ ఇన గాల వెంకట్రామ్‌రెడ్డి పరిశీలించిన అధికారులకు తగు సూచనలు చేశారు. వేసవి సెలవుల వల్ల ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకుల సంఖ్య బాగా పెరుగుతున్న దృష్ట్యా ఆలయ వెలుపల అభివృద్ధి కోసం, పరిసరాల పరిశీలనలో భాగంగా ఆలయం చుట్టు పక్కల మౌలిక సదుపాయాలు, పర్యాటకులకు, భక్తులకు సులభంగా అందుబాటులో ఉం డేలా కుడా చైర్మన్ దృష్టి సారించారు. ఆలయం చుట్టుపక్కల ఉన్న స్థలం, దాని పరిసరాలు పిఓ అజిత్ రెడ్డి, ఇఇ భీంరావుతో కలిసి శనివారం పరిశీలించారు.నీరు, పార్కింగ్, మరుగు దొడ్లను, ఆల యం చుట్టూ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలో పరిశీలించారు. పరిసరాల పరిశీలన ఆధారంగా, అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని అందులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకుల కోసం సులభమైన మార్గాలు, భద్రతా చర్యలు, ఆల యం చుట్టు పక్కల ప్రాంతం అందంగా, ఆకర్షణీయంగా కనిపించేలా దృష్టి సారించాలన్నారు.

## నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకుగాను ఇందిరమ్మ ఇళ్లను అంది స్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జిల్లాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్లపై అదనపు కలెక్టర్ పింకేష్ కు మార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నియో జకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, పరిశీలన అధికారులతో గూగుల్‌మీట్ ద్వారా ఆయా పురపాలికలు, మండలాల వారీగా ఎంత మేరకు పూర్తి చేశారో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలో 13మంది, స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గం లో పరిశీలన అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. ఈ మేరకు లక్ష్యాల వారీగా నిర్దేశించుకుని అర్హుల ఎంపికను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, గృహ నిర్మాణ పిడి మాతృనాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మామునూరు ఎయిర్‌పోర్ట్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ పాలనలోనే సాధ్యం**

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్లు అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హంటర్ రోడ్డు సిఎస్ఆర్ గార్డెన్స్ లో వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సంస్థాగత నిర్మాణ, సన్నహక సమావేశం లో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రా జేందర్‌రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరం గల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అవి రెండు కళ్లలాంటివని, దాదాపు 20 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ పాలనలో పరిష్కరిం చుకు ంటున్నామని ఎంపీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం ఎంతో చేయూత ఇస్తుందన్నారు. వరంగల్ జిల్లా ప్రజల ఎన్నో ఏళ్ల కల మామునూరు ఎయిర్‌పోర్ట్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమైందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలియజేసారు. బీఆర్ఎస్ రజతోత్సవాల పేరుతో ప్రజలను మభ్య పెట్టాలని చూసిందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీగెలిపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా అబ్జర్వర్ లు రవిచందర్, అమీర్ అలీ ఖాన్, హనుమకొండ జిల్లా అబ్జర్వర్లు వినయ్ రెడ్డి, అషఫ్ అహ్మద్, టెస్కాబ్ చైర్మన్ మారినేని రవీందర్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



**రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు**

**ప్రజాపక్షం/నర్సంపేట:** మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనిరైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు అన్నారు. కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో సన్నాహక సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు న మిండ్ల స్వామి, సిఐటియూ జిల్లా అధ్యక్షులు మాలోతు సాగర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుచ్చాకాయల కృష్ణ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నాయ కత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తూ, నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి ముందుకు తీసుకొచ్చిందన్నారు. సామాన్యులపై బారాలు మోపి, కార్పొరేట్ గుత్తా సంస్థలకు పెట్టుబడు దారులకు వేలకోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించిందన్నారు. కార్మికులందరు పాల్గొని మే 20న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, సిఐటియూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, జిల్లా నాయకులు హన్మకొండ శ్రీధర్, నాయకులు బసికె మొగిలి, నర్సింహా రాములు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా యువత

**మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్**



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సూచించారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్త ఆధ్వర్యంలో జిల్లాలో మాదకద్రవ్యాలపై చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లా డుతూ యువత మాదకద్రవ్యాలకు బానిసలై భౌతికంగా, మానసికంగా క్షీణించి భవిష్యత్‌ను నాశనం చేసుకుం టున్నారని, ఇది ఒక సామాజిక సమస్యలుగా దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల బాని సత్వంతో నేర ప్రవృత్తి పెరిగిపోవడంతో పాటు, చదువు ఉద్యోగం లాంటి లక్ష్యంలకు దూరమవుతున్నారని, మాదక ద్రవ్యాల నిలువ, సరఫరా, రవాణా ప్రక్రియలో ఎవరైతే భాగస్వాములు అవుతారో వారికి కఠినంగా శిక్షలు ఉం టాయని బిసి సంక్షేమ సంఘం రాష్ట్రనాయకులు శంతన్‌రామరాజు, ప్రముఖ సైకాలజిస్ట్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మాదక ద్రవ్యాలు మత్తుపదార్థాల వ్యతిరేక సదస్సుల నిర్వహణలో ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుందని మహ బూబాబాద్ జిల్లాను డగ్స్, గుట్కా రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరం కృషి చేద్దామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆరేంద్ర వెంకటేశ్వర చారి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల వెంకన్న, భబూరతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, శ్రీనివస్, భగవాన్‌రెడ్డి, సుదీర్,శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

# చెల్పూర్‌కు మహర్దశ..

**రూ.5 కోట్లతో బస్టాండ్ నిర్మాణం**

**ఎమ్మెల్యే గండ్ర**



**ప్రజాపక్షం/గణపురం:** భూపాలపల్లి నియోజకవర్గం లోని గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచా యతీలో నూతన బస్టాండ్ కు త్వర లో నిర్మించబోతుంది. రూ.5కోట్లతో బస్టాండ్ ఏర్పాటు కానుందని భూపాలపల్లి నియోజక వర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న చెల్పూర్ ప్రజల సమస్య దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే గండ్ర సత్తన్న ప్రత్యేక దృష్టి సారించారు. దీనితో కేటిపిపి జెన్కో సౌజన్యం తో నూతన బస్టాండ్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు శనివారం కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ ప్రకాష్ తో స్థలాన్ని పరిశీలన చేశారు. జెన్కో యాజమాన్యానికి ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, నాయకులు మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న,లక్కం రాములు, కావటి రవి, సూరినేని సంపత్ రావు, పిన్నింటి మాధవరావు, కాల్వ రాంరెడ్డి, తోట సంతోష్, జకినపెల్లి బిక్షపతి, బీరెల్లి నరేష్ కంచర్ల కుమార్, కార్యదర్శి ముక్కెర హేమంత్ , గ్రామ పంచాయతీ కారోబార్ వేణు, జెన్కో అధికారులు పాల్గొన్నారు.

**రైతును మోసం చేస్తే సహించేది లేదు**

ధాన్యం కొనుగోలు సెంటర్లలో తరుగు పేరుతో రైతును మోసం చేస్తే సహించమని కఠిన చర్యలు ఉంటాయని భూపా లపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గణపురం మండలంలో జీవనజ్యోతి ప్లేరపి మహిళ సమైక్య వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే సత్తన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తన్న మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు తరుగు లేకుండా లాభం పొందాలని సూచించారు. అదేవిధంగా రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతు కుటుంబాల వివరాలు పంట నష్టం వివరాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంట నష్ట వివరాలను వ్యవసాయ ఉద్యాన శాఖల వివరాలను సక్రమంగా పంపించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అధికారులు మహిళా సమైక్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన తమ పాఠశాల విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీకాంత్ శనివారం ఘనంగా సన్మానిం చారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుండి మొత్తం 89 మంది విద్యార్థులకు 89మంది పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 562 మార్కులతో అభిజ్ఞ మొదటి స్థానం, 559 మార్కులతో శివాని రెండవస్థానం, 549 మార్కులతో తులసి, శిరీష మూడో స్థానంలో నిలిచారన్నారు. అలాగే ఈనెల 5వ తేదీనుంచి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని తమ కళాశాలలో ఎలాంటి ఫీజు లేదని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పాస్ అ యిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతికి కెయు డాక్టరేట్



**ప్రజాపక్షం/కెయూక్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో సఫరింగ్ అండ్ ప్రొటెస్ట్ ఇన్ సెలెక్ట్ నవల్స్ ఆఫ్ గీత హరిహరన్ అండ్ అనిత నాయర్ అనే పరిశోధన గ్రంథాన్ని డాక్టర్ దీపా జ్యోతి పర్యవేక్షణలో సమర్పించినందుకు గాను కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణధికారి డాక్టర్ కట్ల రాజేందర్ సంఘాల స్వాతికి డాక్టరేట్ ప్రకటించారు. స్వాతికి డాక్టరేట్ ప్రకటించినందుకు గాను దూరవిద్య కేంద్రం ఉద్యోగ సంఘం నాయకులు ఉద్యోగులు , కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యోగులుహర్షం వ్యక్తం చేశారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రాజీవ్ గృహకల్ప ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలి:సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాజీవ్ గృహకల్ప ఇండ్లను ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. నగరంలో ఇండ్లు లేక నిరుపేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పేదలకు పంపిణీ చేయాలన్నారు. శనివారం నగరంలోని 32వ డివిజన్ మహాసభ జహీర్‌పుర తండాలో దోన్‌వాన్ సురేష్ అధ్యక్షతన జరిగింది. సభలో సలాం మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు శిథిలమవుతున్నాయన్నారు. సిపిఐ 100వ సంవత్సరంలోని అడుగిడిన సందర్భంగా వాడవాడలా శత వసంతాల సభను నిర్వహించాలని ఆయన కోరారు. మహాసభలో డివిజన్ కార్యదర్శిగా దోన్‌వాన్ సురేష్ ఎన్నికయ్యారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి, నగర నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో రాస్తారోకో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని వెంటనే వాటిని పూడ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. రహదారికి మరమ్మతులు నిర్వహించాలని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని మమత రోడ్డు కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జానిమియా మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందన్నారు. చినుకుపడిందంటే ఆ ప్రాంత మంత చిత్తడిగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రతి రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దారి వెంబడి ప్రయాణిస్తున్న ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు మాత్రం గుర్తించడం లేదని ఆయన ఆరోపించారు. వెంటనే గుంతలు పూడ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి ,తదితరులు పాల్గొన్నారు.

## కాలువల మరమ్మతులు ఎన్నడో?



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరులోని ఎన్ఎస్‌పి పరిధిలో ఉన్న మధిర బ్రాంచ్ మధిర కాలువ కట్టలు బలహీనంగా ఉండి మరమ్మతులకు నిరీక్షిస్తూ ఉన్నవి. సుమారుగా కల్లూరు నుంచి 50 కిలోమీటర్ల పైగా ఉన్న ఈ కాలువ కట్టలు పూడికలు, కాలువ కట్టలు బలహీన పడటం తెగేందుకు సిద్ధంగా ఉండటం, రిటైనింగ్ వాల్స్ కొట్టుకొని పోవడం లాంటివి గత పది సంవత్సరాల నుంచి అదే విధంగా ఉంటూ మరమ్మతులకు నోచుకోక కాలువ కట్టలు బలహీనంగా ఉండటంతో అధికంగా నీరు ప్రవహించే సమయంలో ఎప్పుడు ఏ సమయంలో తెగిపోతుందో నని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, చెన్నూరు తదితర ప్రాంతాల వద్దల వద్ద కట్టల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. అదే విధంగా కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడం వలన కాలువ లోపల నాచు పేరుకుపోవడం అంచుల వెంబడి చెట్లు పెరిగి కాలువలను ఆక్రమించి ఉండటం వల్ల నీరు పారుదల ప్రవాహం తగ్గిపోయిందని , దీనివలన చివరి ఆయకట్టుకు నీరు చేరేందుకు ఎక్కువ సమయం పడుతుందని రైతులు తెలుపుతున్నారు. అధికారులు ఆలోచించి త్వరితగతిన రాబోయే ఖరీఫ్ సీజన్ కైనా మరమ్మతులు చేపట్టాలని అధికారులు ను రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్ఎస్‌పి సర్కిల్ అధికారులను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**జూలూరుపాడు మండల పరిధిలోని బేతాళ పాడు గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకు కేటాయించారని తెలియజేస్తూ ఏడుగురు వ్యక్తులు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్ ఎక్కిన వారిలో నలుగురు మహిళలతో పాటు ముగ్గురు పురుషులు ఉన్నారు. లేని వారికి ఇందిర ఇండ్లు కేటాయించాలని, కేటాయించే వరకు ట్యాంక్ దిగిపోమని చెప్పడంతో విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్‌లు ఘటన స్థలానికి వచ్చి వాటర్ ట్యాంక్ ఎక్కిన వారికి నచ్చ చెప్పినప్పటికీ తమకు న్యాయం జరిగే వరకూ ట్యాంక్ దిగబోమని తెలిపారు.

## రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:**చంద్రుగొండ మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ గోదాంలో వరి రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. క్వింటాలకు తరుగు కోసం మిల్లర్లు 5 నుండి 7 కిలోలు డిమాండ్ చేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మిల్లర్లు సివిల్ సప్లయ్ అధికారులు కుమ్మక్కై రైతును దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లోనే రైతులకు న్యాయం జరగకపోతే ఎలా అని ప్రశ్నించారు. రైతులు కష్టపడి ఎండనక వాననక పండించిన వరి ధాన్యాన్ని తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీ చేస్తున్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మిల్లర్లు దోపిడీ వెనుక జిల్లా అధికారులు ప్రభుత్వ పెద్దల హస్త ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. జిల్లా అధికారులు ఎందుకు రైతుల ధాన్యాన్ని దించుకోవడం లేదని మిల్లర్లను ప్రశ్నించడం లేదని కనీసం తనిఖీలు సైతం చేయడం లేదని దీనిపై రైతుల అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మిల్లర్ల దోపిడీ ఆగే వరకు రైతులు పరంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## కమ్యూనిస్టు యోధుడు, ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ మృతి

పువ్వాడ, కూనంనేని సంతాపం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:**భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, కమ్యూనిస్టు పార్టీ యోధులు, ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాద రావు 93 అనారోగ్యంతో శనివారం విశాఖపట్నంలో మృతి చెందారు. గురుప్రసాద రావు మృతి పట్ల సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, కొత్తగూడెం తాలూకాకు అనేక దశాబ్దాలపాటు కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహించి ప్రజలకు, కార్మికవర్గానికి, రైతాంగానికి గురుప్రసాద్ సేవలందించారని, పార్టీ విస్తారణకు కృషిచేశారన్నారు. న్యాయవాదిగా అన్యాయానికి గురవుతున్న పేదవర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఆదివారం గురుప్రసాద్ మృతదేహాన్ని వైద్యవిద్యార్థులకు పరిశోధన నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించనున్నట్లు కూనంనేని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవంలో గురుప్రసాద్ పార్థివదేహాన్ని ఉంచనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు.

## నిర్ణీత సమయంలో...
# అభివృద్ధి పనులు పూర్తి

* రిటైనింగ్ వాల్ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి
* రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు
* ఖిల్లా రోప్‌వే రోడ్డు విస్తరించాలి
* అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఒ సిద్దార్థ్ విక్రంసింగ్‌లతో కలిసి ధాన్యం కొనుగోళ్లు, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారుల పురోగతి, వెలుగుమట్ల అర్బన్ పార్కు, పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది వచ్చిన భారీ వరదల నేపథ్యంలో నిపుణుల కమిటీ సూచనల ప్రకారం చేసిన డిజైన్ మార్పుల మేరకు మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఖమ్మం నగరవాసులు మరోసారి ఇబ్బందులకు గురి కావద్దని ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు మంజూరు చేశామని పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని మంత్రి తెలిపారు. రెండు వైపులా ప్రణాళికాబద్ధంగా పని జరగాలన్నారు. 3.50 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతిని తట్టుకునేలా 8.5 కిలో మీటర్లకు పైగా రిటైనింగ్ వాల్ రెండు వైపులా పూర్తి చేయాలన్నారు. ఏడాదిలోగా పనులు పూర్తి కావాలని రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఏజెన్సీ అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు చేయాలన్నారు. నాగార్జున సాగర్‌లో తెగిపోయిన యుటిని వెంటనే పునర్ నిర్మించాలని మే నెలలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. షట్టర్స్ దగ్గర ఏదైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలన్నారు. మంచుకొండ లిఫ్టు దగ్గర హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు ప్రతిపాదించాలన్నారు. ఖమ్మం నగరం అండర్ డ్రైనేజీ క్రింద 8.5 కిలో మీటర్ల మురుగు నీటి కాలువను పూర్తిస్థాయిలో నిర్మించాల్సి ఉంటుందన్నారు. శాశ్వత ప్రాతిపదికన పనులు జరగాలన్నారు. జిల్లాలో రైసుమిల్లర్లపై కమాండ్ ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు రాక ధాన్యం కొనుగోలు సమస్యలు అధికంగా ఉన్నాయని, అకాల వర్షం కారణంగా రైతులు నష్టపోతున్నారని అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రెగ్యులర్‌గా పత్రికల్లో వార్తలు వచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఉన్న రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఖమ్మం ఖిల్లా రోడ్డు సాధ్యమైనంత మేర విస్తరించాలన్నారు. ఖిల్లా రోప్‌వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. ఖమ్మంజిల్లా కలెక్టరేట్ వరకు జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డు వచ్చేలా కృషి చేయాలని, ధంసలాపురం ఎగ్జిట్ దగ్గర రైల్వే లైన్ దగ్గర బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణ శంకుస్థాపన త్వరలో జరుగుతుందని ఖమ్మంజిల్లా ప్రధాన ఆసుపత్రికి అవసరమైన ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్, టూరిజం, వైద్య ఆరోగ్యశాఖ సివిల్ సప్లయ్, డిఆర్‌డిఒ అధికారులు ఆర్‌డిఒ నర్సింహారావు, సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా'స్కూల్స్

* అదనంగా మరో 47 స్కూల్స్ మంజూరు
* స్కూల్స్ నిర్మాణానికి రూ. 21వేల కోట్లు
* యంగ్ ఇండియా స్కూల్స్‌కు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బోనకల్ మండలం లక్ష్మీపురంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్బంగా భట్టి విక్రమార్క మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 ఏళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజా ప్రభుత్వం బ్రాండ్‌గా ఉన్నటువంటి యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేసుకుని వీటి ద్వారా లక్షలాది విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యాబోధన అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రపంచంతో పోటీపడేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 47 యంగ్ ఇండియా సమీకృత గురుకులాల మంజూరుకు చర్యలు తీసుకున్నామన్నారు. 105 పాఠశాలల నిర్మాణ పనులు అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్నామన్నారు. కనీసం 25 ఎకరాల్లో విస్తారంగా ఈ గురుకులాలు నిర్మిస్తున్నామన్నారు. వీటిలోనే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కోసం క్వార్టర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నీట్, ఐఐటి వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా శిక్షణ అందిస్తామన్నారు. అద్భుతమైన మేధస్సుతో కూడిన మానవ వనరులను అందించడమే యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షిల్ స్కూల్స్ లక్ష్యమన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా 105 స్కూల్స్‌ల కొరకు దాదాపు రూ. 21వేల కోట్లు ఖర్చు చేస్తూ ఈ పాఠశాలను నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, విద్యాశాఖ ఇఇ విన్సెంట్‌రావు, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఆర్‌అండ్‌బి ఎస్ఈ యాకూబ్, పిఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ జనాభాలో సగ భాగం కలిగిన యువ శక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని అఖిల భారత యువ జన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆరోపించారు. ప్రపంచ దేశాలు యువశక్తిని వినియోగించుకుని పురోగమిస్తుంటే భారతదేశం మాత్రం తిరోగమనంలో ఉందని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎఐవైఎఫ్ పతాకాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ యువశక్తిని అతిపెద్ద మానవ వనరుగా ఉపయోగించుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఉద్యోగాలు కల్పించక పోగా ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేసి దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. ఉద్యోగం లేని వారు ఒక రకమైన ఇబ్బందులు పడుతుంటే ఉద్యోగాల్లో ఉన్న వారికి సైతం భద్రత కరువైందన్నారు. ఉపాధి అవకాశాల కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగమా లేదా జైలా అని తేల్చుకునే రీ తిలో ఉద్యమించనున్నామన్నారు. జాబ్ ఆర్ జైల్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొనాల ని ఆయన పిలుపునిచ్చారు. మరో పక్క యువ మెదళ్లలో మత ఉన్మాదాన్ని ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ లాంటి మత సంస్థలు నూరిపోస్తున్నాయని ఆయన తెలిపారు. భారతదేశంలో ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక సంఘం అఖిల భారత యువజన సంఘం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు శ్రావణ్‌కుమార్, సహాయ కార్యదర్శి మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు , నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టేందుకే ఇంకుడు గుంతలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టేందుకే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం బూర్గంపాడు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన పలుగు పారా పట్టి ఇంకుడు గుంత తవ్వారు. ఈ పర్యటనలో భాగంగా జల్ సంచెయ్ జెన్ భాగీ దారిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం, వసతి గృహాలు, ఆసుపత్రులు, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని చెప్పడమే కాకుండా వెంటనే పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి పలుగు పారా పట్టి స్వయంగా కలెక్టర్ ఇంకుడు గుంతని తవ్వడం ప్రారంభించారు. కలెక్టర్ వెంట ఉన్న స్థానిక సంస్థల కలెక్టర్ విద్యా చందన, అధికారులు తట్టలతో మట్టి ఎత్తి పోశారు. ఈసందర్భంగా కలెక్టర్ గుంతల నిర్మాణానికి వేసవినే మంచి తరుణమని, ఈ కాలంలో తవ్వకుంటే..వర్షాకాలం నాటికి నీటిని భూమిలోకి ఇంకింవచ్చని, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పట్టణాలు, గ్రామాల్లో ఇంట్లో ఇంకుడు గుంత తవ్వుకుంటే మంచిదని అన్నారు. ఇంకుడు గుంత యొక్క కొలతలు ఒకటి మీటర్ వెడల్పు ఒక మీటర్ పొడవు, ఒక మీటర్ లోతుతో ఒక గుంటను తీసి అందులో అందుబాటులో దొరికే శిథిలాల వ్యర్థ్యాలు, చిన్న చిన్న రాళ్ళను నింపితే సరిపోతుందన్నారు. పదవ తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రిన్సిపల్ గీత జ్యోతిని కలెక్టర్ అభినందించారు. బూర్గంపాడు మండల పర్యటనలో భాగంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్, మోరంపల్లి బంజర్ పిహెచ్‌సి సెంటర్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని హై స్కూల్, అంగన్వాడీ సెంటర్లను కలెక్టర్ స్వయంగా పలుగు, పారా పట్టి ఇంకుడు గుంతను తవ్వి అందరిని ప్రోత్సహించారు. సారపాకలోని పాఠశాల పిల్లల ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించి మే నెల చివరి నాటికి ఏక రూప దుస్తుల తయారీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపిడిఓ జములారెడ్డి, ఎంఇఒఎదు సింహరాజు, ఎపిఒ విజయలక్ష్మీ , ఎంపిఒ బాలయ్య, పంచాయితీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు రైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/మధిర :** మధి ర పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రైతులకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూసిపిఎం ఆధ్వర్యంలో మా ర్కెట్ యార్డ్ ఎదుట విజయవాడ రో డ్డు నందు శనివారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భ ంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి మ డుపల్లి గోపాలరావు మాట్లాడుతూ ,వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎటువంటి రాజకీయ వత్తిళ్లు లేకుండా రైతులందరి నుండి సమానంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు .రైతులకు అండగా సిపిఎం పార్టీ ఉంటుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి అక్కడికి చేరుకున్న ఆందోళనకారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వటంతో రాస్తారోకోను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, రైతులు పాల్గొన్నారు.

## గోదావరి జలాల సాధనకు భారీ ప్రదర్శన

* హాజరైన మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
* ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తారా?



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగు నీరు అందించాలని,పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం పాతబస్ డిపో నుంచి పద్మశాలి కళ్యాణ మండపం వరకు వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మచ్చ వేంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు కోసం సాగు భూములు ఇచ్చిన రైతులకే సాగునీరు ఇవ్వకుండా చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టు డిజైన్లు ఎవరి ప్రయోజనం కోసం మారుస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి భూములకోసం జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తారా అని అన్నారు. డిజైన్ మార్చడం వల్ల జిల్లాలో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్లు లేకుండా పోయాయని ఇది జిల్లా ప్రజలకు చేసిన తీరని అన్యాయమని అన్నారు. జిల్లా రైతాంగం రాజకీయాలకతీతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ, కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరుగుతుంటే జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు స్పందించాలని ఆయన డిమాండ్ చే టశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల సాధన కోసం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, ఎంపితమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర వంద రోజులు 2600కి. మీ చేశామని, పోతినేని సుదర్శన్ నాయకత్వంలో మహారైతు పాదయాత్ర చేశామని తెలిపారు. తలాపునే గోదావరి పోతుంటే జిల్లా రైతులు సాగు నీరు లేక అవస్థలు పడుతున్నారని సిపిఎం సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాటం చేసిందని అన్నారు. డిజైన్ మార్చి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోవద్దని సాగునీటి సాధనకు మరో ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న చెరువులన్నింటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటి సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, డిస్ట్రిబ్యూటరీ కాల్వలను పూర్తి చేయాలని, జిల్లా రైతాంగానికి నీళ్ళు ఇవ్వకుండా తరలిస్తే చూస్తూ ఊరుకోమని జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఎజె ర మేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా క మిటీ సభ్యులు ,మండలకార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ ఉద్యమ దిక్సూచి అంజాన్‌కు నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారతదేశ రైతాంగ ఉద్యమం దిక్సూచిగా అతుల్‌కుమార్ అంజన్ పని చేశారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి తెలిపారు.భారతదేశ రైతాంగ సమస్యలపై అవగాహన కలిగి సమస్యల పరిష్కారానికి పోరాడిన మహోన్నతుడని ఆయన తెలిపారు. అతుల్‌కుమార్ ఏఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ఏఐకెఎస్ నేతృత్వంలో అంజన్‌కుమార్ సుదీర్ఘ కాలం పోరాటాలు నిర్వహించారన్నారు. సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు పాలకులు చేపట్టాల్సిన చర్యలను వివరించడంతో పాటు వాటి సాధనకు ఉద్యమ మార్గాన్ని ఎంచుకున్నారని జితేందర్‌రెడ్డి తెలిపారు. భారతదేశంలో నూటికి 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగ పరిరక్షణకు పోరాడటమే ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకట రెడ్డి, జిల్లా సమితి సభ్యులు బోడా వీరన్న, నాయకులు పోటు పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# ఆసియా కప్ కష్టమేనా?



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు వచ్చాయి. క్రీడా సంబంధాలపైనా ఆ ఎఫెక్ట్ పడనుందని.. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. క్రికెట్‌లోనూ ఇరు జట్ల మధ్య సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ విషయంలో ఐసీసీ కూడా దృష్టిపెట్టాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా కప్‌లోనూ భారత్ పాల్గొనడంపై ఇప్పుడు అనుమానాలు వెల్లువెత్తాయి. టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

"ఆసియా కప్ సాధారణంగా తటస్థ వేదిక పైనే నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంకా షెడ్యూల్‌ను ప్రకటించలేదు. బంగ్లాదేశ్ సిరీస్ అనంతరం సెప్టెంబర్‌లో వేదికను నిర్ణయించే అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ పాక్‌ల మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి దశలో నిర్వహించే అవకాశాలు తక్కువే" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

### బంగ్లా పర్యటన కూడా రద్దు!

ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ అక్కడికి వెళ్లాల్సిఉంది. అయితే, బంగ్లా పర్యటనకూ టీమ్‌ఇండియా వెళ్లే అవకాశం తక్కువేనని సమాచారం. "ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు చోటుంది. కానీ, దానిని కొనసాగించే ఛాన్స్‌లు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై బంగ్లా నేత చేసిన వ్యాఖ్యలే దీనికి కారణమని తెలుస్తోంది" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.




# షెపర్డ్ విధ్వంసం

చెన్నై సూపర్ కింగ్స్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఓపెనర్లు శుభారంభం అందించారు. చివరలో రమిరియో షెప్పర్డ్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. టాస్ గెలిచిన సీఎస్‌కే కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన జాకబ్ బెథెల్‌విరాట్ కోహ్లీ జోడీ అర్ధసెంచరీలతో చెలరేగింది. విరాట్ కోహ్లీ 33 బంతుల్లో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్ల సహాయంతో 62 పరుగులు చేశాడు. ఈ క్రమంలో విరాట్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 300 సిక్సర్ల మైలురాయిని అందుకున్నాడు. మరో ఓపెనర్ జాకబ్ 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 55 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఓపెనర్లు ఇద్దరు అవుట్ అయ్యాక స్కోర్ కాస్త నెమ్మదించింది. దేవ్‌దత్ పడిక్కల్(17), రజత్ పాటిదార్(11), జితే శర్మ(7) పరుగులు చేయగలిగారు. ఇక చివరలో రొమారియో షెపర్డ్ చెలరేగాడు. సిక్సర్లతో చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. షెపర్డ్ విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా ఆర్‌సీబీ భారీ స్కోర్ చేయగలిగింది. షెపర్డ్ 14 బంతుల్లో ఆరు సిక్సర్లు, నాలుగు ఫోర్ల సహాయంతో 53 పరుగులు చేశాడు. 378.57 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు చేయడం విశేషం. ఐపీఎల్‌లో వేగంగా హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. పాట్ కమ్మిన్స్, కేఎల్ రాహుల్ రికార్డును సమం చేశాడు. వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా రికార్డు యశస్వి జైస్వాల్ పేరిట ఉన్నది. జైస్వాల్ కేవలం 13 బంతుల్లోనే ఈ ఘనత సాధించాడు.




# విజయ్, రష్మిక హ్యాట్రిక్



ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రానున్న భారీ చిత్రాల్లో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో చేస్తున్న అవైటెడ్ చిత్రం కింగ్డమ్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత మరో టాలెంటెడ్ దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో సాలిడ్ ప్రాజెక్ట్‌ని విజయ్ చేయనున్నాడు. ఆల్రెడీ ట్యాక్సీవాలా చేసిన ఈ కాంబినేషన్ ఇప్పుడు మరో సినిమా చేసేందుకు సిద్ధం అయ్యారు. ఇక ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు నెలకొనగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కన్ఫర్మ్ అయ్యింది. దర్శకుడు అలాగే నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నుంచి లేటెస్ట్ హింట్స్‌తో ఇది కన్ఫర్మ్ అయ్యింది. ఇక అధికారిక ప్రకటన ఒక్కటి మాత్రం బాకీ అని చెప్పాలి.

# చిరు, అనిల్ ప్రాజెక్ట్‌పై ఇంట్రెస్టింగ్ బజ్!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇపుడు చేస్తున్న విశ్వంభర కాకుండా మరో భారీ సినిమాల లైనప్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో అనీల్ రావిపూడితో ప్లాన్ చేసిన సినిమా కూడా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం షూటింగ్ అతి త్వరలోనే మొదలు కానుండగా ఈ సినిమాపై లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ బజ్ ఒకటి వినిపిస్తుంది. అయితే ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్‌గా ఎవరు కనిపిస్తారు అని చాలా కాలం నుంచి ఓ టాక్ నడుస్తుంది. అయితే ఇపుడు నయనతార వరకు ఈ బజ్ రాగా ఆమెపై ఇపుడు మరో టాక్ వినిపిస్తుంది. నయన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కంటే ఒక పవర్ఫుల్ రోల్‌లో కనిపించే ఛాన్స్ ఉందట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తున్నారు.


# నా వ్యాఖ్యలకు చింతిస్తున్నా

### వివాదంపై విజయ్ క్లారిటీ



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కింగ్డమ్ రిలీజ్‌కి వస్తుండగా ఈ మధ్యలో తాను స్టార్ హీరో సూర్య నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్‌కి పాల్గొనడం జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో పహల్గమ్ దుర్ఘటనపై విజయ్ చేసిన ఎమోషనల్ కామెంట్స్ కొన్ని వివాదాలకి దారి తీశాయి. అయితే ఈ వివాదంపై విజయ్ ఇపుడు క్లారిటీ ఇచ్చాడు. తాను ఎక్కడా కూడా ఏ కుల ప్రస్తావన కూడా తీసుకు రాలేదని క్లారిటీ ఇచ్చాడు. తాను చేసింది కేవలం ఒకప్పటి తెగలు వారి ఐకమత్యం కోసం అని తెలిపాడు. తాను మొత్తంగా చెప్పాలి అనుకున్నది కేవలం శాంతి, ఐకమత్యం కోసమే అని ఈ మాటల్లో తన వల్ల ఎవరైనా బాధించి ఉంటే అందుకు క్షమాపణలు తెలుపుతున్నాని అని విజయ్ ఓ ప్రెస్ నోట్ ద్వారా రివీల్ చేసాడు. దీంతో తన కామెంట్స్ వైరల్‌గా మారాయి. గిరిజనులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ ట్రైబల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది కిషన్‌రాజ్ చౌహాన్, ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో ఈ నెల 7 ప్రారంభమయ్యే 72వ మిస్ వరల్డ్ పోటీల లోగోను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.







# స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్ బాల్ ప్రోత్సాహక అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల దినోత్సవం భువనేశ్వర్‌లో జరిగింది. 202425 సంవత్సరానికి తెలంగాణలోని హైదరాబాద్‌లో ఫుట్ బాల్‌ను ప్రోత్సహించడంలో, విశేష కృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలా దేవి ఐఎఫ్ఎస్ ఈ అవార్డును అందుకున్నారు. ఏఐఎఫ్ ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఐఎఫ్ ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, ఒడిశా గౌరవ ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ఒడియా భాషా సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర సభ్యులు అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనీ బాలాదేవి, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ తెలంగాణ ఫుట్ బాల్‌కు దక్కిన గౌరవం, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఏఐఎఫ్ఎఫ్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున వీసీ అండ్ ఎండీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 70.13 లక్షల మెట్రిక్ టన్నులు

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నారు. ఇప్పటీ వరకు దాదాపు 45 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం కొనుగోలు సెంటర్లకు చేరగా, ఇందులో 30 లక్షల మెట్రిక్ టన్నుల దాదాపు (45 శాతం) వరకు కొనుగోలు పూర్తి అయినట్లు సమాచార. సన్న వరి కోతలు ఇప్పుడిప్పుడే పూర్తి అవుతుండడంతో మరింత పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు సెంటర్లకు చేరే అవకాశం ఉంది. కొనుగోలు సెంటర్ల అకస్మిక తనిఖీలు : పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ ధాన్యం కొనుగోలు ఊపందుకుకోవడంతో పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ జిల్లాల లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల అకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇందు లోభాగంగా ఆయన శనివారంహనుమకొండ జిల్లాలోని పలు ధాన్యం సేకరణ కేంద్రాలను సందర్శించి, ధాన్యం కొనుగోలుసెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన ఆయన అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు. కేంద్ర కార్యాలయం నుండి అందే వాతావరణ సూచనల ఆధారంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను సక్రమంగా కొనసాగించాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యత కోసం ప్రతి కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు ఉపయోగించాలనీ, ట్యాబ్ ఎంట్రీలు వేగంగా పూర్తి చేసి, రైతులకు చెల్లింపులు త్వరగా చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# 'మిస్‌వరల్డ్'కు విస్తృత ఏర్పాట్లు చేయండి: సిఎస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మకమైన 'మిస్ వరల్డ్ ' కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు అధికారులను ఆదేశించారు. మిస్‌వరల్డ్ ఏర్పాట్లకు సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని సూచించారు.ఈ మిస్ వరల్డ్ 2025కు సంబంధించిన ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు శనివారం సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. విమానాశ్రయం, హోటల్స్, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రతను కల్పించాలన్నారు. పోటీదారుల కోసం సవివరమైన బుక్‌లెల్ సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జిహెచ్ఎంసి అధికారులను సిఎస్ ఆదేశించారు.డిజిపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ కగార్' ఆపండి...

# ఆదివాసీ హక్కులను కాపాడండి

### ఆదివాసీ హక్కుల పోరాట సమితి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేసి, నక్సలైట్లతో చర్చలు జరిపి, ఆదివాసీ హక్కులను కాపాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాల వారీగా ఆదివాసీల జీవన ప్రాంతాలల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో అల్లకల్లోలాన్ని సృష్టించి, ఆదివాసీలను అడవుల నుంచి వంపించే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్స పోచయ్య, రాష్ట్ర అధ్యక్షులు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మావోయిస్టులు ప్రతిపాదించిన శాంతిచర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, వారితో చర్చలు జరిపి, అడువుల్లో ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలన్నారు.చత్తీస్‌ఘడ్, బస్తర్ లాంటి ప్రాంతాల్లో ఆదివాసీలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతూ, బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 12 నుంచి 14వరకు ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) డిక్లరేషన్‌ను వివరించారు. ఎస్‌టి రిజర్వేషన్లు ఆదివాసీలకు అందకుండా చేస్తున్న లంబాడీ, బంజారా, నుగారి, గోరు మాటీలను ఎస్‌టి జాబితాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ఆదివాసీలకు కేటాయించిన ప్రత్యేక షెడ్యూల్, అధికరణాల ప్రకారం 29జిఓను చట్టం చేయాలని,2006 ఆటవీ హక్కుల చట్టాని అమలు చేసి, ఆదివాసీలకు ఆటవీ హక్కుల శాశ్వత పట్టాలు ఇవ్వాలని,ఆదివాసీల అసైన్డ్, లవాణీ పట్టాలను శాశ్వత పట్టాలుగా మార్చాలని వారు తెలిపారు. ఆదివాసీ వ్యాపార సంస్థ జిసిసికి ప్రత్యేక నిధులు కేటాయించి, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆదివాసీ ప్రాంతాలల్లో గిరిజనేతరులను అక్రమ వసలదారులుగానే పరిగణించి, వారికి స్థిర, చర ఆస్తులపైన ఎటువంటి హక్కులను కల్పించకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం సాగుబోయిన పాపారావు, ఆరెం అరుణ్ కుమార్, కల్తీ వెంకన్న, గౌరివేణి ప్రవీన్‌కుమార్, గౌడెం గణేష్, గొగ్గల్ల కోటయ్య, ఎస్.రాజేందర్, దాకర్ల రమేష్, చందా రఘుపతి,లక్ష్మణావు, సూర్యభాను తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌కు చేరుకున్న మిస్ కెనడా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమయింది. ఈ మిస్ వరల్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్ కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్ కు చేరుకున్న మిస్ కెనడా కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com